

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 13-9-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 149

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 10.30 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 9.35 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ.7.21-8.56, తె.5.14 మొదలు; దుర్ముహూర్తం: ఉ.8.32-9.20, మ.12.35-1.23; అమృతఘడియలు: సా.4.50-6.25; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.15

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





www.andhrajyothy.com
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 149
శుక్రవారం | 13-9-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా. 10.30 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 9.35 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ.7.21-8.56, తె.5.14 మొదలు; దుర్ముహూర్తం: ఉ.8.32-9.20, మ.12.35-1.23, అమృతఘడియలు: సా.4.50-6.25, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.15
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రధాని, సీజేఐ భేటీపై
అనుమానాలున్నాయ్
మా కేసు సీజేఐ విచారిస్తున్నారు..
న్యాయం జరుగుతుందా.. అన్న అనుమానం ఉంది
శివసేన నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు
సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయింది
సుప్రీం బార్ అసోసియేషన్ ఖండించాలి: ఇందిరా
సీజేఐ ఇంట్లో ప్రధాని పూజపై ప్రతిపక్షాల విమర్శలు
సీజేఐ ఇంటికి ప్రధాని వెళ్లడం తప్పా?
గతంలో మన్మోహన్ ఇఫ్తార్ విందుకు
సీజేఐ వెళ్లలేదా?.. బీజేపీ ధ్వజం


సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో గణపతి పూజలో మోదీ (ఫైల్)

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇంట్లో జరిగిన గణపతి పూజకు ప్రధానమంత్రి మోదీ హాజరవడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. బుధవారం ప్రధాని మోదీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి వెళ్లి గణపతి పూజలో పాల్గొనడంతో పాటు హారతి కూడా ఇచ్చారు. మోదీకి సీజేఐ

మిగతా 2వ పేజీలో...

రాలిపోయిన అరుణతార
12-08-1952 / 12-09-2024
సీతారాం ఏచూరి కన్నుమూత
న్యుమోనియాతో ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో మృతి
చిన్ననాటి నుంచే వామపక్ష భావజాలం
విద్యార్థి నాయకుడిగా ఎస్ఎఫ్ఐపై ముద్ర
ఎమర్జెన్సీ కాలంలో పీహెచ్‌డీని పక్కనపెట్టి.. పోరుబాట
రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్, రేవంత్, కేసీఆర్ నివాళులు



పాలస్తీనాపై దాడికి వ్యతిరేకంగా..
నిరంతరం ఉద్యమాల్లో పాల్గొంటూ, తన ఉపన్యాసాలతో మంత్ర ముగ్ధుల్ని చేసే ఏచూరి.. చివరిసారి జూన్‌లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా ఏర్పాటు చేసిన ప్రదర్శన అది. ఆ విషయంలో భారత్ తన ధోరణిని వెల్లడించాలని డిమాండ్ చేస్తూ.. అమెరికాపై మండిపడ్డారు.

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒక అరుణతార రాలిపోయింది. అరుణారుణ పోరుబాటపై అజరామరమైన ముద్ర వేసిన కామ్రేడ్ ఇక లేరు. పీడిత, తాడిత, అణగారిన వర్గాలవైపు నిలబడి.. వారి గొంతుకై ఎలుగెత్తిన వామపక్ష యోధుడు.. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం ఎయిమ్స్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 72 సంవత్సరాలు. గత నెల 19న ఆయన న్యుమోనియాతో బాధపడుతూ.. ఎయిమ్స్‌లో చేరారు. ఛాతీభాగంలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ ఉండడంతో వైద్యులు ఆయన్ను ఐసీయూలో ఉంచి చికిత్స చేశారు. వైద్యులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గురువారం మధ్యాహ్నం 3.05 గంటలకు ఆయన కన్నుమూశారు. ఎయిమ్స్ ఈ విషయాన్ని ఒక హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించింది. సీపీఎం మీడియా విభాగం కూడా ఈ విషయాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఏచూరి భార్య సీమా చిస్తీ ప్రస్తుతం న్యూస్ పోర్టల్ 'ద వైర్'కు ఎడిటర్‌గా సేవలందిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా.. ఒక కుమారుడు ఆశిష్ 2021లో కొవిడ్‌తో చనిపోయారు. కుమార్తె అఖిల.. ప్రస్తుతం ఎడింబరో విశ్వవిద్యాలయం, సెయింట్ ఆండ్రూస్ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. వామపక్షవాదులు, కార్యకర్తలకు ప్రేరణగా నిలిచిన సీతారాం ఏచూరి.. భారత రాజకీయాల్లో విలక్షణ నేతగా గుర్తింపు పొందారు. విద్యార్థి దశ నుంచి.. తన జీవిత చరమాంకం వరకూ.. సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారానికి

మిగతా 2వ పేజీలో...



రచ్చ.. రచ్చ!
అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం
పార్టీ ఫిరాయింపులపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం


అరెకపూడి గాంధీ

గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానన్న కౌశిక్.. ఆయన విల్లాకు వెళ్లిన గాంధీ, ఆయన అనుచరులు
టమాటాలు, కోడిగుడ్లతో దాడి, కిటికీలు, కుండీలు ధ్వంసం.. ప్రతిగా చెప్పులు విసిరిన బీఆర్ఎస్ కార్యకర్తలు
గంటన్నరపాటు హైటెన్షన్.. గాంధీ అరెస్టు, విడుదల.. సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్.. ఫిర్యాదు
గాంధీపై కేసు నమోదు చేయాలని బైఠాయింపు.. వారిని అరెస్టు చేసి కేశంపేట తీసుకెళ్లి వదిలిన పోలీసులు
ఇది ప్రభుత్వ దాడి.. పోలీసుల వైఫల్యం: హరీశ్‌రావు.. నేడు గాంధీ ఇంటిని ముట్టడిస్తాం: కౌశిక్
ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న కౌశిక్: అరెకపూడి.. గాంధీ, అనుచరులపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీ/మియాపూర్/ గచ్చిబౌలి/ హైదర్‌గూడ/ నార్సింగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుపై రచ్చ రచ్చ! ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం! ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి పార్టీ మారిన మరో 'బీఆర్ఎస్' ఎమ్మెల్యే! అక్కడ హై టెన్షన్ వాతావరణం! ఆయన అరెస్టు.. విడుదల! సీనులోకి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు! సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దా తీవ్ర ఉద్రిక్తత! అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు! వెరసి.. ఫిరాయింపులు, 'జెండా వివాదం' ఎమ్మెల్యేల మధ్య తీవ్రస్థాయి లొల్లికి దారి తీసింది! శేరిలింగంపల్లి రణరంగంగా

మిగతా 13వ పేజీలో...


కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గాంధీ అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

'ఎస్సీ వర్గీకరణ'పై
మంత్రుల కమిటీ
..ఐదుగురు మంత్రులు, ఒక ఎంపీ
చైర్మన్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
సుప్రీం తీర్పుపై అధ్యయనం,
సిఫారసులకు ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల(ఎస్సీ) వర్గీకరణపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ఐదుగురు మంత్రులు ఉండగా.. ఒక ఎంపీ ఉన్నారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, మంత్రులు దామోదర, దుద్దిళ్ల, పొన్నం, సీతక్కతో పాటు ఎంపీ మల్లు రవిని సభ్యులుగా నియమించారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎస్సీల వర్గీకరణ చేపట్టాలంటూ ఆగస్టు 1న సుప్రీం తీర్పును అనుసరించి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తీర్పును అధ్యయనం చేయాలని, ఉప వర్గీకరణకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించాలని కమిటీకి తెలిపింది. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణపై ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తూ ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని ఆదేశించింది.



విద్యుత్తు కొనుగోళ్లపై
నిషేధం!
261 కోట్లు చెల్లించలేదని
గ్రిడ్ కంట్రోలర్ చర్యలు
హైకోర్టును ఆశ్రయించిన
రాష్ట్ర విద్యుత్తు సంస్థ
స్టే విధించిన న్యాయస్థానం

12



బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే
బీఆర్ఎస్‌కు సీట్లు
కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ జవాబు చెప్పాలి
వాళ్లే అలా మాట్లాడించి ఉంటే.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలి.. లేదంటే కౌశిక్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి: రేవంత్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): "బతకడానికి వచ్చినావు.. నీవేందీ?" అంటూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దూషించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "వాళ్లు చెబితే కౌశిక్‌రెడ్డి మాట్లాడాడో? వాళ్లే మాట్లాడించారో? కేసీఆరే చెప్పాలి. వాళ్లే చెప్పి కౌశిక్ రెడ్డితో అలా మాట్లాడిస్తే కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. సొంతంగా మాట్లాడి ఉంటే అతణ్ని పార్టీ నుంచి సస్పెండ్ చెయ్యాలి. అయినా బతకడానికి వచ్చినవాళ్లు ఓట్లేస్తేనే బీఆర్ఎస్‌కు సిటీ(హైదరాబాద్)లో అన్నీ సీట్లు వచ్చాయి" అని

మిగతా 12వ పేజీలో...

'స్థానికత'పై
సుప్రీంకు సర్కారు
త్వరగా విచారించాలన్న
విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే
హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో
ఆగిన వైద్య విద్య ప్రవేశాలు
సుప్రీం తీర్పుపై విద్యార్థులు,
వైద్య శాఖ వర్గాల్లో ఉత్కంఠ

12

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?
12

స్నేహితులందరికీ 'సీత'!

దేశం మొత్తానికీ సీతారాం ఏచూరి అంటే వామపక్ష దిగ్గజం! కానీ.. స్నేహితులంతా ఆయన్ను ఆప్యాయంగా 'సీతా' అని పిలుచుకునేవారని ప్రముఖ ఆర్థికవేత్త, జేఎన్‌యూ ప్రొఫెసర్.. సీపీ చంద్రశేఖర్ తెలిపారు. సీతారాం ఏచూరి గురించి ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పార్టీకి విధేయుడిగా ఉంటూనే.. భారతదేశ రాజకీయ యవనికపై ప్రజాస్వామిక శక్తులతో వ్యవహరించే క్రమంలో కొంత పట్టువిడుపుల ధోరణితో వ్యవహరించాలని ఏచూరి భావించేవారని తెలిపారు. గడిచిన దశాబ్దకాలంలో భారత రాజకీయాలు నియంతృత్వం దిశగా మలుపు తీసుకున్న నేపథ్యంలో ఏచూరిలో ఆ దృక్పథం మరింత బలపడిందని వెల్లడించారు.

ఎమర్జెన్సీలో నా దగ్గరే: మోహన్ కందా

సీతారాం ఏచూరి.. ఎమర్జెన్సీ సమయంలో కర్నూలులో తన దగ్గరే తలదాచుకున్నారని ఆయన మేనమామ మోహన్ కందా తెలిపారు! మేనల్లుడికి, తనకు మధ్య వయసులో తేడా ఏడేళ్లేనని.. వరుసకు మేనమామ, మేనల్లుళ్లయినా అన్నదమ్ముల్లా మసలేవాళ్లమని వివరించారు. 1952 ఆగస్టు 12.. చెన్నైలో సీతారాం ఏచూరి పుట్టినప్పుడు ఆ నర్సింగ్‌హోం బయట తాను ఒక కారులో వేచి చూస్తున్నానని, అప్పటికి తన వయసు ఏడేళ్లని వెల్లడించారు. మేనల్లుడు పుట్టాడని ఆనందిస్తుండగా.. ఆ రోజు రోహిణీ నక్షత్రం, కృష్ణాష్టమి అని తెలిసిందని.. దీంతో తనను చూడనివ్వలేదని చెప్పారు. సంప్రదాయం ప్రకారం.. తర్వాత కొన్నిరోజులకు నూనెలో తన మేనల్లుడి ముఖం చూశానని, కుటుంబసభ్యులు, బంధువులు అతణ్ని 'బాబు' అనే పిలిచేవారని తెలిపారు. "సీతారాం మా అమ్మని 'అమ్మమ్మ' అనడానికి బదులుగా 'అమ్మా' అనే పిలిచేవాడు. తనని మా అమ్మానాన్నలు అల్లారుముద్దుగా చూసేవారు. దీంతో నాకు అప్పుడప్పుడూ ఈర్ష్య కూడా కలిగేది" అని మోహన్ కందా వెల్లడించారు. "జేఎన్‌యూలో చేరడమే రాజకీయాల్లో సీతారాం ప్రస్థానానికి నాంది అయింది. 1975లో ఎమర్జెన్సీ విధించినప్పుడు అతడు అండర్‌గ్రౌండ్‌లో ఉండాల్సి వచ్చింది. దీంతో మా అమ్మానాన్నలు.. సీతారాంని నాతోపాటు కర్నూలులో ఉంచాలని నిర్ణయించారు. అప్పట్లో నేను తనకు నచ్చజెప్పి రాజకీయాల నుంచి విరమించేలా చేద్దామని ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో విఫలమవడమే కాక.. నేనే తన బాటలోకి వెళ్లి, కమ్యూనిస్టులా మారిపోవడాన్ని త్రుటిలో తప్పించుకున్నాను" అని మోహన్ కందా తెలిపారు.

రాజ్యసభలో కీలక ప్రసంగాలు

రాజ్యసభ సభ్యుడిగా ఏచూరి ప్రజల గళాన్ని పార్లమెంట్‌లో వినిపించారు. 12 సంవత్సరాలు ఎంపీగా ఉన్న ఆయన.. 244 సార్లు కీలక ప్రసంగాలు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2017 ఆగస్టు 9న మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్రను వివరించారు. విదేశాంగ విధానాలు, దళితుల ఊచకోత, ధరల పెరుగుదల, రైతుల ఉద్యమాలు, ఎన్నికల సంస్కరణలు మొదలైన అనేక కీలక అంశాలపై ఆయన ప్రసంగించేప్పుడు సభలో నిశ్శబ్దం నెలకొనేదంటే.. ఆయన ఉపన్యాసాలు సభ్యులను ఎంతలా మంత్రముగ్ధుల్ని చేసేవో అర్థం చేసుకోవచ్చు. 2015 మార్చి 3న బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి.. ఏచూరి సవరణలను ప్రతిపాదించారు. దానిపై ఓటింగ్ జరగ్గా.. ఆయన సవరణల ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలోనే ఇలా జరగడం నాలుగోసారి కాగా.. 2015లో మోదీ సర్కారును ఇబ్బందికి గురిచేసిన అంశమిది. మూడోసారి ఆయనను రాజ్యసభకు పంపాలని పశ్చిమబెంగాల్‌లోని సీపీఎం నిర్ణయించినా.. పొలిట్‌బ్యూరో అంగీకరించలేదనే కారణంతో ఆయన తప్పుకోవడం గమనార్హం..!

ఒబామా రాకకు వ్యతిరేకంగా..

అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించేవారు. 2015లో భారత గణతంత్ర వేడుకలకు అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాకను ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా వామపక్షవాదులను ఏకం చేసి.. ఒబామా రాకకు నిరసనగా ఎక్కడికక్కడ ప్రదర్శనలను నిర్వహించారు. ఇస్లాం మతంలో ఛాందసవాదం పెరగడానికి అమెరికానే కారణమని ఏచూరి నిందించేవారు. పశ్చిమాసియాలో అమెరికా జోక్యంతోనే అశాంతి నెలకొంటోందని, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) మారణహోమానికి కూడా అమెరికా తీరే కారణమని విమర్శించేవారు. ప్రపంచంపై అమెరికా పెత్తనాన్ని నిలదీసేవారు. ప్రపంచంలోని వనరులు.. ముఖ్యంగా ఇంధన వనరులను దోచుకోవడానికి.. పెత్తనం చెలాయించడానికి అమెరికా అర్రులు చాస్తోందని మండిపడేవారు.

అర్ధరాత్రి ఫిడెల్ క్యాస్ట్రో పిలుపు

సీతారాం ఏచూరి ఓ సందర్భంలో ఊహించని విధంగా క్యూబా నేత ఫిడెల్ క్యాస్ట్రో నుంచి పిలుపునందుకున్నారు. 1994లో జ్యోతిబసు తదితరులతో ఏచూరి కూడా క్యూబా వెళ్లారు. రాత్రి సమయంలో ఉన్నపళంగా మాట్లాడడానికి క్యాస్ట్రో తమను పిలిపించారని ఏచూరి ఓ సందర్భంలో చెప్పారు. ఆ సమయంలో.. "భారతదేశంలో ఉక్కు ఉత్పత్తి ఏ స్థాయిలో ఉంది" అని అడిగారని.. అప్పటి నుంచి తాను ఎప్పుడు క్యూబా వెళ్లినా.. వెంట ఓ చిన్న గణాంకాల పుస్తకాన్ని తీసుకెళ్లేవాడనని ఏచూరి పేర్కొన్నారు. అపరాత్రి వేళ పిలవడంతో జ్యోతిబసు కొంత ఇబ్బందికి గురైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఉక్కు ఉత్పత్తిపై అడిగిన ప్రశ్నకు ఆయన వద్ద కూడా సమాధానం లేదని చెప్పారు. ఆరోజు తెల్లవారుజామున 2 గంటల వరకు తమ సమావేశం కొనసాగిందని వివరించారు.

సైన్స్ కోసం శరీరాల దానాలు

మరణానంతరం మత ఆచారాల ప్రకారం శరీరాన్ని ఖననం చేయడమో.. దహనం చేయడమో తెలిసిందే..! అయితే.. సీతారాం ఏచూరి మాదిరిగా శరీరాలను వైద్య విద్యార్థుల కోసం దానం చేసిన వారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో వామపక్ష ఉద్దండులే ముందు వరుసలో ఉండడం గమనార్హం..!

- ★ 80 ఏళ్ల వయసులో మరణించిన పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కోరిక ప్రకారం ఆయన పార్థివ దేహాన్ని కోల్‌కతాలోని నీల్ రతన్ సిర్కార్(ఎన్ఆర్ఎస్) వైద్య కళాశాలకు అందజేశారు. బుద్ధదేవ్ భట్టాచార్య 2006లోనే గణదర్పన్ అనే ఎన్జీవోకు ఈ మేరకు హామీ ఇచ్చారు.
- ★ 34 ఏళ్లపాటు బెంగాల్‌కు సీఎంగా సేవలందించిన జ్యోతి బసు 2003లోనే మరణానంతరం తన శరీరాన్ని వైద్య కళాశాలకు అందజేస్తానని ప్రకటించారు. 2010లో ఆయన మరణం తర్వాత కుటుంబ సభ్యులు పార్థివదేహాన్ని కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి అందజేశారు.
- ★ లోక్‌సభ మాజీ స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ 2000 సంవత్సరంలోనే తన మరణానంతరం శరీరాన్ని వైద్య విద్యకు అప్పగిస్తానని పేర్కొన్నారు. 2018లో ఆయన మృతి తర్వాత.. కుటుంబ సభ్యులు ఆయన ఆశయాన్ని నెరవేర్చారు.
- ★ సీపీఎం మాజీ కార్యదర్శి అనిల్ బిశ్వాస్, మరో నేత బెనోయ్ చౌదరి కుటుంబ సభ్యులు కూడా.. మరణానంతరం వైద్య కళాశాలలకు వారి శరీరాలను అప్పగించారు.





ప్రభావవంతమైన స్వరం మూగవోయింది



ఏచూరి మరణవార్త విని చాలా బాధపడ్డాను. ఆయన విద్యార్థి నేతగా, పార్లమెంటేరియన్‌గా జాతీయ రాజకీయాల్లో ప్రభావవంతమైన స్వరం వినిపించారు. నిబద్ధత కలిగిన సిద్ధాంతాలతో పనిచేశారు. ఏచూరి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సమర్థ పార్లమెంటేరియన్



ఏచూరి మరణానికి విచారిస్తున్నాను. ఆయన వామపక్షవాది అయినా.. రాజకీయ ప్రపంచంతో మంచి అనుబంధాన్ని పెంచుకున్నారు. ఆయన సమర్థమైన పార్లమెంటేరియన్‌గా తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి.

- ప్రధాని నరేంద్ర మోదీ

రాలిపోయిన అరుణతార

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నెన్నో ఉద్యమాలు నడిపారు. మరణం తర్వాత కూడా ఆయన తన పార్థివ దేహాన్ని ఎయిమ్స్‌కు అందజేయాలని కోరేవారు. భవిష్యత్ తరాల వైద్యుల బోధనకు, వారి పరిశోధనలకు తన శరీరాన్ని ఉపయోగించుకోవాలనేది ఆయన ఆకాంక్ష. కుటుంబ సభ్యులు ఆ ఆకాంక్షను నెరవేరుస్తూ.. ఎయిమ్స్‌కు ఆయన దేహాన్ని అప్పగించనున్నట్లు ప్రకటించారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీవర్గాల దర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఢిల్లీలోని ఏకే గోపాలన్ భవన్‌లో ఉంచుతామని సీపీఎం వర్గాలు ప్రకటించాయి. ఏచూరి మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, సీపీఐ నేత డి.రాజా తదితరులు సంతాపం తెలియజేశారు.

చదువుల్లో మేటి..

సీతారాం ఏచూరి పూర్వీకుల స్వస్థలం ఆంధ్రప్రదేశ్. ఆయన 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏపీఎస్ఆర్టీసీలో ఇంజనీరుగా.. తల్లి కల్పకం ప్రభుత్వోద్యోగిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన మోహన్ కందా.. సీతారాం ఏచూరికి స్వయానా మేనమామ. హైదరాబాద్‌లో పెరిగిన ఏచూరి చదువుల్లో మేటి. పదో తరగతివరకూ హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో చదువుకున్నారు. 1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో.. ఉన్నత విద్య కోసం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో (సీబీఎస్ఈ) 12వ తరగతి వరకూ చదివి.. ఆలిండియా టాపర్‌గా నిలిచారు. అనంతరం సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో అర్థశాస్త్రంలో డిగ్రీ (బీఏ ఆనర్స్) చదివి ఫస్ట్ ర్యాంక్ సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)లో ఎంఏ (అర్థశాస్త్రం)లో పట్టా పుచ్చుకున్నారు. తర్వాత పీహెచ్‌డీ ప్రారంభించారుగానీ.. ఎమర్జెన్సీ నేపథ్యంలో ఆయన చదువుకు ఫుల్‌స్టాప్ పడింది.

విద్యార్థి నేతగా..

జేఎన్‌యూలో చదువుతున్నప్పుడే.. సీతారాం ఏచూరి సీపీఎం స్టూడెంట్స్ వింగ్ భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ)లో పనిచేశారు. మూడు సార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘం నేతగా ఎన్నికయ్యారు. మరో వామపక్ష నేత ప్రకాశ్ కరాట్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. ఆ తర్వాత ఎస్ఎఫ్ఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. ఎమర్జెన్సీ రావడంతో పూర్తిస్థాయిలో ఉద్యమాల వైపు మళ్లారు. అరెస్టయ్యారు. కొన్నాళ్లు అజ్ఞాత జీవితాన్ని గడిపారు. తెలుగుతోపాటు.. తమిళం, బెంగాలీ, హిందీ, ఆంగ్లం, తదితర భాషల్లో అనర్గళంగా మాట్లాడే సీతారాం ఏచూరి సీపీఎంలో అంచెలంచెలుగా అనేక పదవులను చేపట్టి.. ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారు. విద్యార్థి నేతగా ఉన్న ఏచూరి ప్రతిభాపాటవాలను గుర్తించిన సీపీఎం అధిష్ఠానం.. 1984లో ఆయనను కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమించింది. 1995లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2015లో విశాఖపట్టణంలో జరిగిన సీపీఎం 21వ మహాసభలో ఆయన పార్టీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఎలాంటి గ్రామీణ నేపథ్యం లేకుండా.. హైదరాబాద్, ఢిల్లీ వంటి పట్టణ ప్రాంతాల్లో పెరిగిన సీతారాం ఏచూరి పార్టీ జనరల్ సెక్రటరీ స్థాయికి ఎదగడం విశేషం.

రాజకీయాలపై ఏచూరిది చెరగని ముద్ర

సీతారాం ఏచూరి అంటేనే ప్రత్యామ్నాయ రాజకీయాలు గుర్తుకు వచ్చేంతగా ఆయన తనదైన ముద్ర వేశారు. 'తాపట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అన్న చందంగా మొండిగా కాకుండా.. సమయాన్ని, సందర్భాన్ని బట్టి వ్యవహరించడం, అందరినీ కలుపుకొనిపోవడానికి ప్రయత్నించడం ఆయన పంథా. అందుకే పలుమార్లు ఆయన దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలిగారు. యునైటెడ్ ఫ్రంట్ నిర్మాణంలో.. దేవెగౌడ, ఐకే గుజ్రాల్ ప్రభుత్వాల హయాంలో కీలకంగా వ్యవహరించారు. యునైటెడ్ ఫ్రంట్ కనీస ఉమ్మడి కార్యక్రమ రచనలో ఆయన పాలుపంచుకున్నారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులోనూ ఏచూరి పాత్ర ఉంది. అయితే.. అణు ఒప్పందం విషయంలో కాంగ్రెస్‌తో విభేదాలు రావడంతో సీపీఎం ఆ కూటమి నుంచి వైదొలగింది. 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ఏచూరి బీజేపీయేతర పక్షాలను ఏకం చేయడానికి కృషి చేశారు. గత ఏడాది ఏర్పడ్డ 'ఇండియా' కూటమి ఏర్పాటులోనూ తనదైన పాత్రను పోషించారు.

చివరి వీడియో అదే..

కిందటి నెల 22న ఏచూరి ఆస్పత్రి నుంచి ఓ వీడియోను విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష దిగ్గజం, మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు ఆ వీడియోలో నివాళులర్పించారు. "నేను ఆస్పత్రిలో ఉన్నందున బుద్ధా దా సంస్మరణ సభకు హాజరు కాలేకపోతున్నా. ఆయనకు నివాళులు అర్పించడం నా బాధ్యత. బుద్ధ దాకు నా లాల్‌సలామ్ చెబుతున్నా" అని ఆ వీడియోలో సీతారాం పేర్కొన్నారు.

రచనలు

సీతారాం ఏచూరి పలు రచనలు చేశారు. సోషలిజం ఇన్ చేంజింగ్ వరల్డ్, మోదీ గవర్నమెంట్ న్యూసర్జ్ ఆఫ్ కమ్యూనలిజం, కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం, క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే తదితర పుస్తకాలు రాశారు. పీపుల్స్ డెమాక్రసీ పత్రికలో ఆయన ఎన్నో వ్యాసాలను రాశారు.

లోకం తీరు



మంచి స్నేహితుడిని కోల్పోయా

సీతారాం ఏచూరిజీ నాకు మంచి స్నేహితుడు. మన దేశం గురించి లోతైన ఆలోచనలు చేసేవారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

- రాహుల్ గాంధీ

వ్యక్తిగతం-రాజకీయాల సమతూకం

వ్యక్తిగత సమీకరణాలను.. అస్థిరమైన రాజకీయ సిద్ధాంతాలతో సమతూకం వేస్తూ.. అద్వితీయ పాత్ర పోషించగల వ్యక్తి సీతారాం ఏచూరి. ఆయన ఓ మేధావి. తన ఆదర్శాలతో ప్రజల పక్షాన నిలిచారు. ఆయన మరణం ఉదారవాద శక్తులకు తీరని లోటు. ఆయనకు ఇదే జోహార్.

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

సీపీఎం మూల స్తంభం

సీపీఎంకు ఏచూరి మూలస్తంభం లాంటి వారు. ఆచరణాత్మక ధోరణితో ప్రజల గళాన్ని వినిపించేవారు. ఆయన బహుభాషా గ్రంథకర్త. మంచి పార్లమెంటేరియన్. మూడు దశాబ్దాలకు పైగా ఆయనతో మంచి అనుబంధం ఉంది.

- జైరాం రమేశ్

జాతీయ రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి మృతి జాతీయ రాజకీయాలకు తీరని లోటు. ఆయన మరణవార్త తెలిసి బాధపడ్డాను. ఆయన కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలుపుతున్నాను.

- మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ సీఎం

వామపక్ష రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి మరణం వామపక్ష రాజకీయాలకు తీరని లోటు. ఆయన దోపిడీ రహిత సమాజం కోసం పోరాడేవారు. ఆయనతో నాకు దశాబ్దాల అనుబంధం ఉంది. సమకాలీన వామపక్ష ఉద్యమాల్లో ఆయన అత్యంత విశిష్టమైన వ్యక్తి. ఏచూరి భార్య సీమ, కుమార్తె అఖిల, కుమారుడు డానిష్‌కు నా సానుభూతి.

- డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

అవిశ్రాంత పోరాట యోధుడు

ఏచూరి అవిశ్రాంత పోరాట యోధుడు. అభ్యుదయ భావాలు మెండుగా ఉన్న నిండైనా రాజకీయవేత్త. నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు. ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేసిన జాతీయ నేత. తెలుగు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి గళం విప్పారు.

- మాజీ సీజేఐ ఎన్వీ రమణ

చాలా బాధకలిగించింది

ఏచూరి మరణ వార్త చాలా దుఃఖాన్ని కలిగించింది. ఏచూరి తనకు ఆత్మీయ సన్నిహితుడు. సీపీఎంలో సైద్ధాంతిక బలంతో తర్కబద్ధంగా విషయాలను చక్కగా వివరించే మేధావి - గవర్నర్ దత్తాత్రేయ

ఇందిర సమక్షంలో.. ఆమె రాజీనామాకు డిమాండ్



సీతారాం ఏచూరి జేఎన్‌యూ విద్యార్థి నేతగా ఉన్నప్పుడు.. 1977లో పలువురు విద్యార్థులతో ర్యాలీగా ఇందిరాగాంధీ ఇంటికి వెళ్లి జేఎన్‌యూ చాన్స్‌లర్ పదవికి ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు! ఇందిరాగాంధీ సమక్షంలో.. ఆమె పక్కన నిలబడి.. ఆమె రాజీనామాకు డిమాండ్ చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ సంఘటన గురించి ఏచూరి ఒకసారి స్వయంగా చెప్పారు. "ఎమర్జెన్సీ సమయంలో చాలామంది విద్యార్థులకు అరెస్టు నోటీసులు జారీ చేసి.. వాటిని వారి హాస్టల్ తలుపులకు అంటించేవారు. దీంతో.. వర్సిటీ చాన్స్‌లర్‌గా ఆమె రాజీనామా చేయాలనే డిమాండ్ విద్యార్థుల్లో ఊపందుకుని.. ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. అక్కణ్నుంచీ బయల్దేరి ఆమె నివాసానికి వెళ్లి.. రాజీనామా చేయాలనే నోటీసు ఆమె ఇంటి తలుపునకు అంటించాలని నిర్ణయించుకున్నాం. అక్కడికి వెళ్లాక ఐదుగురు విద్యార్థులనే లోపలికి అనుమతిస్తామని భద్రతాసిబ్బంది చెప్పారు. కానీ, మేం పట్టు పట్టడంతో అందరినీ పంపించారు. గేటు దాటి లోపలికి వెళ్లగానే.. ఆమె ఇంట్లోంచి బయటకు వచ్చి మమ్మల్ని కలిసి, ఏం కావాలని అడిగారు. ఆమె రాజీనామా చేయాలని మేం డిమాండ్ చేశాం" అని ఆయన వివరించారు. అప్పట్లో ఆయన ఇందిరకు కొద్ది దూరంలో నిలబడి.. తాము తీసుకెళ్లిన మెమొరాండంను చదివి వినిపిస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

అమెరికాలో రాహుల్ కార్యక్రమానికి

ఖలిస్థానీ మద్దతుదారుల హాజరు!

» వర్జీనియాలో మఖన్ షా గురుద్వారా ప్రతినిధులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: అమెరికా పర్యటనలో సిక్కులపై కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆయనకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. భారత్‌లో సిక్కులు తలపాగా ధరించే పరిస్థితి కూడా లేదని రాహుల్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని కేంద్ర మంత్రులు ధ్వజమెత్తారు. అయితే రాహుల్ వ్యాఖ్యలకు నిషేధిత ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం వర్జీనియాలో జరిగిన రాహుల్ కార్యక్రమానికి ఖలిస్థానీ మద్దతుదారులు కూడా హాజరయ్యారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు మద్దతు పలికిన రిచ్‌మండ్‌హిల్‌కు చెందిన బాబా మఖన్ షా గురుద్వారాకు చెందిన ప్రతినిధులు రాహుల్ కార్యక్రమానికి హాజరైనట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఖలిస్థానీ వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్‌ను అరెస్టు చేసినప్పుడు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్‌లో ఈ గురుద్వారా ప్రతినిధులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కారు ర్యాలీ నిర్వహించారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు ప్లకార్డులూ ప్రదర్శించారు. అలాగే మోదీ సర్కారు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నప్పుడు కూడా నిరసనకారులకు మద్దతుగా గురుద్వారా ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం నిర్వహించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రాజీనామాకు సిద్ధం!

కొందరికి కుర్చీపైనే ఆశ.. బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యలు

» మెడికోల ఆందోళన వెనక రాజకీయాలు ఉన్నాయని విమర్శ



కోల్‌కతా, సెప్టెంబరు 12: స్థానిక ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన హత్యాచార ఘటనపై ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు గురువారం కూడా తమ వైఖరిని సడలించుకోలేదు. చర్చలకు రావాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆహ్వానించినప్పటికీ వారు సానుకూలంగా స్పందించలేదు. వరుసగా మూడో రోజు కూడా ప్రభుత్వం, జూనియర్ డాక్టర్ల మధ్య చర్చలు జరగలేదు. దీనిపై మమత స్పందిస్తూ "సామాన్యులకు న్యాయం చేయడం కోసం పదవిని వదులుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాన"ని ప్రకటించారు. అయితే ఈ ఆందోళన వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించారు. "చాలా మంది డాక్టర్లు చర్చకు సుముఖంగా ఉన్నారన్న సంగతి నాకు తెలుసు. కానీ కొద్దిమంది మాత్రం ప్రతిష్టంభన ఏర్పడాలని కోరుకుంటున్నారు" అని విమర్శించారు. రాజకీయ దురుద్దేశాలతో ఆందోళన జరుగుతోందని, దీనికి వామపక్షాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. "సామాన్య ప్రజలకు న్యాయం చేసేందుకు పదవి నుంచి వైదొలగడానికి నేను సిద్ధంగా ఉన్నా. కానీ వారు న్యాయం కోరుకోవడం లేదు. వారికి కేవలం కుర్చీ మాత్రమే కావాలి" అని వ్యాఖ్యానించారు. జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపేందుకు తాను సచివాలయంలో రెండు గంటల పాటు ఎదురు చూశానని, వారు సెక్రటేరియట్‌కు వచ్చినా సమావేశంలో కూర్చోలేదని మమత చెప్పారు. ఇందుకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. విధుల్లో చేరాలని మరోసారి ఆమె విజ్ఞప్తి చేశారు.

మమత పాల్గొనే కార్యక్రమాలకు వెళ్లను: గవర్నర్

ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో జరిగిన అత్యాచారం, హత్య ఘటనల విషయమై బెంగాల్ సమాజం చేస్తున్న సమ్మెకు మద్దతు ఇస్తున్నట్టు గవర్నర్ ఆనంద బోస్ తెలిపారు. రాజీనామాకు సిద్ధమని మమత ప్రకటించిన కొద్ది గంటలకే గవర్నర్ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని 'సామాజికంగా బహిష్కరిస్తున్నట్టు' ఆయన ప్రకటించారు. సామాజిక బహిష్కరణ అంటే ఏమిటో వివరణ ఇచ్చారు. ఆమెతో కలిసి ఏ ప్రజా వేదికపైనా కూర్చోబోనని, ఆమె పాల్గొనే ఏ ప్రజా కార్యక్రమానికీ హాజరు కాబోనని తెలిపారు.

ప్రధాని, సీజేఐ భేటీపై అనుమానాలున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు స్వాగతం పలికారు. ఈ ఫొటోలు, వీడియోను మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలతో పాటు సుప్రీంకోర్టు న్యాయవాదులు కొందరు తప్పుపట్టారు. ప్రధాని మోదీతో కలిసి సీజేఐ తన నివాసంలో గణపతికి హారతి ఇచ్చారని, అయితే రాజ్యాంగ పరిరక్షకులు రాజకీయ నాయకులను కలవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. 'మా కేసు సీజేఐ ముందు విచారణ జరుగుతోంది. మాకు న్యాయం జరుగుతుందా? అన్నది అనుమానంగా ఉంది. ఎందుకంటే ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి. ఆ ప్రభుత్వానికి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్నారు' అని రౌత్ పేర్కొన్నారు. మరో నేత ప్రియాంక చతుర్వేది కూడా విమర్శలు గుప్పించారు. మోదీ, సీజేఐల కలయికను త్వరలో మహారాష్ట్రలో జరగబోయే ఎన్నికలకు ముడిపెడుతూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్సీపీ నేత సుప్రియా సూలే కూడా ప్రధాని వీడియో క్లిప్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. అయితే సీజేఐపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ స్పందిస్తూ.. అత్యున్నత స్థానాల్లో వ్యక్తులు తమ వ్యక్తిగత కార్యక్రమాన్ని ప్రచారం చేసుకోకూడదన్నారు. సీజేఐ వ్యక్తిత్వంపై తనకు అపార గౌరవం ఉందని చెప్పారు. కానీ, సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌ను చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయిందని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించాలని న్యాయవాది ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. వినాయక పూజ అనేది వ్యక్తిగతమని.. ప్రధాని, సీజేఐ వంటి ఉన్నతస్థాయి వ్యక్తులు ఆ ఫొటోలను బహిరంగపర్చడం సరికాదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ షా అన్నారు. ఇక ప్రతిపక్షాలపై బీజేపీ, దాని మిత్రపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ప్రతిపక్షాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తాయి. సర్వోన్నత న్యాయస్థానం పట్ల వారు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నాయి. బీజేపీ ఎంపీ, పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా గురువారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అప్పటి సీజేఐ హాజరవలేదా? అని ప్రశ్నించారు. ప్రధాని వెళ్లి సీజేఐని కలిస్తే అభ్యంతరం లేదని, గణపతిపూజలో పాల్గొనడమే వారికి బాధగా ఉందని వ్యాఖ్యానించారు. "ప్రధాని మోదీ సీజేఐని కలిస్తే మీకు అభ్యంతరం. కానీ, రాహుల్ గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీరుకు మద్దతు పలికే అమెరికా చట్ట సభ సభ్యుడు ఇల్హాన్ ఒమర్‌ను కలిస్తే మాత్రం అభ్యంతరం వ్యక్తం చేయరు. ఇదెక్కడి విడ్డూరం" అని పాత్రా ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న 45 మంది భారతీయులకు విముక్తి

» విడుదల చేసిన రష్యా ఆర్మీ

మాస్కో, సెప్టెంబరు 12: దళారుల మాయమాటలకు నమ్మి రష్యా సైన్యంలో చేరిన భారతీయులకు ఊరట లభించింది. ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న వారికి విముక్తి కలిగింది. యుద్ధభూమిలో ఉన్న వారిని రష్యా సైన్యం విడుదల చేసింది. ప్రస్తుతం 45 మంది విడుదలయ్యారు. మరో 50 మందిని కూడా వెనక్కి రప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని గురువారం విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇటీవల రష్యాలో పర్యటించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వద్ద ప్రస్తావించడం గమనార్హం. వారిని సైన్యం నుంచి విడుదల చేస్తామని పుతిన్ హామీ ఇచ్చారు కూడా. భారత్‌లోని మానవ అక్రమ రవాణాకు పాల్పడే ముఠా ఒకటి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి రష్యాలో ఉద్యోగాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో సీట్లు ఉన్నాయని ఆశ చూపింది. వీటిని నమ్మి రష్యా వచ్చిన భారత యువకులను బలవంతంగా సైన్యంలో చేర్పించారు. వారిని ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధానికి పంపించారు.

చిన్నారులకు 'సంజీవని'.. సత్యసాయి ఆస్పత్రి

- పుట్టుకతో చిన్నారుల్లో వచ్చే గుండె వ్యాధులకు చికిత్స
- సిద్దిపేట జిల్లా కొండపాకలో వంద పడకలతో ఏర్పాటు
- ఆస్పత్రిని రేపు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొండపాక, సెప్టెంబరు 12: దేశ, విదేశాల్లో పేద ప్రజలకు విద్య, వైద్య సేవలు అందిస్తున్న సత్యసాయి సేవ సంస్థ తెలంగాణలో తన సేవలను మరింత విస్తరిస్తోంది. పేదలకు ఉచితంగా అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకుగాను సిద్దిపేట జిల్లా కొండపాక శివారు ఆనంద నిలయం సమీపంలో చిన్న పిల్లల గుండె చికిత్స కోసం ఆస్పత్రిని నిర్మించింది. ఐదెకరాల విస్తీర్ణంలో రూ.60 కోట్ల వ్యయంతో సత్య సాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ పేరిట ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దీనిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, సద్గురు మధుసూదనసాయి ప్రారంభించనున్నారు. సత్యసాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో రాయ్‌పూర్, పల్వర్, ముంబైలలో చిన్న పిల్లల గుండె చికిత్స ఆస్పత్రులున్నాయి. కొండపాక శివారులో ఏర్పాటు చేసిన ఆస్పత్రి దేశంలో నాలుగోది కాగా తెలుగు రాష్ట్రాల్లో మొదటిది. వంద పడకలు ఉండేలా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయింది. మరో వంద పడకలకు కూడా ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సమీపంలో రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు 10కి పైగా ఆపరేషన్లు చేసేలా సౌకర్యాలను కల్పించారు. దేశంలో ఎక్కడి వారైనా ఇక్కడ ఆపరేషన్‌ను ఉచితంగా చేయించుకునే అవకాశం ఉంటుంది. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించేందుకు కృషి చేస్తున్న సంస్థ కొండపాక శివారులోని ఆనంద నిలయం ట్రస్ట్ ఆవరణలో ఉన్న సుమారు పన్నెండున్నర ఎకరాల విస్తీర్ణంలో సత్యసాయి విద్య సంస్థను ఏర్పాటు చేసింది. ఇక్కడ బాలికలకు ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ఉచితంగా విద్యను అందిస్తున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడ సంస్థ సేవలు అందిస్తోంది. ఇదే ప్రాంతంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సంకల్పించారు.


ప్రారంభానికి సిద్ధమవుతున్న సత్యసాయి సంజీవని ఆస్పత్రి

15రోజుల్లో ఆపరేషన్లు ప్రారంభం: ట్రస్ట్ ప్రతినిధి జగన్నాథ శర్మ

ఆస్పత్రి ప్రారంభమైన తర్వాత 15 రోజుల్లో ఆపరేషన్లు మొదలవుతాయని ట్రస్ట్ ప్రతినిధి జగన్నాథ శర్మ తెలిపారు. దేశంలోని ఎక్కడివారైనా ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స పొందవచ్చన్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రుల్లో 15 దేశాల నుంచి వచ్చిన వారు చికిత్స పొందారు. 1970లో సత్యసాయి బాబా ప్రారంభించిన ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా, వైద్య సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

ఎల్వీపీఈఐకి అరుదైన రికార్డు

- 50 వేలకుపైగా కార్నియా మార్పిడిలు
- ఏటా 12 వేలకుపైగా నేత్రదానాలు
- ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే అత్యధికంగా 50 వేలకు పైగా కార్నియా మార్పిడిలను ఎల్వీపీఈఐలోని శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ నిర్వహించి ఘనతను సాధించింది. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్వీపీఈఐ వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావు వివరాలు వెల్లడించారు. 1987లో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థను స్థాపించినప్పటి నుంచి 50 వేలకు పైగా కార్నియా మార్పిడిలను పూర్తి చేసుకుందని చెప్పారు. ఎల్వీపీఈఐ నేత్రనిధి వ్యవస్థ పరిధిలోని హైదరాబాద్‌లోని రామాయమ్మ అంతర్జాతీయ నేత్రనిధి, విశాఖపట్నంలోని మొహ్సిన్ నేత్రనిధి, భువనేశ్వర్‌లోని దృష్టి దాన్ నేత్రనిధి, విజయవాడ టీకేఈబీ సంస్థల నుంచి ప్రతి ఏడాది 12 వేలకుపైగా పైగా నేత్రదానాలను అందుకుంటున్నాయని వివరించారు. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికం అన్నారు. 37 సంవత్సరాలలో యాభై వేల కార్నియా మార్పిడులు చేయడం ప్రపంచంలో ఏ ఇతర సంస్థ చేయలేదన్నారు. 1989లో స్థాపించినప్పటి నుంచి రామాయమ్మ అంతర్జాతీయ నేత్ర నిధి 5,10,000 కుపైగా కార్నియాలను భద్రపరిచే మాధ్యమం (ఎంకె మీడియం) వయల్స్ ఉత్పత్తి చేసిందని, 1,29,500 కార్నియాలను సేకరించిందన్నారు. కార్యక్రమంలో ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గర్గ్, శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ వడ్డవల్లి పాల్గొన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

4 జిల్లాల్లో ఆస్తి నష్టం పరిశీలన..గోడు వెళ్లబోసుకున్న బాధితులు.. నష్టంపై నివేదికలు ఇచ్చిన అధికారులు

- నష్టంపై కేంద్రానికి నివేదిస్తాం: కేపీ సింగ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భారీ వర్షాలు, వరదల కారణంగా ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం రెండు రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించింది. బుధ, గురువారాల్లో మొత్తం నాలుగు జిల్లాల్లో పర్యటించిన కేంద్ర బృందం అధికారులు..ముంపునకు గురైన ఇళ్లు, జరిగిన ఆస్తి నష్టాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా వరద బాధితులు కేంద్ర బృందానికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వరద బీభత్సాన్ని ప్రత్యక్షంగా తిలకించామని, నష్టంపై కేంద్రానికి నివేదిక అందిస్తామని కేంద్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సలహాదారు కేపీ సింగ్ తెలిపారు. కేపీ సింగ్ నేతృత్వంలో మహేశ్‌కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్‌కే కుశ్వాహ, టి.నియాల్క్ హాన్సన్, శశివర్ధన్‌రెడ్డి తదితరులు గురువారం ఉదయం తొలుత ఖమ్మంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రాజీవ్ స్వగృహలో జరిగిన నష్టాన్ని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. అనంతరం కాల్వొడ్డు, బొక్కలగడ్డలో పడిపోయిన ఇళ్లను కేంద్ర బృందం తిలకించింది. ఈ సమయంలో అక్కడుకు చేరుకున్న మహిళలు సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఖమ్మంలో మొత్తం రూ.729.68కోట్ల నష్టం జరిగిందని, ఆరుగురు మృతి చెందారని కలెక్టర్ నివేదిక అందించారు. అలాగే, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో వరద తాకిడితో నష్టపోయిన పంట పొలాలు, గండిపడిన చెరువును కేంద్రం బృందం సభ్యులు పరిశీలించారు. చింతలపాలెం, మేళ్ల చెర్వు, మఠంపల్లి, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలు, తెగిపోయిన రోడ్లు, చెరువులతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు వారు భరోసా ఇచ్చారు. మరోవైపు.. మానుకోట జిల్లాలోని మరిపెడ, డోర్నకల్ మండలాల్లో బుధవారం రాత్రి వరద నష్టాన్ని పరిశీలించిన అధికారులు.. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 40,697 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, 189 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం కాగా, మరమ్మతుల కోసం రూ.176.68కోట్లు అవసరమని ఆర్అండ్‌బీ అధికారులు నివేదించారు. వర్షాలు, వరదల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 2,555 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయని, 199 హైలెవల్ బ్రిడ్జి లు, 81 కల్వర్టులు దెబ్బతిన్నాయని రోడ్లు, భవనాల శాఖ గుర్తించింది. వీటిని పూర్తి స్థాయిలో మరమ్మతు చేసేందుకు రూ. 2,500 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. ఇందులో తాత్కాలిక మరమ్మతులకు రూ.100కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.2,400 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక సమర్పించిది. ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోనే అత్యధికంగా నష్టం వాటిల్లిందని పేర్కొంది. కాగా, వరదల ప్రభావంతో కోతకు గురైన రోడ్ల మరమ్మతుల కోసం టెండర్లను ఆహ్వానించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.


కేంద్ర బృందానికి గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

ఇంకా బురదలోనే ప్రభుత్వ కార్యాలయాలు

మున్నేరు వరద తగ్గినా ఖమ్మంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఇంకా బురదలోనే ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయాలు, పంచాయతీలు, స్కూళ్లు, కాలేజీలతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆఫీసుల్లోకి వరద ప్రవేశించడంతో ఫైళ్లు, విలువైన పత్రాలు నీటమునిగాయి. ఖమ్మం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో పది అడుగుల వరకు వరద రావడంతో బురద పేరుకుపోయింది. ప్రజాపాలన దరఖాస్తులతో పాటు మండల పరిషత్ పాలన, అభివృద్ధి పనులకు సంబంధించిన అనేక ఫైళ్లు, రికార్డులు కంప్యూటర్లు, ఇన్వర్టర్లు బురదలోనే ఉన్నాయి. దీంతో సిబ్బంది తడిచిన ఫైళ్లను ఆరబెడుతున్నారు. పంచాయతీ కార్యాయాలు, పాఠశాలలు, కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.


మున్నేరు వరదతో ఖమ్మం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో పూర్తిగా తడిచిపోయిన దస్త్రాలు

విదేశాల్లో భారత్‌ను కించేపర్చే వ్యాఖ్యాలా?

రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదు.. దేశద్రోహ వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలి

- లేనిపక్షంలో వెంటనే ఈ దేశం వదిలి వెళ్లిపోవాలి
- అధికారంలోకి వస్తే దేశాన్ని మళ్లీ ముక్కలు చేస్తాడు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'విదేశాల్లో భారత్‌ను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదు. సిక్కులను ఊచకోత కోసిన చరిత్ర కాంగ్రెస్ సొంతం. వారి గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు' అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. దేశద్రోహ వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో దేశం వదిలి వెళ్లాలని డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సికింద్రాబాద్ జనరల్ బజారులోని దుస్తులు, బంగారు దుకాణాల వద్ద తిరుగుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. 'రాహుల్ విదేశాల్లో ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదు. అమెరికాకు వెళ్లి భారత ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించింది, మోదీకి అనుకూలంగా ఉండటంవల్లే బీజేపీకి సీట్లు వచ్చాయి' అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయనకు ఈ దేశ చట్టాలు, న్యాయస్థానాలు, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం లేకపోవడం సిగ్గుచేటన్నారు. సిక్కులు తలపాగా, కడియం పెట్టుకునే పరిస్థితి లేదని రాహుల్ చెప్పడం సిగ్గు చేటని, సిక్కులను ఊచకోత కోసి దుర్మార్గంగా వ్యవహరించిందే రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరా గాంధీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఇప్పుడున్న కాంగ్రెస్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కానేకాదు... ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అని, కాంగ్రెస్ పార్టీయే దేశాన్ని మూడు ముక్కలు చేసిందని, రాహుల్ గాంధీ పొరపాటున అధికారంలోకి వస్తే మళ్లీ ఏడు ముక్కలు చేసే ప్రమాదముందని ఆగ్రహంతో అన్నారు. రిజర్వేషన్లను ఎత్తేస్తామంటూ రాహుల్ గాంధీ అడ్డగోలుగా మాట్లాడుతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను మళ్లీ తేవాలని, రెండు జెండాలుండాలని కోరుకునే పార్టీలతో కాంగ్రెస్ జట్టుకట్టడం సిగ్గు చేటని విమర్శించారు.

దృష్టి మళ్లించడానికే హై'డ్రామా'

రాష్ట్రంలో ఆరు గ్యారంటీలపై దృష్టి మళ్లించడానికి హైడ్రా పేరుతో హైడ్రామాలాడుతున్నారని, అక్రమ నిర్మాణాలను మీరు కూలుస్తారా? మమ్ముల్ని కూల్చమంటారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించడం సిగ్గు చేటన్నారు. అక్రమ నిర్మాణాలని తెలిసి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శులపై ఎమ్మెల్యేల అసంతృప్తి

ఒకరిద్దరు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల వైఖరిపై పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గురువారం బీజేఎల్పీ సమావేశంలో ఈ అంశం చర్చించాలని భావించినట్లు ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. అయితే, సమయాభావంతో అజెండా అంశాలపై చర్చకే పరిమితమయ్యామన్నారు. అధినాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని మరో ఎమ్మెల్యే తెలిపారు. వేల ఓట్ల మెజారిటీతో గెలిచిన తాము, డిపాజిట్‌లు కూడా రాని వారు చెబితే వినాల్సిన దుస్థితి పార్టీలో కొనసాగుతోందన్నారు. పార్టీ కీలక సమావేశాల కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు.

ఆరేళ్ల బాలికపై హత్యాచారం.. దోషికి మరణ శిక్ష

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12: ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. నేరం రుజువు కావడంతో కఠిన శిక్ష విధిస్తూ సంగారెడ్డిలోని ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీహార్‌లోని జమోయి జిల్లా సికిందర్ తాలూకాకు చెందిన గఫార్ అలీఖాన్(56) బీడీఎల్‌లో కూలీ పనులు చేస్తుండేవాడు. 2023 అక్టోబరు 16వ తేదీన సంగారెడ్డి జిల్లా భానూరు బీడీఎల్‌కు చెందిన ఆరు సంవత్సరాల బాలికకు కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబుతుందని భయపడి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బీడీఎల్ భానూరు పోలీసులు వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. డీఎస్పీ పురుషోత్తంరెడ్డి దర్యాప్తు జరిపారు. పోలీసులు సమర్పించిన అన్ని ఆధారాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుడు గఫార్ అలీఖాన్‌కు మరణ శిక్ష విధించారు. బాధితురాలి కుటుంబీకులకు పది లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ రూపేష్ హైకోర్టును ఆశ్రయించి సత్వర విచారణ జరిగేలా అనుమతి తీసుకున్నారు. దీంతో కేవలం 11 నెలల్లోనే కోర్టులో విచారణ పూర్తయింది.

20న బీజేఎల్పీ ఆధ్వర్యంలో రైతుదీక్ష

- పంట రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న బీజేపీ శాసనసభా పక్షం (బీజేఎల్పీ) రైతు దీక్ష నిర్వహించనుంది. ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని బీజేఎల్పీ విమర్శించింది. గురువారం అసెంబ్లీలోని బీజేఎల్పీలో పార్టీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు-వైఫల్యాలతో పాటు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎంపీలు కె.లక్ష్మణ్, డీకేఅరుణ, ధర్మపురి అర్వింద్, ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నగేశ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి, రామారావు పాటిల్, వెంకటరమణారెడ్డి , సూర్యనారాయణగుప్తా, డాక్టర్ హరీష్‌బాబు,ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, హైడ్రా, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత, పార్టీ సభ్యత్వ నమోదు, అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ తీర్మానం ఆమోదించారు. భారీ వర్షాలు, వరదలతో జరిగిన పంటనష్టంపై ప్రభుత్వం వెంటనే కలెక్టర్‌ల నుంచి నివేదికలు తీసుకోవాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఎకరాకు రూ. 15వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక కార్యాచరణ ప్రకారం, ఈనెల 20న రైతు దీక్ష నిర్వహిస్తామని, అయితే, పార్టీ నాయకత్వంతో చర్చించి దీక్ష తేదీని ఖరారు చేస్తామన్నారు. వరద బాధిత రైతులకు ఎంత ఖర్చు చేసిందో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ నిజంగానే సెక్యులర్ పార్టీ అయితే, సెక్యులర్ హైడ్రా కొనసాగించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎరుపు, ఒడుపు, ఏచూరి

తాను చేయగలిగినది చాలా ఎక్కువ ఉన్న చారిత్రక సందర్భంలో సీతారాం ఏచూరి నిష్క్రమించారు. రానున్న రోజులలో ఆయన లోటు పదే పదే తెలిసివస్తుంది. "ఈ దేశం గురించి బాగా అవగాహన ఉన్నవాడు, ఇండియా భావనకు రక్షకుడు" అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అర్పించిన నివాళిలో సీతారాం వ్యక్తిత్వంలోని వర్తమాన ప్రాసంగికతే ప్రతిబింబిస్తుంది. పదేళ్ల మితవాద, మతవాద ఉధృతిలో క్షీణతను, శిథిలతను ఎదుర్కొంటున్న క్లిష్ట సమయంలో, ఆమోదనీయత, వ్యవహారదక్షత కలిగిన సీతారాం వంటి నాయకుడు లేకపోవడం కమ్యూనిస్టు పార్టీలకు గట్టి దెబ్బ. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో మార్క్సిస్టు పార్టీ నాలుగే స్థానాలు గెలుచుకోగలిగినా, ఏచూరి పలుకుబడి అంతకు అనేక రెట్లు మించినది. ప్రతిపక్ష 'ఇండియా కూటమి' నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమయినది. పాక్షికంగా అయినా, వామపక్షాలు కాంగ్రెస్‌తో ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లడం 2024లోనే మొదలు, అందులో ఏచూరి తిప్పిన చక్రం పెద్దది.

సీపీఎం ఆంతరంగిక రాజకీయాల చర్చకు ఇది సందర్భం కాదు కానీ, ప్రకాశ్ కారత్ సైద్ధాంతికతలో ఖచ్చితంగా ఉంటారని, సీతారాం ఏచూరి పట్టువిడుపులతో వ్యవహరిస్తారని పేరు. కానీ, విధాన పరమైన పట్టింపులు ఆయనకూ ఉండేవి. జ్యోతిబసును ప్రధాని కాకుండా అడ్డుకోవడం వంటి సందర్భాలలో కారత్ దీ, ఏచూరిదీ ఒకే పట్టు. 1996 నుంచి కాంగ్రెస్‌తో కూడిన సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో సీపీఎం అగ్రనేతలు ముఖ్యపాత్ర వహించారు కానీ, నేరుగా పొత్తులు ఉండేవి కావు. కాంగ్రెస్‌తో కలసి పనిచేసే విషయంలో కారత్ గట్టి వ్యతిరేకత చూపేవారు, 2019 సాధారణ ఎన్నికలకు ముందు పొత్తు అవకాశాలను అడ్డుకున్నారు కూడా. అమెరికాతో అణు ఒప్పందం సందర్భంగా వామపక్షాలు మన్మోహన్ ప్రభుత్వం నుంచి వైదొలగిన సందర్భంలో, ఏచూరి వైఖరి వేరుగా ఉన్నదని, కేరళ యూనిట్ అండతో కారత్ ఆ నిర్ణయానికి కారకుడని భావించేవారు. ఏచూరి తీరులోని సౌమ్యత, సడలింపు ధోరణి ఆయనకు అన్ని పార్టీలలో మిత్రులను సంపాదించి పెట్టింది. ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీకి ఆయన స్నేహం పెరిగింది. వారిద్దరూ అనేక విషయాల మీద సుదీర్ఘంగా చర్చించుకునేవారు.

సీపీఎంలో పుట్టి పెరిగి ఆ పార్టీకి ప్రధాన కార్యదర్శి అయినవారు ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరి. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలి పోయిన తరువాత, పధ్నాలుగేళ్ల పాటు పుచ్చలపల్లి సుందరయ్య మార్క్సిస్టు పార్టీకి ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. ఆ పదవిలోకి వచ్చిన రెండో తెలుగు వ్యక్తి సీతారాం. 1977లో జెఎన్‌యు విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఎస్ఎఫ్ఐ తరఫున ఎన్నికైన ఏచూరి, ఓడిపోయి కూడా యూనివర్సిటీ చాన్సలర్ పదవికి రాజీనామా చేయని ఇందిరాగాంధీని నిలదీయడంతో జాతీయస్థాయి ప్రసిద్ధి పొందారు. సోషలిస్టు శిబిరం విచ్ఛిన్నమై, నూతనార్థిక విధానాలు, మతతత్వ రాజకీయాల జమిలి ప్రవేశం జరిగిన 1990 దశకారంభంలో ఆయన పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలలో సైద్ధాంతిక పోరాటం వెనుకపట్టుపట్టి, మనుగడ కోసం తడుముకోవలసిన దశలో నాయకత్వంలోకి వచ్చిన యువకుడు ఏచూరి. మారుతున్న ప్రపంచంతో మెలగడానికి కొత్త పద్ధతులు వెదుక్కుని తన స్థానాన్ని స్థిరపరుచుకున్న రాజకీయవాది ఆయన. 2005 నుంచి పన్నెండేళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో చేసిన ప్రసంగాలు సీతారాం అధ్యయనానికి, అవగాహనకు అద్దం పట్టేవి.

నూతన ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించి, తామే పేదల ప్రయోజనాలను కాపాడగలిగేది అని చెప్పగలిగిన కమ్యూనిస్టులు, మతవాదుల ముందు మాత్రం క్రమంగా బలహీనపడుతూ వచ్చారు. మతతత్వ రాజకీయాలు కమ్యూనిస్టు పార్టీలను పునాదుల నుంచి పెకిలించే ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కార్మికులు, కష్టజీవులు, రైతులు, రైతుకూలీలు అంటూ మాట్లాడిన కమ్యూనిస్టులకు, హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు వంటి శ్రేణీకరణతో వ్యవహరించడం కష్టమైంది. ఆకర్షణ తగ్గి, అంకితభావం కలిగిన కార్యకర్తలు లేక, భావోద్వేగాలతో కలగలసిన మతవాదాన్ని ఎదుర్కొనలేక బలహీన పడుతున్న వామపక్షాలకు, పాలకపక్షాలలోనే మెరుగైనవారిని ఎన్నుకుని అండాదండా పొందవలసిన అగత్యం ఏర్పడింది. కమ్యూనిస్టుల మద్దతు పొందేవారికి కాసింత గౌరవం, మద్దతు ఇచ్చేవారికి నాలుగు సీట్లు, పరస్పర అవశ్యకతలుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో సమాజాన్ని తీవ్ర విభజనల పాలుచేసి, మతభావాల మాటున విపరీతమైన అధికారాన్ని సాధించి, నియంతృత్వాన్ని, వీలయితే ఫాసిజాన్ని స్థాపించాలనుకునే శక్తులను ఎదుర్కొనడానికి, ఈ దేశచరిత్ర గురించిన అవగాహన, భవిష్యత్ కార్యక్రమం గురించి ఆచరణాత్మకత కలగలసిన, సంకీర్ణ ప్రత్యామ్నాయాలు నిర్మించగలిగిన సీతారాం ఏచూరి వంటి నాయకులు ఎంతో అవసరం.

ఇదొక విధ్వంసక విషవలయం!

మనం ఇప్పుడు ఒక చారిత్రక చౌరస్తాలో ఉన్నాం. క్లిష్టమైన పరివర్తన సమయమిది. ఆర్థికాభివృద్ధిని సుస్థిరంగా సాధించలేకపోవడమంటే పర్యావరణ విపత్తు దిశగా శీఘ్రగతిన వెళుతున్నట్టే. సమ న్యాయవిరుద్ధమైన పురోగతి మరింత పేదరికం, మరింత వెనుకబాటుతనం, మరింత సామాజిక ఆగ్రహావేశాలకు తప్పక లోనుచేస్తుంది. అందుబాటులో లేని అభివృద్ధి, మరింత స్పష్టంగా చెప్పాలంటే సమాజంలోని అన్ని వర్గాలకు సమరీతిలో సమకూరని అభివృద్ధి సుస్థిరమైనది కాదు, కాబోదు. కనుక సమ న్యాయ బద్ధమైన, సుస్థిరమైన అభివృద్ధి సాధనే మన భవిష్యత్తు నిర్మాణానికి దిక్సూచి కావాలి.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఢిల్లీ వాయు కాలుష్యాన్నే పరిగణనలోకి తీసుకోండి. ఆ కాలుష్యాన్ని తగ్గించడంలో మన ప్రయత్నలోపం ఉందా? లేదు. బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదక కేంద్రాలు అన్నిటినీ మూసి వేశాం. పెట్ కోక్ (కార్బన్ సమృద్ధిగా ఉండే ఘన పదార్థం. కాలుష్య కారకమైనందువల్లే అమెరికా దీనిని ఎగుమతి చేస్తోంది) దిగుమతిని నిషేధించాం. స్వచ్ఛమైన ఇంధనాలు, నవీన వాహన సాంకేతికతలనే ఉపయోగించుకోవడానికి పూర్తి ప్రాధాన్యమిస్తున్నాం. ఇటువంటి చర్యల తరువాత కూడా కాలుష్య సంక్షోభాన్ని తగ్గించడంలో వెనుకబడే ఉన్నాం. ఢిల్లీలో వాయు కాలుష్యం గత మూడు సంవత్సరాలలో, అంతకు మునుపటి మూడు సంవత్సరాలతో పోలిస్తే 25 శాతం మేరకు తగ్గినట్టు నా సహచరులు అంచనా వేశారు. ఇంకా 65 శాతం మేరకు తగ్గిస్తేగానీ ఢిల్లీవాసులు నిర్మలమైన గాలిని పీల్చగల పరిస్థితి రాదు.

ఇందుకు కారణమేమిటో మరి చెప్పనవసరం లేదు. ఢిల్లీ వాసులలో 20 శాతం మంది కార్లలో తమ ఉద్యోగ కార్యాలయాలకు వెళుతుంటారు. ఇంచుమించు 25 శాతం మందికి సొంత కార్లు ఉన్నాయి. అయితే 90 శాతం రోడ్ స్థలాలు ఈ వాహనాల యజమానులకే ఉపయోగపడు తుంటాయి. 20 శాతం మంది అవసరాలను తీర్చడమే ఎక్కడలేని రద్దీ, కాలుష్యానికి కారణమవు తుంటే నగరవాసులు అందరికీ స్వచ్ఛమైన ఉపరితల స్థలాలు, నిర్మలమైన వాయు తలాలను సమకూర్చడం ఎలా సాధ్యమవుతుంది? ఇటువంటి విపత్కర పరిస్థితుల కారణంగానే పేదల పర్యావరణ ఉద్యమాలు ప్రజ్వరిల్లుతున్నాయి.

వాస్తవమేమిటంటే సంపన్నులూ స్వచ్ఛమైన గాలిని పీల్చవలసి ఉంది. అందరికీ నిర్మలమైన గాలి లభించేలా చేసేందుకు నగర ప్రజల చలనశీలత (మొబిలిటీ) తీరుతెన్నులను మార్చి వేయవలసి ఉన్నది. అదనంగా మరికొన్ని బస్సులు, ట్రామ్‌లు, మెట్రోలను చేర్చడం వల్లే ఆ మార్పులు సిద్ధించవు. పేదలు, ధనికులకు అనుకూలంగా ఉండే చలనశీలత వ్యవస్థలను అభివృద్ధిపరచవలసి ఉన్నది. సదరు సదుపాయాలు అందరికీ అందుబాటులో ఉండాలి. అవి సౌకర్యవంతంగా ఉంటూ భద్రతనివ్వాలి.



విపత్తులు తరచు సంభవిస్తున్నాయి. వాటి తీవ్రత సైతం అధికంగా ఉంటోంది. పేదలు నిరుపేదలవుతున్నారు. వలస వెళ్లడం అనివార్యమవుతోంది. వలసలు పెరుగుతున్నకొద్దీ వాటిని అడ్డుకోవడమూ తీవ్రమవుతోంది.

మన దేశంలో ఇప్పటికీ చాలా చాలా కుటుంబాలు ఆహారం వండుకోవడానికి ఎండుకట్టెలు, పిడకలు మొదలైన వాటినే ఉపయోగిస్తున్నారు. పేదరికమే ఇందుకు ప్రధాన కారణం. వాయు కాలుష్యానికి అవి ఎంతైనా కారణమవుతున్నాయి. ఆ కాలుష్యం పేదలను అనారోగ్యం పాలు చేస్తోంది. మరి పేదలు, ధనికులు ఒకే వాయు ఆవరణంలో ఉంటున్నారన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. మనం పీల్చే గాలిని నిర్మలం చేయాలంటే సంపన్నులు కాలుష్యకారక వాహనాలను త్యజించేలా చేయాలి. అలాగే పేద కుటుంబాలు కాలుష్యకారక ఇంధనాలకు స్వస్తి చెప్పేలా చేయాలి. నిర్మలమైన గాలికి ఈ ఇంధన పరివర్తన ఎంతైనా అవసరం. మరి సమ్మిళిత అభివృద్ధి లేకుండా సుస్థిరాభివృద్ధి అనేది అసాధ్యం.

నిరంతరాయ అభివృద్ధి సాధించాలంటే పేద మహిళల అవసరాలు తీర్చడానికి ప్రాధాన్యమివ్వాలి. శిలాజేతర మలిన ఇంధనాలకు బదులుగా శిలాజేతర స్వచ్ఛ ఇంధనాలను ఉపయోగించుకునే అవకాశాలను వారికి సమృద్ధిగా కల్పించాలి. ఈ విషయంలోనే ప్రపంచానికి సమర్థ నాయకత్వం అవసరం. ఇంధన పరివర్తన విషయంలో పేదలకు అవకాశాలు సమృద్ధిగా సమకూర్చేందుకు పేద దేశాలకు ఇతోధిక ఆర్థిక సహాయం అందించాలి. ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న వాయు కాలుష్యం భూతాపాన్నీ అధికం చేస్తోంది. వాతావరణ మార్పును నిరోధించడంపై ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా లేనిపక్షంలో భూతాపాన్ని తగ్గించడం సాధ్యం కాదని 1990లో నేనూ, నా సహచరుడు అనిల్ అగర్వాల్ 'గ్లోబల్ వార్మింగ్ ఇన్ అన్‌ఈక్వల్ వరల్డ్' అన్న మా రచనలో వాదించాం. ఆ సమస్య అలానే ఉన్నది కనుక మా వాదన ఇప్పటికీ సహేతుకమైనదే. వాతావరణ మార్పుకు పరిష్కారాలు అందరి అవసరాలను తీర్చగలిగేవిగా ఉండాలి. లేనిపక్షంలో అవి సఫలమవవు.

వాతావరణ వైపరీత్యాలను నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ప్రతీ సంవత్సరమూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరుసటి ఏడాది అంతకు మించిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అటవీ దావానలాలు పెరుగుతున్నాయి. మరణాంతక చలిగాడ్పులు, వేడి గాడ్పులు అంతకంతకూ అధికమవుతున్నాయి. వీటన్నిటికీ మించి ఒక భయానక వాస్తవాన్ని మనం ఎదుర్కొంటున్నాం. 2030 సంవత్సరం నాటికి భూతాపం 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు మించకూడదు. మరి ఇందుకు భూతాపాన్ని అదుపుచేసే కాలుష్యకారక ఉద్గారాలను శీఘ్రగతిన తగ్గించవలసిన అవసరమున్నది. మనుగడకు అవసరమైన ప్రాథమిక ఇంధన అవసరాలు తీరని ప్రజలు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారి అభ్యున్నతికి స్వచ్ఛమైన ఇంధనాలు సమకూర్చాలి. కాలుష్యకారక హరిత గృహ వాయువుల ఉద్గారాలు సాధ్యమైనంతవరకు తక్కువ స్థాయిలో ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచుకోవలసిన అవసరమున్నది. ప్రాకృతిక విపత్తులు తరచు సంభవిస్తున్నాయి. వాటి తీవ్రత సైతం అధికంగా ఉంటోంది. వాతావరణ మార్పు విషమ పర్యవసానాల వల్లే ఇది జరుగుతోంది. దీనివల్ల పేదలు నిరుపేదలవుతున్నారు. వారి జీవితాలు పలు విధాల ఛిద్రమవుతున్నాయి. ప్రపంచ దేశాలు అన్నీ పరస్పర ఆధారితాలుగా ఉన్నాయి. ఎడతెగని ప్రాకృతిక విపత్తులతో జీవన భద్రత కోల్పోతున్నవారు ప్రత్యామ్నాయ జీవనాధారాలకు సుదూర ప్రాంతాలు, దేశాలకు వలస వెళ్లడం అనివార్యమవుతోంది. వలసలు పెరుగుతున్నకొద్దీ వాటిని అడ్డుకోవడమూ తీవ్రమవుతోంది. ఫలితంగా అభద్రతా భావజనితమైన హింసాకాండ ప్రజ్వరిల్లుతోంది.

ఇదొక విధ్వంసక విషవలయం దీన్ని మనం రూపుమాపాలి. విశ్వీకరణ అయిన ప్రస్తుత ప్రపంచంలో అన్ని దేశాలు అనివార్యంగా పరస్పరాధారితమై ఉన్నాయి. ఈ వాస్తవాన్ని మనం గుర్తించి తీరాలి. ప్రగతి ఫలాలు అందరికీ సమరీతిలో లభ్యం కాని పరిస్థితుల్లో సుస్థిరాభివృద్ధి సాధ్యం కాదు. సమస్త ప్రజలకు అందుబాటులో ఉండే సమ్మిళిత వృద్ధి మాత్రమే సుస్థిరమైనది. పర్యావరణ విపత్తు కేవలం అధునాతన సాంకేతికతల మూలంగా కాక, రాజకీయ స్వార్థాలు, ఉదాసీనతల వల్లే సంభవిస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా పరిష్కారాలను రూపొందించి అమలుపరచనంతవరకు సుస్థిరాభివృద్ధి సిద్ధించదు. సమన్యాయ, హక్కుల రాజకీయాలను నిరర్థకం చేస్తూ పర్యావరణ భద్రత, సుస్థిరాభివృద్ధిని ఆశించడం వల్ల ప్రయోజనమేముంది?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మీ పిల్లలకు 'చందమామ' ఇస్తున్నారా?

ఒక అందమైన కానుకను అందుకున్నాను. రమణీయంగా రూపొందించిన, 'సమయ్ పోస్ట్' నుంచి అందిన బంగీ అది. అందులో 14 పుస్తకాలు ఉన్నాయి. 'లోకపు భాగ్య విధాతలు' అయిన బాలల కోసం గుల్జార్ రాసిన కథల పుస్తకాలు అవి. రమ్యమైన బొమ్మలతో అలెన్ షా ఆ కథలకు వన్నెలద్దాడు. జీవన సౌందర్యాన్ని, మూగ వేదనను అనితరసాధ్యంగా తన పాటలలో వర్ణించే, పలికించే కవి గుల్జార్ మన ప్రశస్త బాల సాహిత్య సృజనకారులలో ఒకరని ఎంతమందికి తెలుసు? బహుశా చాలా మందికి తెలియదు.



బాలలకోసం 'సమయ్ పోస్ట్' గతంలో ప్రచురించిన పుస్తకాలు కూడా నన్ను సమ్మోగ్ధం చేశాయి. పెద్ద బొమ్మల పుస్తకాలు, పోస్టర్లు, కవితలు ఉన్న కార్డులు, కథల పుస్తకాలు, చిన్న నవలలతో పాటు ప్లూటో, సైకిల్ అనే బాలల పత్రికలను కూడా ఆ సంస్థ ప్రచురిస్తోంది. న్యూఢిల్లీలో ఈ ఏడాది ఆరంభంలో జరిగిన వరల్డ్ బుక్ ఫెయిర్‌లో అవన్నీ అశేష బాల బాలికలు, వారి తల్లి దండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మేమూ (నా భార్య నేను) అబ్బురపడ్డాము. అవును, బాల సాహిత్య వికాసం మమ్ములను ముగ్ధులను చేసింది. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా!.

మా పిల్లల బాల్యంలో హిందీ బాల సాహిత్య పుస్తకాలు, నా చిన్నతనంలో మేము చదివిన (బొమ్మల కంటే కథనాలు అధికంగా, ప్రధానంగా ఉండే) అక్బర్ – బీర్బల్, చాచా చౌదరి, తెనాలి రామ, పంచతంత్ర, వెటల్ లేదా అమర్ చిత్ర కథ లాంటి కామిక్స్ కంటే కొద్దిగా, అతికొద్దిగా మాత్రమే మెరుగ్గా ఉండేవి. అప్పుడప్పుడూ తళతళలాడుతుండే అందమైన సోవియట్ పుస్తకాలు లభించినప్పుడు మేము ఎంతగా ఆనందభరితులయ్యే వాళ్లమో! సరే, చందమామ, చంపక్, పరాగ్, లాట్ పోట్ లాంటి మేగజైన్లను విధిగా చదువుతుండేవాళ్లం.

కమలా భాసిన్ రాసిన 'మలు భలు'ను మా పిల్లలు అమితంగా ఇష్టపడేవారు. రాత్రిపూట పడుకునే ముందు వారు ఆ కథలను వినడానికి చెవి కోసుకునేవారు. మనోరంజకమైన మహారాష్ట్ర జానపద గాథ ఆధారంగా తూలికా బుక్స్ వారు ప్రచురించిన 'ఇక్కి డొక్కి', కరాడి కథల ఆడియో బుక్స్ వారికి బాగా నచ్చేవి. వివిధ భారతీయ భాషలలోని కథలు కథ బుక్స్ ద్వారా వారిని అలరించేవి. అయినా మేము కొత్త పుస్తకాల కోసం అన్వేషిస్తుండేవాళ్లం. ఈ సందర్భంగా ఒక విషయాన్ని తప్పక చెప్పవలసి ఉంది. మన దేశంలో ప్రచురితమయిన పిల్లల పుస్తకాలలో కథా కథనం, బొమ్మలు, ముద్రణ ప్రమాణాలు ఐరోపా, అమెరికా నుంచి వచ్చే పుస్తకాలతో పోల్చలేనివిగా ఉండేవి. ప్రతి విషయంలోను మన పుస్తకాల నాణ్యత నాసిరకంగా ఉండేదని చెప్పక తప్పదు.

ఇది చాలా శోచనీయమైన విషయం. ఎందుకంటే మనకు సమున్నతమైన మౌఖిక, లిఖితపూర్వక కల్పనా కథల, పురా గాథల, కథన కౌశల్య వారసత్వం ఉన్నది. అయినా మన పుస్తకాలు జూలియా డొనాల్డ్ సన్ రాసిన 'ది గ్రుఫెలో' తదితర పుస్తకాలకు ఏ మాత్రం సాటిరావు కదా. ఈ సాంస్కృతిక పోరాటంలో హ్యారీ పాటర్ మనలను పూర్తిగా చిత్తు చేసింది. బంగారు కోటలో ఫెలూదా సాహసాలను హోగ్వార్ట్స్‌లోని మంత్ర తంత్రాలు వెనక్కి నెట్టివేశాయి. బాల సాహిత్య గుణ విశేషాలు జాతి జీవన శీలానికి ప్రమాణం అయితే ఆ రీత్యా మన సాహిత్య సృజనాత్మక ప్రస్థానం ప్రశస్తంగా లేదని చెప్పక తప్పదు.

> బాలల జనాభా రీత్యా చూస్తే పిల్లల పుస్తకాల ప్రచురణ, వినియోగం చాలా తక్కువగా ఉన్నాయి. దేశంలో ప్రచురణ అవుతున్న మొత్తం పుస్తకాలలో బాలల పుస్తకాలు ఒక శాతం మాత్రమే. సుప్రసిద్ధ రచయితలు తప్పకుండా పిల్లల కోసం ఎక్కువగా రాయాలి. ప్రచురణకు ప్రైవేట్ వ్యక్తులు ఉదారంగా తోడ్పడాలి. తద్వారా నాణ్యమైన పుస్తకాలు రావడానికి భరోసా ఉంటుంది.

రెండు నెలల క్రితం నేను చెన్నైలోని తూలికా బుక్స్ కార్యాలయానికి వెళ్లాను బాల సాహిత్యంలో కొత్త పుంతలకు దోహదం చేసిన సంస్థ అది. బాల సాహిత్యం తీరుతెన్నులలో గుణాత్మకమైన మార్పు వచ్చిందో లేదో తెలుసుకోవడానికే నేను అక్కడకు వెళ్లాను. మార్పులు వచ్చాయి, సందేహం లేదు. ఇక్కిడొక్కి లాంటి తొలి ప్రచురణల సాఫల్య స్ఫూర్తితో తూలికా బుక్స్ తొమ్మిది భారతీయ భాషలలో వందలాది కొత్త పుస్తకాలను ప్రచురించింది, ఇంకా ప్రచురిస్తోంది. భారతీయ బాల సాహిత్యంలో వచ్చిన, వస్తోన్న మార్పులను తూలికా బుక్స్ వ్యవస్థాపకురాలు రాధికా మీనన్ వివరించారు. చెప్పవలసిన విషయమేమిటంటే ఆ మార్పులు ప్రధానంగా ఆంగ్లంలో ప్రచురితమవుతోన్న బాల సాహిత్యంలో మాత్రమే. భారతీయ విలువలు, వాస్తవికతను ప్రతిబింబిస్తూ నూతనత్వం ఉట్టి పడుతున్న ప్రాయోగిక బాల సాహిత్య పుస్తకాలను కొన్ని గ్లోబల్ సంస్థలతో పాటు ఏక్ తార, ఏకలవ్య, ప్రథమ్, కథ, కరాడి టేల్స్, తార, పికెల్ యోక్, డక్ బిల్, టాకింగ్ క్లబ్ మొదలైన చిన్న, స్వతంత్ర సంస్థలు కూడా ప్రచురిస్తున్నాయి.



■ యోగేంద్ర యాదవ్

శైలజా మీనన్, సంధ్యారావు సంపాదకత్వంలో వెలువడిన 'Children Books : An Indian Story' అన్న పుస్తకం ఆ కొత్త ధోరణులను విపులంగా వివరించింది, నిశితంగా విశ్లేషించింది. గత మూడు దశాబ్దాలలో బాల సాహిత్యం సర్వతోముఖంగా విస్తరించింది. రచయితల, చిత్రకారుల, ప్రచురణకర్తల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠకులూ పెరిగారు. పాఠ్య పుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలనూ కొనగల, చదివే అభిరుచి ఉన్నవారి సంఖ్య పెరుగుతోంది. అలాగే గ్రాఫిక్ నవలలు సహా పలు సాహిత్య ప్రక్రియలలో బాల సాహిత్యం వికసిస్తోంది. పుస్తకాల రూపకల్పన, అనువాదం, ముద్రణలో ప్రమాణాల మెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో భారతీయ బాలల జనాభా రీత్యా చూస్తే పిల్లల పుస్తకాల ప్రచురణ, వినియోగం వాస్తవ అవసరాల కంటే చాలా చాలా తక్కువగా ఉన్నాయని శైలజా మీనన్, సంధ్యారావు స్పష్టం చేశారు. భారతదేశంలో ప్రచురణ అవుతున్న మొత్తం పుస్తకాలలో (పాఠ్యగ్రంథాలేతర) బాలల పుస్తకాలు కేవలం 1 శాతం మాత్రమే. వాటి ప్రచురణ కర్తలు, వినియోగదారులు ఇప్పటికీ చాలవరకు 'మధ్య', 'ఉన్నత' కులాల పట్టణ భారతీయులే.

బాల సాహిత్య జగత్తులో పురోగతి అనేది ఇంగ్లీష్ పుస్తకాలకే పరిమితమైనది. హిందీ ఒక పాక్షిక మినహాయింపు. ఏక్ తార, ఏకలవ్య (చంపక్ మ్యాగజైన్ ప్రచురణకర్త)లు కల్పనా సాహిత్యం, బొమ్మల పుస్తకాలను విరివిగా ప్రచురిస్తున్నాయి. వివిధ భారతీయ భాషలలో తాము ప్రచురిస్తున్న పుస్తకాలలో భాగంగా ప్రథమ్ బుక్స్, కథ, తూలిక మంచి హిందీ పుస్తకాలను అందిస్తున్నాయి. ఇతర భారతీయ భాషలలో గొప్ప బాలసాహిత్య వారసత్వం (గుజరాతీలో గిజూ భాయి బధేకా), ప్రముఖ రచయితలు (బెంగాలీలో సుకుమార్ రే), బాల సాహిత్యోద్యమాలు (కేరళలో కెఎస్ఎస్‌పి) ఉన్నా వర్తమాన బాల సాహిత్య పరిస్థితులు మెరుగ్గా లేవు. స్నేహితులు చెప్పిన దాని ప్రకారం నేనీ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను. ఇది తప్పయితే నేను అమితంగా సంతోషిస్తాను. మొత్తం మీద ఆంగ్లేతర భారతీయ భాషలలో బాల సాహిత్య నవతరంగం చాలా బలహీనంగా ఉన్నదని చెప్పక తప్పదు.

నవ తరంగం అన్నానా? అవును, భారతీయ భాషల బాల సాహిత్యంలో ఆ కొత్త కెరటాన్ని ఒక సాంస్కృతిక ఉద్యమంగా సంఘటితం చేసుకోవల్సిన అవసరమున్నది భావి తరాల బాలలకు మంచి భవిష్యత్తును సమకూర్చేందుకు ఇది అత్యవసరం. ఇందుకు మీరు, నేను చేయాల్సిన నాలుగు పనులను కూడా పేర్కొంటాను. ఒకటి– తల్లిదండ్రులుగా మనం మన పిల్లలకు పుస్తకాలు కొనాలి. పుట్టినరోజు కానుకలుగా పుస్తకాలను ఇచ్చే అలవాటును పెంచుకోవాలి. భారతీయ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యమివ్వాలి. జాతీయవాద భావోద్వేగంతో నేనిది సూచించడం లేదు. తమ పరిసరాలను ప్రతిబింబించే కథలు చదవడానికి, బొమ్మలు చూడడానికి పిల్లలు బాగా ఇష్టపడతారు. కేవలం పుస్తకాలు కొనడంతోనే సరిపోదు. వాటిని పిల్లలకు చదివి వినిపించాలి. పిల్లలు స్వయంగా వాటిని చదివేలా ప్రోత్సహించాలి. వారు తమ 'మాతృభాష'లో పుస్తకాలు చదివేలా చూడాలి. మాతృభాషలో మాత్రమే పిల్లలు చక్కగా నేర్చుకోగలుగుతారు, గ్రహించగలుగుతారు.

రెండు– సుప్రసిద్ధ రచయితలు తప్పకుండా పిల్లల కోసం మరింత ఎక్కువగా రాయాలి. ఆ రచనలు ఉపదేశాత్మకంగా ఉండకూడదు. నిస్సందేహంగా మన కాలం మహోన్నత హిందీ రచయితలలో ఒకరైన వినోద్ కుమార్ శుక్లా తన దృష్టిని బాల సాహిత్య సృజనపై కేంద్రీకరించారు. ఇతర రచయితలు కూడా ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలి. మూడు– భారతీయ భాషలలో బాల సాహిత్య పుస్తకాల ప్రచురణకు 'పౌర సమాజం', ప్రైవేట్ వ్యక్తులు ఉదారంగా తోడ్పడాలి. తద్వారా మాత్రమే నాణ్యమైన పుస్తకాలు రావడానికి భరోసా ఉంటుంది. రచనలో శిక్షణకు కార్యగోష్ఠులు నిర్వహించాలి. రచయితలకు, చిత్రకారులకు ఆర్థిక తోడ్పాటు నందించాలి. సాహిత్య అకాడమీ ప్రశస్త బాల సాహిత్య రచనలకు ఒక పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. భారతీయ భాషలలో బాల సాహిత్య రచయితలు, చిత్రకారులు, ఎడిటర్లు, ప్రచురణకర్తలను ప్రోత్సహించేందుకు పలు అవార్డులను నెలకొల్పాల్సిన అవసరం ఉన్నది తమ తమ మాతృభాషలకు ఎంతో ప్రాధాన్యమిచ్చే పంజాబీ, తెలుగు, తమిళ్, బెంగాలీ ప్రవాసులు ఈ విషయంపై శ్రద్ధ చూపాలి.

నాలుగు– ప్రభుత్వాలు పౌర గ్రంథాలయాలకు నిధులు సమృద్ధిగా సమకూర్చి బాల సాహిత్య పుస్తకాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేందుకు దోహదం చేయాలి. కర్ణాటకలో గ్రామీణ పౌర గ్రంథాలయాల పునర్జాగృతికి అనుసరిస్తున్న కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా హిందీ రాష్ట్రాలలో ఆదర్శంగా తీసుకుని పౌర గ్రంథాలయాల సంస్కృతిని పెంపొందించాలి.

ఉచిత పాఠ్య పుస్తకాలకు చేస్తున్న వ్యయంలో స్వల్ప మొత్తాన్ని కన్నులపండువైన, ఆనందకరమైన బాల సాహిత్య పుస్తకాలను పాఠశాల గ్రంథాలయాలకు, అంగన్‌వాడీలకు పంపిణీ చేసేందుకు వినియోగిస్తే 'లోకపు భాగ్య విధాతలు' మరింత విజ్ఞానవంతులుగా, శేముషీసంపన్నులుగా వికసిస్తారు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మూసీనది ప్రక్షాళన అత్యవసరం

మూసీ నీటి వల్ల భూగర్భ జలాలు కాలుష్యం అవుతున్నాయని పలు పరిశోధనల్లో తేలింది. ఈ నీటి వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు, మగవారికి నపుంసకత్వం, గర్భిణులకు గర్భస్రావం వంటివి జరుగుతున్నాయి. పశువులు మరణిస్తున్నాయి. మూసీ నది నీటిలో ముక్కుపుటాలు అదిరే ఘాటు రసాయనాల వాసన వస్తోంది. జూలూరు కత్వ దగ్గర నీళ్లు దుంకేటప్పుడు ఏర్పడుతున్న గాలిలో తేలియాడే రసాయనాల నురగ మేఘాలు దూరం వరకు ఎగిరిపడి వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నాయి. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో ఇంకా తీవ్రమై నల్గొండ జిల్లా, యాదాద్రి భువనగిరి జిల్లాల ప్రజల మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉంది. మూసీ నీటితో సాగు చేసే పంటలు, కూరగాయలను మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్‌లకు రవాణా చేస్తున్నారు. ఆయా జిల్లాల ప్రజలు వీటిని వాడి దీర్ఘకాలంలో రోగగ్రస్తం అయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం తాత్కాలిక ప్రణాళిక కాకుండా ఈ ముప్పు నుంచి శాశ్వత విముక్తి పొందేలా ఒక మహత్తర ప్రణాళిక సిద్ధం చేయాలి. మురుగునీటిని విధానపరంగా శుద్ధి చేయాలి. రసాయన పరిశ్రమలు కాలుష్య నివారణ పద్ధతులు పాటించేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. మూసీలోకి రసాయనాలు వదులుతున్న వారిపై నిఘా పెంచి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అనారోగ్యాన్ని, హాని కలిగించే పరిశ్రమలను మూసివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– చెరుకుపల్లి శ్రీనివాసు

భూ పోరాటాల యోధుడు ఏసోబు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్బరీ రాజకీయాలు, కమ్యూనిస్టు పార్టీ కొత్త ఆలోచనలను, ఆచరణను, విలువలను ప్రోది చేశాయి. ఈ ప్రభావానికి మొదట గురయింది ఎగువ మధ్య తరగతి యువత. ఆ తర్వాత మధ్యతరగతి యువత. కలకత్తా, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థులు, మెడికల్ కాలేజీ, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు నక్సల్బరీ రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. గ్రామాలలో మొదలైన అలజడిని అధ్యయనం చేయాలనే తపనతో ఈ కొత్తతరం క్షేత్ర స్థాయికి బయలుదేరింది. ఇట్లా క్షేత్రస్థాయి అనుభవాలు, ప్రభావాల నుంచి రూపొందిన మనిషి మాచర్ల ఏసోబు.

ఏసోబు వరంగల్ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో పేద మాదిగ కుటుంబంలో పుట్టాడు. తల్లిదండ్రులకు మొదటి సంతానం. మాదిగల జీవితంలో పేదరికం తప్పించుకోలేని వాస్తవం. అంటరానితనం వెంటబడి తరుముతుంటే ఆకలి మనస్సును, శరీరాన్ని దహిస్తుంటే జీవితం నుంచి పారిపోలేక యుద్ధం చేయడం అనివార్యమయింది. కరడుగట్టిన భూస్వామ్యం మాదిగలను బానిసలుగా మార్చుకున్నది. అర్ధబానిసత్వం అలవాటయింది. ఏసోబు చిన్న వయస్సులోనే లింగం కేశవరెడ్డి దొర దగ్గర జీతగాడిగా మారాడు. అయ్య చేసిన అప్పు కిందికి మీసమున్న మొలవకముందే కాసే గడ్డి కుప్పకొట్టాడు. పశువుల కాపరిగా, వ్యవసాయ కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. మాదిగలను బ్రాహ్మణీయ కులవ్యవస్థ అరుంధతి సుతులుగా మార్చింది. ఊరికి వెలుపల అంటరానివాళ్లను చేసింది. కాజీపేటకు ప్రవేశించిన రైలు పట్టాలు మార్క్స్ చెప్పినట్లు మాదిగల జీవితాలలో మార్పుకు బాటలు వేసాయి. టేకులగూడెంకు క్యాథలిక్ చర్చ్ వచ్చింది. ఏసోబు జీవితంలోకి అక్షరాల వెలుగు వచ్చింది. తన బంధువు మాచర్ల లాజర్ చదువుతో పాటు ఏసోబుకు జీవిత పాఠాలను కూడా నేర్పాడు.

ఏ అధ్యయనమైన మనిషి జీవితాన్ని వికసింపచేస్తుంది. సంస్కారాన్ని ఇస్తుంది. ఆలోచనా స్రవంతిని విశాలం చేస్తుంది. మెల్లగా ఏసోబు బైబిల్‌ను చదవడం ప్రారంభించాడు. ఆ మత గ్రంథంలోని విషయం, భాష కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మతంతో పాటూ మానవీయ విలువలను బైబిల్ ఏసోబులో ప్రోది చేసింది. కరుడుగట్టిన భూస్వామ్యాన్ని ఎదిరించి తమ తోటి మనుషుల కోసం శిలువ మోసిన జీసస్ ఏసోబు బాల్యాన్ని ప్రభావితం చేసాడు. గుడి నుంచి బహిష్కరించిన దేవుడున్న దేశంలో పుట్టిన అతనికి రెండు చేతులతో కౌగిలించుకున్న జీసస్ అపురూపమనిపించాడు. మతమంటే పరోపకారాన్ని నేర్పుతుందనే తత్వాన్ని గ్రహించాడు. పదహారో యేట బైబిల్‌ను చేతపట్టి అంటరాని ప్రజలకు సాంత్వన చేకూర్చాడు. అలా తన యవ్వన దశ వరకు పాస్టర్‌గా పనిచేసాడు. ఏసోబు పగలంతా జీతగాడు. రాత్రిపూట పాస్టర్.

ఈ కాలంలోనే వరంగల్ నగరం చుట్టూ గ్రామాలు ఇనుము వలె పదునెక్కాయి. నక్సల్బరీ రాజకీయాలు నేర్చుకున్న విద్యార్థులు, యువత గ్రామాలను అధ్యయనం చేయడానికి బయలుదేరారు. సూరపనేని జనార్దన్, పులి అంజన్న తమ యవ్వన కాలపు కలలను నెరవేర్చుకోవడానికి ప్రజల కోసం అంకితమయ్యారు. రాడికల్ విద్యార్థులు టేకులగూడెం గ్రామాన్ని చేరుకున్నారు. విప్లవ రాజకీయాల పరిచయంతో ఏసోబు నూతన మానవుడిగా ఆవిష్కరించుకోవడానికి

> ఏసోబు వ్యక్తిత్వం విప్లవంలో రూపొందింది. తోటి మనుషుల కోసం శిలువ మోసిన జీసస్ ఏసోబు బాల్యాన్ని ప్రభావితం చేసాడు. విప్లవ రాజకీయాల పరిచయంతో తనను నూతన మానవుడిగా ఆవిష్కరించుకోవడానికి కావలసిన ప్రమేయాలను ఏసోబు సొంతం చేసుకున్నాడు. భూమితో మాట్లాడితే జ్ఞానమిస్తుందనే బైబిల్ వాచ్యార్థాన్ని భూపోరాటంగా మలచడం ఎలాగో అతడికి అర్థమయింది. టేకులగూడెం, ధర్మసాగరం, అన్నసాగర్, చేర్యాల, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, నర్సంపేట ప్రాంతాలలో పనిచేసి అనేక భూపోరాటాలు నిర్వహించాడు.



కావలసిన ప్రమేయాలను సొంతం చేసుకున్నాడు. భూమితో మాట్లాడితే జ్ఞానమిస్తుందనే బైబిల్ వాచ్యార్థాన్ని భూపోరాటంగా మలచడం ఎలాగో అతడికి అర్థమయింది. భూస్వామ్యం విధించిన ఆంక్షల సంకెళ్లను తెంచుకోవడానికి సిద్ధమవుతున్న గ్రామానికి ఏసోబు ఒక నమూనాగా మారాడు. నాయకుడయ్యాడు. రాడికల్ యూత్ లీగ్ గ్రామ అధ్యక్షుడయ్యాడు. 1976 నుంచి విప్లవ రాజకీయాల సారాన్ని తన ఆచరణలో భాగం చేసుకున్నాడు. 1980 నాటికి రాడికల్ యూత్ లీగ్ వరంగల్ జిల్లా నాయకుడయ్యాడు. ఏసోబుకు గ్రామీణ ఉత్పత్తి సంబంధాలను కొత్తగా అధ్యయనం చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఆయన జీవధాతువు భూమే. అయితే వర్గ సంబంధాలను విశ్లేషించి వైరుధ్యాలను అర్థం చేసుకొని పరిష్కరించే మార్క్సిస్టు సంవిధానాన్ని అలవర్చుకున్నాడు.

ఏసోబు నాయకుడయ్యాక ఆయన జీవితమే పోరాట వస్తువుగా మారింది. ఒక్క పూట భోజనం పెట్టి, భూస్వాములు రోజంతా పని చేయించుకునేవాళ్లు. శ్రమకు తగిన వేతనం జీతగాళ్లకు దక్కేది కాదు. నాట్లేసే స్త్రీలకు చాలా తక్కువ కూలి ఉండేది. ఆయన నాయకుడయ్యాక ఈ సమస్యలన్నీ పోరాట ప్రాతిపదికగా మారాయి. భూస్వాములు ప్రజలు అడిగిన న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోతే పనులు బంద్ చేయించే పోరాట రూపాన్ని ఏసోబు ముందుకు తెచ్చాడు. వ్యవసాయక విప్లవానికి భూమే కేంద్రం. ఆ భూమి కొద్ది మంది చేతుల్లోనే బందీ అయి ఉంది. దాని బంధ విముక్తికి కావలసిన కార్యాచరణను అమలు చేసి టేకులగూడెంలో ముప్పై ఐదు ఎకరాల భూమిని పేదలు నివాస గృహాలు నిర్మించుకోవడానికి పంపిణీ చేసాడు. వంద కుటుంబాలకు అది ఇప్పటికీ ఉపయోగపడుతున్నది. 1982లో జంగోరు భూస్వామి గడీ మీద చేసిన పోరాటం ఆయన జీవితంలో తప్పక చెప్పవలసినది. జంగోరు దొర చాకలి మల్లయ్య కాలును విరగ్గొట్టాడు. తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఆర్ఈసీ విద్యార్థుల సహాయంతో ఏసోబు ఆ దొరకు వ్యతిరేకంగా పోరాటం నడిపాడు. ఆ పోరాటంలో భాగంగా మల్లయ్య కొడుకు విజయ్ భాస్కర్ విప్లవ రాజకీయాలలోకి వచ్చాడు. సుఖదేవ్ పేరుతో పనిచేసి 2002లో ఛత్తీస్‌ఘడ్‌లో అమరుడయ్యాడు. ఆ పోరాటం తర్వాత బీఎస్ఎఫ్ బలగాలు ఏసోబు ఇంటి మీద దాడి చేసి కూల్చివేసాయి. విప్లవోద్యమంలో నిమగ్నమైన ఆయన క్రైస్తవ మిషనరీల సహాయంతో దళితులకు వ్యవసాయ బావులు తవ్వించాడు. పేద దళిత పిల్లలకు మిషనరీ పాఠశాలలో విద్యను అందించాడు. ఈ క్రమంలో ఆయనకు మునుపటి నుంచి ఫాదర్ కొలంబొ, ఫాదర్ శౌరయ్యలతో ఉన్న పరిచయాన్ని ఉపయోగించి చుట్టుపక్కల గ్రామాల పిల్లలకు మిషనరీ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే ఏర్పాట్లు చేసాడు. వేల సంవత్సరాలుగా విద్యకు దూరమైన దళితులకు చదువు ప్రాముఖ్యతను చెప్పటానికి తానే వయోజన పాఠశాలలో ఉపాధ్యాయుడుగా మారాడు.

1990 మే 5, 6 తేదీలలో వరంగల్‌లో రైతుకూలీ మహాసభలు జరిగాయి. చరిత్రలో ఇదొక అపురూప దృశ్యం. పదిహేను లక్షల మంది హాజరైన ఈ సభలు చరిత్రను సృష్టించాయి. వరంగల్ పట్టణమంతా జనసంద్రంగా మారింది. తెలుగు నేల నలుమూలల నుంచి రైతు కూలీలు తరలివచ్చారు. ఇంతటి ప్రభావమేసిన ఆ సభల నిర్వహణ ఏసోబు నాయకత్వంలో జరిగింది. ఆ తర్వాత ఆయనకు పార్టీలో గుర్తింపు వచ్చింది. నిర్బంధం పెరిగింది. ఫలితంగా అజ్ఞాతంలోకి వెళ్లవలసి వచ్చింది. టేకులగూడెం, ధర్మసాగరం, అన్నసాగర్, చేర్యాల, పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, నర్సంపేట ప్రాంతాలలో పని చేసి అనేక భూపోరాటాలు నిర్వహించాడు. చెరువు శిఖం భూమిని పేదలకు పంచిపెట్టాడు. రావి చెరువు భూపోరాటం నడిపి పదహారు ఎకరాల భూమిని ప్రజలపరం చేసాడు. 2004లో ప్రభుత్వానికి మావోయిస్టు పార్టీకి మధ్య జరిగిన చర్చల తర్వాత దండకారణ్యం బాధ్యతలలోకి ప్రవేశించి అక్కడి ప్రజల జీవితాలలో మార్పు కోసం కృషిచేసాడు. వ్యవసాయ కుటుంబం నుంచి రావటం వలన ఆయనకు ఆ రంగం మీద అపారమైన అనుభవం ఉంది. కనుక దండకారణ్యంలో విప్లవ వ్యవసాయ కమిటీల బాధ్యతలను నిర్వహించాడు.

ఏసోబు వ్యక్తిత్వం విప్లవంలో రూపొందింది. సున్నితమైన మనస్సున్నవాడు. మాట తీరులో సౌమ్యం ఉంటుంది. నిరాడంబర వ్యక్తిత్వం. బాల్యంలో ఆయన వెతుకులాట దేనికోసమో వాటిని జాగ్రత్తగా చూసుకోవడం అలవాటుగా మారింది. మావో రచనల అధ్యయనం ఆయనకు ఇష్టమైన పని. సైద్ధాంతిక విషయాలలో ఎలాంటి గందరగోళం లేకుండా కుల సమస్య పట్ల శాస్త్రీయ దృష్టి ఉంది. ఏసోబు స్వయంగా కవిత్వం రాసేవాడు. పాతికకు పైగా ఆయన రాసిన కవితలు అరుణతారలో అచ్చయ్యాయి. తన కుటుంబాన్ని కూడా రాజకీయ ఆవరణంలో ఉంచడానికి ప్రయత్నం చేసాడు. తన కొడుకు మహేశ్ తెలంగాణ విద్యార్థి వేదికలో పనిచేస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యాడు. అరుదైన నాయకుడు ఏసోబు ఈ దేశ సంపదను రక్షించే ప్రజాయుద్ధంలో ఆయన సెప్టెంబర్ 3, 2024న అర్ధ సైనిక బలగాలు చేసిన దాడిలో అమరుడయ్యాడు.

■ ప్రొఫెసర్ చింతకింది కాశీం

18 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

వికారాబాద్, సెప్టెంబర్ 12 : ఈనెల 18 నుంచి24వ తేదీ వరకు డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్) వికారాబాద్‌లో సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, మిగితా వివరాల కోసం ఏసీజీ రామ్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు.



జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఏచూరి(ఫైల్)

ఏచూరితో ఎనలేని బంధం

- ఉమ్మడి జిల్లా నేతలతో సత్సంబంధాలు
- పలు భూపోరాటాల్లో పాల్గొన్న సీతారాం ఏచూరి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఉమ్మడి జిల్లా వాసులను విషాదంలో నింపింది. కొన్ని దశాబ్దాలుగా ఏచూరికి ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉంది. ఇక్కడ జరిగిన అనేక భూపోరాటాలు, ఉద్యమాలు, సమావేశాల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం, మియాపూర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఈసీఐఎల్, హయత్‌నగర్, మంచాలలో జరిగిన అనేక భూపోరాటాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు. అంతేకాక 2022లో తుర్కయాంజల్‌లో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభలకు విచ్చేశారు. అలాగే తమ్మినేని వీరభద్రం నిర్వహించిన సామాజిక పాదయాత్రలో పాల్గొనేందుకు ఆయన ఇబ్రహీంపట్నం వచ్చారు.

జైపాల్‌రెడ్డితో సన్నిహితంగా...

ఉమ్మడి జిల్లాలోని అనేక మంది నేతలతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డితో విద్యార్థి దశ నుంచే అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో జైపాల్‌రెడ్డి మరణానంతరం మాడ్గులలో జరిగిన జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణకు ఆయన కుటుంబీకులు సీతారాం ఏచూరిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. అలాగే మాజీ ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములతో పాటు తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావుతో కూడా మంచి సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నర్సింహారావు సీపీఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఇక్కడ జరిగిన అనేక భూపోరాటాలు, సభలు, సమావేశాలకు సీతారాం ఏచూరి హాజరయ్యారు. ఆయన మరణం వామపక్షాలకే కాకుండా దేశరాజకీయాలకు తీరని లోటని డీజీ నర్సింహారావు పేర్కొన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శోభన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన స్ఫూర్తితోనే తాను ఎస్ఎఫ్ఐలో చేరి ఉమ్మడి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఏడు సంవత్సరాలు పనిచేసినట్లు తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన రెండు సెమినార్లకు ఆయన్ని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

- యథేచ్ఛగా ప్లాట్ల ఏర్పాటు.. సుమారు మూడెకరాలు మాయం
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- ఏళ్లు గడుస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కొంగరకలాన్ ప్రజలు

ఆదిభట్ల మండలం కొంగరకలాన్ గ్రామ పరిధిలోని కొత్త చెరువు రియల్ వ్యాపారుల భూదాహంతో భారీగా ఆక్రమణలకు గురైంది. ఎఫ్‌టీఎల్ పక్కనే ఉన్న భూమిలో వెంచర్ ఏర్పాటు చేసిన ఓ రియల్ సంస్థ ఎఫ్‌టీఎల్‌లోనూ రోడ్లు, ప్లాట్లను ఏర్పాటు చేసింది. అంతటితో ఆగకుండా బఫర్‌జోన్‌ను సైతం వెంచర్‌లో కలిపేసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్లాట్లను అమాయకులకు అంటగట్టి అక్రమంగా సొమ్ము చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



ఆక్రమణలతో కుచించుకుపోయిన కొత్త చెరువు

ఆక్రమణలో కొత్తచెరువు

కబ్జాల పర్వం 13

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో వెంచర్ ఏర్పాటు

ఆదిభట్ల, సెప్టెంబరు 12: ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 338అ, 338ఆ లో ఉన్న కొత్త చెరువు 18.077 ఎకరాలుగా గుర్తించి హద్దు రాళ్లు పాతారు. మరో రెండెకరాలు బఫర్ జోన్ ఉన్నట్లు తేల్చారు. గొలుసుకట్టు చెరువులలో ఒకటైన ఈ చెరువు రియల్ వ్యాపారుల ధనదాహం వలన ఆక్రమణలకు గురైంది. దీంతో ఈ చెరువు పెద్దపెద్ద వర్షాలు కురిసి వరదలు వచ్చినా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. కొత్త చెరువు పక్కన ఉన్న పట్టా భూమి సర్వే నంబర్ 339, 340లలో నగరానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 2013లో 15 ఎకరాలలో ఓ వెంచర్ వేసింది. ప్లాట్లు చేసే క్రమంలో కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌లో హద్దు రాళ్లను తొలగించి కొంత మేర ఆక్రమించి ప్లాట్లను చేశారు. అంతటితో ఆగకుండా చెరువు బఫర్‌జోన్‌ను కూడా కలిపేసుకున్నారు. ప్లాట్లు చేసి బీటీ రోడ్డులు వేసి ఆదిభట్లలో ఆ సమయంలో నెలకొల్పొని టీసీఎస్ సంస్థను చూపించి ప్లాట్లను విక్రయించారు. టీసీఎస్‌లో పనిచేసే హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇబ్బడిముబ్బడిగా ప్లాట్లు కొనుగోలు చేశారు. సదరు వెంచర్ పార్కు తదితర ప్రజా అవసరాల కోసం వదలాల్సిన భూమిని అధిక శాతం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనే వదిలి వెంచర్‌ను క్లోజ్ చేశారు. మొత్తంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో మూడెకరాల మేర ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. అంటే మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమణకు గురైన భూమి విలువ సుమారు రూ.30 కోట్ల పైమాటే.



కొత్తచెరువు బఫర్ జోన్‌లో వెంచర్ ఏర్పాటులో భాగంగా వదిలిన పార్కు స్థలం

పార్కు స్థలం రీసేల్?

పార్కు స్థలం కోసం బఫర్ జోన్‌లో వదిలిన భూమిని సైతం మళ్లీ విక్రయించినట్లు తెలుస్తోంది. గతంలో పార్కు స్థలంగా లే అవుట్‌లో చూపించిన చోట ఇప్పుడు చుట్టూ ఫెన్సింగ్ వేసి కనిపిస్తుంది. అంటే ఈస్థలం అధిక ధరకు మళ్లీ ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. చెరువు పరిధిలో ఇంతటి విధ్వంసం జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. అధికారులకు అన్ని తెలిసి కూడా చర్యలకు వెనకాడుతున్నారంటే కారణం ఎమై ఉంటుందో చెప్పాల్సిన పనిలేదని జనం చర్చించుకుంటున్నారు. చెరువులను చెరబట్టిన రియల్ వ్యాపారులు భూదాహాన్ని అరికట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కొత్త చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి వెంచర్ వేసిన సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి. పార్కు స్థలం ఇంకా ప్రజా అవసరాల కోసం వదిలిన భూమి పూర్తిగా బఫర్ జోన్‌లోనే ఉందని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం. ఆదిభట్ల మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో సైతం పలుమార్లు ఈ సమస్యను ప్రస్తావించినా చర్యలు లేవు. ఇప్పటికైనా చెరువులను ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై హైడ్రా కఠిన చర్యలు తీసుకోవాలి.

-గోపగళ్ల మహేందర్, కౌన్సిలర్, ఆదిభట్ల మున్సిపాలిటీ

రిజర్వేషన్ల రద్దుకు తెరలేపిన రాహుల్

- దేశంపట్ల చులకనగా మాట్లాడడం దుర్మార్గం
- ప్రధాని కాలేదనే అక్కసుతోనే ఇలాంటి వ్యాఖ్యలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) రాహుల్ గాంధీ అసలు రంగు బయట పడిందని, తన మనసులో మాట బయటపెట్టి రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాలేకపోతున్నారనే అక్కసుతో దేశం మీద విషయం చిమ్మడం, దేశం పట్ల చులకనగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ఓడిపోయినంత మాత్రాన ప్రజాస్వామ్యమే లేదని, దేశప్రతిష్టకు భంగం వాటిల్లే విధంగా ఇంగితజ్ఞానం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ ఉన్నంత కాలం రిజర్వేషన్లను ఎవరూరద్దు చేయలేరని అమిత్‌షా స్పష్టంగా చెప్పారన్నారు. ప్రజా మద్దతుతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని నరేంద్రమోదీ నాయకత్వంలో పాలనాతీరును మెచ్చి బీజేపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, జిల్లా నాయకులు రాజేందర్‌రెడ్డి, బుస్సా శ్రీకాంత్, పాండు, విజయభాస్కర్‌రెడ్డి, శిరీష, వివేకానందారెడ్డి, కేపీ రాజు, శరణరెడ్డి, బస్వలింగం పాల్గొన్నారు.



వికారాబాద్ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

మర్పల్లి, సెప్టెంబరు 12: ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మర్పల్లి మండలంలోని పట్లూర్ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రిజిస్టర్‌లు, నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బుజ్జిబాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పట్లూర్ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్



పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఫార్మాసిటీ మాకొద్దు

- రైతుల వినూత్న నిరసన

భూములు రక్షించాలని ఎల్లమ్మ దేవతకు ముడుపులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 12: దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ కంపెనీలు మాకొద్దు అంటూ ఆయా గ్రామాల ప్రజలు గురువారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. పోలెపల్లి, హకీంపేట్, లగచర్ల, బోడబండతండా, దుప్చర్ల కుంట తండాకు చెందిన రైతులు హకీంపేట్ నుంచి ర్యాలీగా వెళ్లి చౌరస్తాలో నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పోలెపల్లి ఎల్లమ్మ ఆలయంలో ఫార్మాసిటీ నుంచి తమ భూములను రక్షించాలని మొక్కుకుని ముడుపులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, యాదయ్య, గోపాల్‌నాయక్, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బసతో బాగు పడేనా!

గురుకులాలు, వసతి గృహాల్లో కలెక్టర్ నిద్రించాలని ఆదేశాలు

- నెలలో ఒకరోజు బస
- గురుకులాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిశీలన.. పరిష్కారం
- గతంలో గురుకులంలో విద్యార్థుల అస్వస్థత
- పకడ్బందీ పర్యవేక్షణకు సర్కారు చర్యలు

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను కొనసాగిస్తోంది. ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు పౌష్టికాహారం అందించేందుకు నియోజకవర్గాలు, మండలాల్లో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తోంది. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పౌష్టికాహారానికి నోచుకోలేక... వసతుల లేమితో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రత కొరవడి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల వికారాబాద్ జిల్లాలో గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనల నేపథ్యంలో గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో పకడ్బందీగా పర్యవేక్షణ కొనసాగించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ నెలలో కనీసం ఒకరోజు రాత్రి తమ పరిధిలోని ఏదైనా గురుకుల పాఠశాల, లేదా వసతి గృహంలో బస చేసి అక్కడి పరిస్థితులు అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. రాత్రి బస చేసే సమయంలో కలెక్టర్ పరిశీలించిన అంశాలు, జారీ చేసిన ఆదేశాలు తదితర అంశాలను డైరీలో నమోదు చేయాలని ఆమె తన ఆదేశాల్లో స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ (ఫైల్)

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ ....

జిల్లాలో వివిధ సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనార్టీ, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల, ఆశ్రమపాఠశాలలు, కళాశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాలు కొనసాగుతున్నాయి. వివిధ సంక్షేమ వసతిగృహాలు 70ఉండగా, 7ఆశ్రమ పాఠశాలలున్నాయి. తెలంగాణ గురుకుల, సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనార్టీ, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు, కళాశాలలు 24 వరకు ఉన్నాయి. ఇటీవల వికారాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులతో కలిసి అనంతగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థుల సంఘాల నేతలు ఎత్తి చూపడంతో సీఎం ఆరా తీశారు. సీఎం ఆదేశాల మేరకు ఏసీబీ అధికారుల నివేదికను పరిశీలించిన ప్రభుత్వం గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ ఒకరోజు రాత్రి తన పరిధిలోని గురుకుల పాఠశాల, సంక్షేమ వసతి గృహాల్లో ఏదైనా ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ రాత్రి అక్కడే బస చేయాలని, అక్కడ నెలకొన్న సమస్యలు, పరిశీలించిన అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, జిల్లాలో గురుకులు, వసతి గృహాల్లో ఇంకా కలెక్టర్ రాత్రి బస కార్యక్రమం ప్రారంభం కాలేదు.

పరిశీలించనున్న అంశాలు

గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు సందర్శించే సమయంలో కలెక్టర్ విద్యార్థుల చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయి, ఉపాధ్యాయులు ఏవిధంగా బోధిస్తున్నారు, బోధనేతర సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించనున్నారు. గురుకుల, వసతి గృహపరిసరాలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ తీరు తదితర అంశాలను పరిశీలించే అవకాశం ఉంది. అంతేకాకుండా మౌలిక వసతులు, తరగతిగదులు, డార్మిటరీ గదుల్లో విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు పనిచేసే స్థితిలో ఉన్నాయా, లేవా అనేది గుర్తించనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కిచెన్, డైనింగ్ హాల్ ఉందా?, భోజనం చేసేందుకు అనువుగా టేబుళ్లు ఉన్నాయా అనేది పరిశీలించనున్నారు. మెనూప్రకారం విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందుతున్నదా ? లేదా ? పరిశీలిస్తారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీసే అవకాశం ఉంది.

సమాన హక్కులను కల్పించకపోవడం దారుణం

- నల్సార్ క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళన

శామీర్‌పేట, సెప్టెంబరు 12: నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు సమాన హక్కులు కల్పించకపోవటం దారుణమని విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. నల్సార్ మెయిన్‌గేటు ఎదుట బాధిత విద్యార్థులు బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేశారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ విద్యార్థులతో పాటు మేనేజ్‌మెంట్ కోటాలోని ఎంబీఏ, ఐపీఎం, ఎల్ఎల్ఎం చదువుతున్న విద్యార్థులకూ సమానహక్కులను యాజమాన్యం కల్పించడం లేదని ప్లకార్డులు పట్టుకుని పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఎల్ఎల్‌బీ విద్యార్థులతో పాటు ఎంబీఏ, ఐపీఎం, ఎల్ఎల్ఎం విద్యార్థులకు కూడా సమాన హక్కులను కల్పించకపోవడమేంటని ప్రశ్నించారు. ఎల్ఎల్‌బీ విద్యార్థులతో పాటు తమకు కూడా సమాన హక్కులను కల్పించాలని నాలుగేళ్లుగా తాము యాజమాన్యాన్ని కోరుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నల్సార్‌లో చదువుతున్న విద్యార్థులందరినీ యాజమాన్యం సమానంగా చూడకుండా కొందరి పట్ల వివక్ష చూపడం, హక్కులను కల్పించకపోవడమేంటని ప్రశ్నించారు. ఒక న్యాయవ్యవస్థకు చెందిన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల హక్కులను యాజమాన్యం కాలరాయడం, అన్యాయాలకు పాల్పడటం ఘోరమని విద్యార్థులు వాపోయారు. ఎల్ఎల్‌బీ విద్యార్థులతో పాటు తమకు కూడా సమాన హక్కులను కల్పించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ దుర్మార్గం

శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరలింపులో హైడ్రామా

ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద ఉద్రిక్త పరిస్థితులు

ఆమనగల్లు, సెప్టెంబరు12: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆగడాలను ఎదుర్కోవడానికి నాటి తెలంగాణ ఉద్యమ పోరాట తరహాలో పోరాడతామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ అనుచరుల దాడికి నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు నిరసన తెలుపుతుండగా వారిని అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్రి తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటికే ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు స్టేషన్ వద్ద మోహరించారు. అక్కడ 20 నిమిషాల పాటు ఉంచిన అనంతరం వారిని మళ్లీ ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మధుసూదనాచారి తలకొండపల్లి పీఎస్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అనుచరులు దాడికి వస్తున్నారని పోలీసులకు సమాచారమిచ్చినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం



తలకొండపల్లిలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

చేశారు. కౌశిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని. దాడి చేసిన వారిని తక్షణమే అ రెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు ఆధ్వర్యంలో సీపీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన తమను తమ పార్టీ ఎ మ్మెల్యేలను అరెస్టు చేసి రాత్రంతా వివిధ పోలీస్ స్టేషన్లకు తిప్పడం విచిత్రంగా ఉందన్నారు.

పాకిస్థాన్ పాలనను తలపిస్తున్న రేవంత్ సర్కారు తీరు : ఎర్రోళ్ల శ్రీనివాస్

కొత్తూర్ : ముఖ్యమంత్రి రేవంత్ పాలన పాకిస్థాన్‌ను తలపిస్తుందని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతల కారణంగా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ మీదుగా కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా, ఇన్ముల్‌నర్వ గ్రామం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అజయ్ నాయక్, శివచారి ఆధ్వర్యంలో కార్యకర్తలు పోలీస్‌వ్యాన్‌కు అడ్డు తగిలారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి అక్కడి నుంచి కేశంపేటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రేవంత్ పాలన రాక్షస పాలనగా మారిందని దుయ్యబట్టారు. న్యాయం చేయాలని ఆందోళన చేస్తే అక్రమంగా అరెస్టులు చేశారన్నారు.



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

పెంజర్ల అనంతపద్మనాభుడి సేవలో హైకోర్టు జడ్జి

కొత్తూర్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని గురువారం హైకోర్టు జడ్జి శ్రీసుధా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు జడ్జికి ఆలయ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీసుధా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు. పద్మనాభస్వామి దర్శనం ప్రశాంతత కలిగించిందని, ఆలయాన్ని సుందరంగా నిర్మించారని జడ్జి కితాబిచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూరజ్‌సింగ్, కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్సై జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యుడు మామిడి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి శ్రీసుధా

రెవెన్యూ సేవల్లో పారదర్శకత ఉండాలి



భూ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్, సెప్టెంబరు 12: భూ సంబంధిత, ధరణి సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. గురువారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి, భూ సంబంధిత సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను భద్రతపర్చే గదిని పరిశీలించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ధరణి పోర్టల్‌తో సమస్యలు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. అనంతరం రికార్డులపై తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా నియమించడంతో కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పీకర్ తనపై పెట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని శంకర్ తెలిపారు.



మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా
సభ్యత్వ నమోదు చేయించాలి



మేడ్చల్ టౌన్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి



ఘట్‌కేసర్ : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12 : జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విక్రమ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్దఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం అత్యధికంగా సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ క్షేత్ర స్థాయిలో బలోపేతంగా తీర్చిదిద్దటానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్ : పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సభ్యత్వ కార్యక్రమంను యజ్ఞంలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జులు వెంకట్‌రెడ్డి, నర్సింగరావు, అచ్చిని నర్సింహ, నాయకులు అంజనేయులు, రామోజీ, మహేష్, శ్రీరాములు, రామతీర్థ, ప్రవీణ్‌రావు, సురేష్, మహిపాల్‌రెడ్డి, ప్రభంజన్, సిద్దిరాజు, రాధిక పాల్గొన్నారు.

కేంద్రపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న అంజయ్య యాదవ్, లచ్చిరెడ్డి

మంచాల, సెప్టెంబర్ 12: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆదరణ పొందాలని బీజేపీ మండల ఇన్‌చార్జి మర్పల్లి అంజయ్యయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును గురువారం మంచాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో రికార్డు సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దన్నె బాషయ్య, మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య, రాష్ట్రనేత వింజమూరి వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నూకంరాజు, బండిరాజు, చివిరాల పాండు, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేణుక, శక్తికేంద్రం ఇన్‌చార్జి మెండు వెంకట్‌రెడ్డి, మల్ల శ్రీశైలం, రాజు, గౌర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 12 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా.. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం, మాణిక్యమ్మగూడ గ్రామాల్లో రూ.80లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో విడుదలైన నిధులు తప్పా.. కొత్తగా అభివృద్ధికి నిధులు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలవాలని తాము చూస్తుంటే.. కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రం అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకొంటున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా గొంతులో ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకోసమే పని చేస్తానన్నారు. మహేశ్వరంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేసీఆర్ కృషి చేశారని, అది మరిచిపోయి కాంగ్రెస్ నాయకులు వారు సాధించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. విద్య, వైద్యాన్ని గాలి కొదిలేసిన ప్రభుత్వ తీరు కారణంగా అనేక మంది పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతకుముందు సబితారెడ్డి మహేశ్వరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో తాగునీరు, టాయిలెట్లు ఇతర సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి పలువురు విద్యార్థినులు తీసుకెళ్లగా.. వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.



మాణిక్యమ్మ గూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

వరిపైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మర్రిపల్లిగూడ, ఎదులాబాద్‌లలో గురువారం సాయంత్రం భారతీయ వరి పరిశోధన సంస్థ- రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు వరిపైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వరిపైర్లకు పట్టిన ఉల్లికోడు తెగులును పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఉల్లికోడు తెగులును ప్రారంభంలోనే అరికట్టాలని, లేదంటే కొంగీక తెగులు వలే వ్యాపించి వరిపైర్లను నాశనం చేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సాయంత్రం వేళల్లోనే ఉల్లికోడు తెగులు వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వైజ శ్రీధర్, ఎపీ పద్మకుమారి, మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్, ఏఈవో జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్

వికారాబాద్, సెప్టెంబరు 12 : భారీ వర్షాల కారణంగా చాలా ప్రాంతాల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకొని పరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు రూ.15 వేల పరిహారం ఇవ్వాలని, పూర్తిగా పంట నష్టం జరిగితే రూ.50 వేలు అందించాలన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి కొత్తగా గృహాలు కట్టించాలన్నారు. వరదల వల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, ఉచిత వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు. తెలంగాణలో కురిసిన వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రాష్ట్రానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. సత్వరమే రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు అనంతయ్య, వెంకటేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

కొడంగల్, సెప్టెంబరు 12: ఎడతెరిపి లేకుండా కురిసిన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారంకలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాల కారణంగా రైతులు సాగుచేసిన పంటలు తీవ్రంగా నష్టపోయామన్నారు. పంట సాగు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసిన రైతులకు తీరని నష్టం వాటిల్లడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారాన్ని వెంటనే అందించాలన్నారు. అదేవిధంగా వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబ్యానాయక్, భీమేశ్, రాజునాయక్, రమేశ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న విజయలక్ష్మీ పండిట్



శామీర్‌పేట : పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ సత్తిరెడ్డి



తలకొండపల్లి : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

తలకొండపల్లి/శామీర్‌పేట, సెప్టెంబరు 12 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు తలకొండపల్లి మండలం వెల్జాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలబాలికల టోర్నమెంట్ నిర్వహించారు. ఈమేరకు పాఠశాల నుంచి 13 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పి.బన్ని, బాలికల జట్టు కె.తేజస్వినిలు ఎంపికైనట్లు పీడీ పరమేశ్ తెలిపారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. నేటి నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నసీమా, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట మండల పరిధిలోని తూంకుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బాలుర విభాగంలో జి.సాయి, ఉదయ్‌కిరణ్, అనిల్, హేమంత్‌రావు, బాలికల విభాగంలో అలేఖ్య, మౌనికలు రాష్ట్ర స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ గుర్రం సత్తిరెడ్డి వెల్లడించారు.

నేవీ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించిన పరిగి ఎమ్మెల్యే



నేవీ అధికారులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 12 : ఢిల్లీలోని కేంద్ర నేవీహెడ్‌క్వార్టర్‌ను గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి నేవీరాడార్(జలంతర్గాములు)లను వీక్షించి, వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిగి నియోజకవర్గంలోని పూడూరులో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు వారికి ఎమ్మెల్యే వివరించారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

కవల పిల్లల(మగ, ఆడ)కు జన్మనిచ్చిన తల్లి



కవల పిల్లలతో ఈఎంటీ, కుటుంబికులు

బషీరాబాద్, సెప్టెంబరు 12: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో ఇద్దరు కవల పిల్లలను ప్రసవించింది. ఈ సంఘటన ధారురు మండల పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కులకచర్ల మండలంలోని ముజాయిత్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రకళకు పురిటి నొప్పులు రాగా కుటుంబికులు 108కు సమాచారం అందించారు. బషీరాబాద్ మండలానికి చెందిన అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి కండిషన్ సీరియస్‌గా ఉందని, హైదరాబాద్ నీలోఫర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు వెళుతుండగా ధారురు సమీపంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. పైలెట్ శివకుమార్ వాహనాన్ని పక్కకు నిలుపగా.. గర్భిణి కవల పిల్లల(ఆడ, మగ)కు జన్మనిచ్చింది. కాగా, మగ బిడ్డకు ఈఎంటీ శాంత్‌కుమార్ సీపీఆర్ చేయడంతో స్పృహలోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎల్లకొండ పరిసరాల్లో మూవీ షూటింగ్ సందడి



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందంతో ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, సెప్టెంబరు 12: మండలంలోని ఎల్లకొండ పరిసరాల్లో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. పార్వతీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో నిర్వహించిన సినిమా చిత్రీకరణలో ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం పాల్గొన్నారు. ఈక్రమంలో అటుగా వెళ్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఫొటో దిగారు.

అప్పన్న చెరువు వద్ద శాంతి పూజలు



శాంతి పూజ నిర్వహిస్తున్న మత్స్య సహకార సంఘం నాయకులు

తలకొండపల్లి, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పడకల్ అప్పన్న చెరువు అలుగు వద్ద గురువారం శాంతి పూజలు నిర్వహించారు. స్థానిక మత్స్య సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసి చెరువులోకి పెద్దఎత్తున వరద నీరు రావడంతో శాంతి పూజలు చేపట్టారు. కట్టమైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నూకం శేఖర్, ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు కుమార్, శివానంద్, అంజయ్య, రాము, రాములు, కిష్టయ్య, యాదయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేశ్ గుప్తా



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్ గుప్తా

కీసర, సెప్టెంబరు 12: మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బెలిదే రమేశ్ గుప్తా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్టలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. కీసర గ్రామానికి చెందిన రమేశ్ గుప్తా ఘన విజయం సాధించారు. తన గెలుపు కొరకు కృషిచేసిన ప్రతీ ఒక్కరికి రమేష్ కృతజ్ఞతలు తెలియజేయగా, పలువురు ఆయన్ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

బీసీలు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న చేవెళ్ల స్వామి

షాబాద్, సెప్టెంబరు 12 : బీసీలు సంఘటితం కావాలని బీసీ ఐక్యవేదిక నాయకులు చేవెళ్ల స్వామి, బీసీ సే న జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం షాబాద్‌లో గౌడసంఘ భవన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. బీసీ నాయకులు చేవెళ్ల స్వామి, బీసీసేన జాతీయాధ్యక్షుడు బర్క కృష్ణ, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నా యీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కా ర్యదర్శి మాసయ్య, గౌడ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట సభల్లో రిజర్వేషన్లు పెంచాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలంతా సంఘటితం అయితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కా ర్యక్రమంలో బీసీ నాయకులు కూర వెంకటయ్య, రవీందర్, రాజేందర్‌గౌడ్, శ్రీను, రాజు, దర్శన్, చందిప్ప జంగ య్య, రామకృష్ణ, నర్సింహులు, విఠలయ్య, గోపాల్, బిక్షపతి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కబ్జాకు యత్నం

చర్యలు తీసుకోవాలి గ్రామస్తుల వినతి



ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, సెప్టెంబరు 12 : పేదల భూములను కబ్జాచేస్తున్న రియల్ బ్రోకర్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూసీ చేవెళ్ల డివిజన్ కన్వీనర్ దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని దుద్దాగు గ్రామంలోని సర్వేనెంబర్ 52లో ఉన్న భూమిలో రైతులకు, పేదలకు దివంగత వైఎస్ఆర్ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు గ్రామంలోని పేదలు ఆ స్థలాల్లో కబ్జాలో ఉన్నారని, నేడు కొంత మంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఆ విలువైన భూములపై కన్నేసారని, పేదలను బెదిరిస్తున్నారని వాపోయారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి పేదలకు న్యాయం చేయాలన్నారు. లేనియెడల సీపీఎం ఆధ్వర్యంలో ఆ స్థలంలో ఎర్రజెండాలు పాతి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. మండల నాయకులు నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌తో వంద ఎకరాల్లో పంట నష్టపోయాం



మెమొరాండం అందజేస్తున్న రైతులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 12 : సోలార్ ప్లాంట్ వాటర్ వల్ల ఆ ప్లాంట్ చుట్టుపక్కల ఉన్న రైతులు వంద ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అన్నదాతలు ధర్నాకు దిగారు. తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి రైతులు గురువారం సోలార్ ప్లాంటు గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, పలువురు రైతులు మాట్లాడుతూ ప్లాంటు వల్ల తీవ్రంగా పంట నష్టపోతున్నామని, రైతులకు పరిహారం కింద ఎకరాకు రూ.20వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఊరడవ్వ గుడి నుంచి శ్రీరాముల వారి ప్రాజెక్టు వరకు రోడ్డు నిర్మిస్తామని సోలార్ యజమానులు హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకపోతే ధర్నా కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం సోలార్ ప్లాంట్ ఇన్‌చార్జి పవన్‌కుమార్‌కు మెమొరాండం అందజేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గురువా నర్సింహులు, రవిగౌడ్, మొగులప్ప, విజయ్‌కుమార్, ఒలిగిరి రాములు, నర్సింహులు, రాములు, మాణిక్యప్ప, పెద్దోళ్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

చేవెళ్ల కోర్టు సీనియర్ న్యాయాధికారి దశరథ రామయ్య



విజేత జట్టుతో న్యాయాధికారులు, పోలీసులు

చేవెళ్ల, సెప్టెంబరు 12 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని చేవెళ్ల కోర్టు సీనియర్ న్యాయాధికారి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం చేవెళ్ల పోలీస్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ స్టేడియంలో ఫ్రెండ్లీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మొత్తం 14 టీమ్‌లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌లతో పాటు మీడియా జర్నలిస్టులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడ్డారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయాధికారులు ప్రథమ బహుమతి పోలీస్ టీమ్, ద్వితీయ బహుమతి దేవునిఎర్రవల్లి టీంలకు బహుమతులు అందజేశారు. డ్రగ్స్ నివారణకు యువత తోడ్పాటు అవసరం అన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సీఐలు భూపాల్ శ్రీధర్, రమేశ్‌నాయుడు, ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి



విఠల్‌రెడ్డిని అభినందిస్తున్న జిల్లా పాస్ట్ గవర్నర్ రాధాకృష్ణ

కందుకూరు, సెప్టెంబరు 12 : లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింత విస్తరించాలని, అన్ని క్లబుల్లో సభ్యత్వాలను ముమ్మరం చేయాలని క్లబ్ జిల్లా పాస్ట్ గవర్నర్ ఎస్.రాధాకృష్ణ కోరారు. కందుకూరు క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.విఠల్‌రెడ్డితో కందుకూరులోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన విఠల్‌రెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాలు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్లబ్ రీజియన్ చైర్మన్ టి.శ్రీనివాస్, జోన్ చైర్‌పర్సన్లు జనార్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్యదర్శి ఇ.బుచ్చయ్య, ఆమనగల్లు, జిల్లెలగూడ, అధ్యక్షులు పి.లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కందుకూరు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి



అవగాహన సదస్సులో మోటివేషనల్ స్పీకర్ సేవక్‌కుమార్, ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు

కొడంగల్, సెప్టెంబరు 12: తల్లిదండ్రులను కంటికిరెప్పలా కాపాడుకోవాలని మోటివేషనల్ స్పీకర్ సేవక్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. తెలంగాణ ఉద్యమ కారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్, రామకృష్ణ సేవా సమితి వారి సహకారంతో గురువారం కొడంగల్ పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక, నైతిక అంశాలపై నిర్వహించిన సదస్సులో కొడంగల్ పట్టణంలోని వివిధ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విజ్ఞానాన్ని ప్రసాదించి ఉన్నతులుగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రవీంద్రయాదవ్, ఎంఈవో రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, నవీన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, జిల్లా కన్వీనర్ గౌరారం గోపాల్, రామకృష్ణ సేవాసమితి సభ్యులు బాకారం చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ సభ్యులు దాసప్పయాదవ్, భీమారాజు, అంబేడ్కర్ సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి



ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి ఆందోళన చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

ఘట్‌కేసర్, సెప్టెంబరు 12: ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులైన శానిటేషన్, పేషెంట్ కేర్‌టేకర్స్, సెక్యూరిటీ సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె జయచంద్ర అన్నారు. ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వద్ద వేతనాలు చెల్లించాలని గురువారంఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వడంలేదని వాపోయారు. దీంతో కార్మికులు ఆర్థాఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. పనిబారెడు జీతం చారెడు అన్నట్లుగా కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలు ఉన్నాయని గుర్తుచేశారు, ఇచ్చే అరకొర జీతాలైనా నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ సిబ్బందికి తక్షణమే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాగ్యలక్ష్మి, స్వరూప, శివమ్మ, పుష్ప, ప్రేమ, బాలమణి, నాగమ్మ, ప్రేమలత పాల్గొన్నారు.

కౌశిక్ రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం

● మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



వికారాబాద్, సెప్టెంబర్ 12 : కౌశిక్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ గుండాలు కౌశిక్ రెడ్డి ఇంటిపై రాళ్లు, కోడిగుడ్లతో దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ఎమ్మెల్యే గాంధీని అతడి అనుచరులను కౌశిక్‌రెడ్డి ఇంటి మీదకి వదిలి కౌశిక్ రెడ్డిని మాత్రం హౌస్ అరెస్ట్ చేయడమేంటి? అని ప్రశ్నించారు. హౌస్ అరెస్ట్‌లో కౌశిక్‌రెడ్డిపైకి కాంగ్రెస్ గుండాలు వెళ్లటం, గేట్లు, గోడ దూకి దాడికి పాల్పడడమేంటన్నారు.ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, దాడి చేసిన గాంధీని అతడి అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 12: మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిదిలోని 6వ వార్డులో గల ప్రకాశ్‌నగర్ కాలనీలో గురువారం రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎం సుధాకర్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12: ఆర్టీసీ కార్మికుల కుటుంబాల కోసం నిర్వహిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని మేడ్చల్ ఆర్టీసీ డీఎం ఎ. సుధాకర్ అన్నారు. వారం రోజుల పాటు మేడ్చల్ ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని డీఎం గురువారం ప్రారంభించారు. ఆర్టీసీ సంస్థ డీఎం సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఇంజినీర్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న ఎస్‌బీ గుల్షన్

కొడంగల్, సెప్టెంబరు 12: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణలను వెంటనే ఆపాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం సంపదను దెబ్బతీయడంతో పాటు సమాజాన్ని ఆర్థికంగా బలహీన పర్చే ఉద్దేశంతో బిల్లును రూపొందించినట్లు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తాజ్ హుసేన్, షేక్‌అబీద్, ఎండీ.అజహర్, షేక్ రుమాన్, ఎండీ.నిసార్‌బేగ్, ఎండీ.షనవాజ్, ఎండీ.ఏజాజ్, షేక్ అహ్మద్, ఎండీ.రవూఫ్, ఎండీ.జాఫర్‌ఖాన్, ఎండీ.సైఫన్, సయ్యద్ అర్షద్ అలీఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

మంజులా రాథోడ్ ఎస్‌ఐ ట్రైనింగ్ పూర్తి



మంజులా రాథోడ్

బషీరాబాద్, సెప్టెంబరు 12: మండలంలోని జీవన్గి బర్కాల గ్రామానికి చెందిన గిరిజన యువతి మంజులా రాథోడ్ తెలంగాణ పోలీస్ అకాడమిలో ఎస్సైగా ట్రైనింగ్ పూర్తి చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు బుధవారం పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్ హాజరుకాగా.. వారి చేతుల మీదుగా మంజుల ఎస్సైగా నియామక పత్రాన్ని అందుకుంది. తల్లి సోనిబాయి, తండ్రి లక్ష్మణ్‌తో పాటు తన ముగ్గురు సోదరులు విష్ణు, ఆనంద్, అర్జున్ ఆనందంలో మునిగిపోయారు.

17న వికారాబాద్‌లో వినాయక నిమజ్జనం

వికారాబాద్, సెప్టెంబరు 12 : ఈనెల 17న వికారాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి చిగుళ్లపల్లి రమేష్‌లు చెప్పారు. పట్టణంలోని రామమందిరంలో గురువారం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 17న మంగళవారం మధ్యాహ్నం 2గంటల వరకు వినాయక విగ్రహాలు కొత్తగంజ్‌కు చేరుకోవాలని అక్కడి నుంచి ఎబ్బనూర్‌కు శోభయాత్రగా వెళ్లి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. కన్వీనర్ కృష్ణపంతులు, పట్టణ ప్రముఖులు శుభప్రద్‌పటేల్, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, బుస్సా శ్రీకాంత్, పోకల సతీష్, మాలే లక్ష్మణ్, ముత్తహర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెనకు మరమ్మతులు



తాత్కాలిక వంతెన పైపులపై కొట్టుకుపోయిన మట్టి



మట్టిపోసి మరమ్మతులు చేసిన తాత్కాలిక వంతెన

ధారూరు, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ప్రవహించి దోర్నాల వాగుపై ఉన్న డైవర్షన్ తాత్కలిక వంతెనపై మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈవంతెన పైనుంచి దాటి ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి అతికష్టంగా మట్టి కొట్టుకుపోయిన పైపుల మీది నుంచి రాకపోకలు సాగించాల్సివచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం పూట ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ వంతెనపై మరమ్మతు పనులు చేపట్టారు. వంతెన మీద తేలిన సిమెంట్ పైపులను సరిచేసి వాటిపై మట్టిపోసి చదను చేశారు. దీంతో వంతెనపై రాకపోకలకు మార్గం ఏర్పడి రాకపోకలకు అనువుగా మారింది. మళ్లీ వర్షం పడి వరద వస్తే పైపులపై పోసిన మట్టి మళ్లీ కొట్టుకుపోయే పరిస్థితి ఉందని, వంతెన పనులు పూర్తయితేనే సమస్య తీరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుకట్టపై గండి పూడ్చివేత

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపల్, ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువుకట్టకు పడిన గండిని ఇరిగేషన్ అధికారులు గురువారం పూడ్చివేశారు. నీరు కిందికి వెళ్లకుండా ఇసుకబస్తాలతో పకడ్బందీగా చెరువుకట్టపై ఏర్పడిన గండిని పూడ్చివేశారు. ఇరిగేషన్ ఏఈ పరమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గండిని వేగవంతంగా పూడ్చివేసి నీరు కిందికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం వాటిల్లదని ఏఈ తెలిపారు. సకాలంలో అధికారులు స్పందించి చెరువుకట్టపై పడిన గండిని పూడ్చివేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది సైతం అదేస్థలంలో కట్టపై గండిపడి నీరంతా కిందికి వృథాగా వెళ్లిందని, మరోసారి ఇలాంటి ప్రమాదం జరుగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



ఘట్‌కేసర్ రూరల్: లక్ష్మినారాయణ చెరువుకట్టపై పడిన గండిని పూడ్చేందుకు బస్తాల్లో ఇసుకను నింపుతున్న కూలీలు

దేశం గొప్ప మేధావిని కోల్పోయింది



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆపార్టీ నాయకులు, అభిమానులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 12: దేశం ఒక గొప్ప మేదావిని కోల్పోయిందని సీపీఎం నాయకులు చింతల యాదయ్య, ఎస్ సబిత అన్నారు. పోచారం మున్సిపాలిటీ రాజీవ్‌గృహకల్ప కాలనీలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సీతారాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదల పక్షాన పోరాడే నాయకుడి ఆకాల మరణం దేశానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఓటరు తుది జాబితాను సిద్ధం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 12: ఓటరు తుది జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలని కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి బీఎల్‌వోలను ఆదేశించాడు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. అక్టోబర్ 29న ఓటరు తుదిజాబితాను ప్రకటించాలని, తప్పులుంటే సూపర్‌వైజర్లపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబెర్ అలీ, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

కులకచర్ల, సెప్టెంబరు 12: పేదకుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని మందిపాల్ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం గురువారం ఆమెకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షుడు నరసింహనాయక్, నీల్యానాయక్, చందర్, శరత్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 19 మంది లబ్ధి దారులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ.6లక్షలా 81వేలు విలువ గల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బెరి బాల్‌రాజ్, కమిషనర్ అజ్మీర స్వామి నాయక్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 47 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్‌చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలిమోద్దీన్, ఫసియోద్దీన్, రామేశ్వర్, నర్సింగ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, సురేశ్, సంజీవరెడ్డి, అబ్రహం, మధుకర్‌రెడ్డి, శేఖర్, అంజయ్య, వెంకటేశం, రవీందర్‌రెడ్డి, పాండు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** తాండూరు పోలీస్‌స్టేషన్‌లో నాగుపాము కలకలం రేపింది. స్టేషన్‌లో గురువారం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నాగుపామును గమనించి స్నేక్ స్నాచర్‌కు సమాచారం అందించారు. సొసైటీ వారు పామును రెస్క్యూ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

● **పరిగి:** దివ్యాంగులందరూ స్వయం ఉపాధితోపాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధి పీఎన్ శ్రీనివాస్ అన్నారు. రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా పరిగి నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. శిక్షణ పొందిన 38 మందికి ధ్రువీకరణ పత్రాలతోపాటు రూ.25వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ స్టేట్ మేనేజర్ గురుదేవి, జిల్లా కో-ఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ మెంబర్స్ సంజీవరావు, ఆర్.రాములు పాల్గొన్నారు.

● **పరిగి:** గుండెపోటుతో మృతి చెందిన కాళ్లాపూర్ పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటయ్య సేవలు మరులేనివని పరిగి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్, రఘు, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగంముదిరాజ్‌లు అన్నారు. పరిగిలోని గంగాసదన్‌లో గురువారం వెంకటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జింకల యాదయ్య, నర్సింహులు, కుమార్‌గౌడ్, గోపాల్, శంకర్‌రావు, కాశీపతి పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ ఏపీడీ సరోజిని అన్నారు. మండల కేంద్రంలో డీఆర్‌డీఏ ద్వారా రుణం పొందిన యూనిట్‌లు ఏర్పాటు చేసుకున్న చికెన్ సెంటర్, హోటల్, టెంట్ హౌస్‌లను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం రామ్మూర్తి, మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

● **పరిగి:** బహార్‌పేట్ హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ అశోక్, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

● **కొడంగల్:** మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉషశ్రీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమావేశానికి అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

● **ఘట్‌కేసర్:** నేడు ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల ఖోఖో టోర్నమెంట్లను నిర్వహించిన అనంతరం ఆయా మండలాల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి కె శ్రీరాములు గురువారం నాడోక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం (నేడు) ప్రతాపసింగారం చౌరస్తా వద్దగల జేఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9390068408, 9542026432 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

● **మోమిన్‌పేట్:** మండలంలోని టేకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల తపాస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా మధుకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.అంజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా చంద్రశేఖర్, మీడియా కన్వీనర్‌గా మహేందర్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

● **దోమ:** మండల కేంద్రంలోని కేజీబీవీలో నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం స్థానిక ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వప్న ఎంపికైన ఐదుగురికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పోస్టులకు ఐదుగురు మహిళలు దరఖాస్తు చేసుకోగా ఎంపిక నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు తెలిపారు.

● **కీసర:** రాంపల్లి దాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌కు జాతీయస్థాయిలో అవార్డు దక్కింది. బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సిఫోర్‌స్కూల్ ఎక్స్‌లెన్స్ 2024సర్వే నిర్వహించింది. ఈ మేరకు సిఫోర్‌స్కూల్ ఎక్స్‌లెన్ వ్యవస్థాపకులు ప్రేమ్‌చంద్ పాటిల్ బుధవారం ఢిల్లీలో జాతీయస్థాయి ఇండియాస్ టెస్ట్‌డే కోఎడ్యుకేషన్ సీబీఎస్ఈ స్కూల్ అవార్డును జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మాజారావుకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ మురళీముకుంద్ పద్మాజారావు, ఉపాధ్యాయులను అభినందించారు.

● **కీసర:** అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ యజమానులకు రెవెన్యూ అధికారులు గురువారం జరిమానా విధించారు. అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో నియమ, నిబంధనలకు విరుద్ధంగా మట్టిని లారీలలో తరలిస్తున్న విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మట్టిని తరలిస్తున్న లారీలకు రూ.50వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీ పథకాల్లో గ్యాస్ సబ్సిడీ గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు అందించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్ తెలిపారు. మండలానికి మంజూరైన 400 సబ్సిడీ గుర్తింపు కార్డులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు.

● **మేడ్చల్ టౌన్:** 70ఏళ్లు దాటిన వృద్ధుల కోసం ఉచితంగా వైద్యసేవలు పొందే విధంగా కేంద్ర ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ హంసరాణి కృష్ణగౌడ్ అన్నారు.

క్రైం కార్నర్

బీ ఫార్మసీ చదివి ఎంబీబీఎస్‌గా అవతారం

● నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు



నాగారంలో నకిలీ డాక్టర్ కొనసాగిస్తున్న వైరమ్ లత్రాశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్



నకిలీ డాక్టర్ బండ సాయివర్ధన్‌రెడ్డి

కీసర రూరల్, సెప్టెంబరు 12: బీ ఫార్మసీ చదివి ఎంబీబీఎస్‌గా అవతారమెత్తిన ఓ నకిలీ డాక్టర్‌పై కేసు నమోదైన ఘటన బుధవారం మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ దమ్మాయిగూడ రోడ్డులో బండ సాయివర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి కొద్దిరోజులుగా వైరమ్ లత్రాశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కొనసాగిస్తున్నాడు. బీ ఫార్మసీ చదివిన సాయివర్ధన్‌రెడ్డి ఎంబీబీఎస్ డాక్టర్‌గా అవతారమెత్తి జనాలకు వైద్యం చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. దీంతో అతడు అర్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా వైద్యాధికారి అతని అర్హత పత్రాలను పరిశీలించి, నకిలీ వైద్యుడిగా తేల్చారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేసి, వైద్యుడిగా కొనసాగుతున్న సాయివర్ధన్‌రెడ్డిపై కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి నుంచి ఒక కారు, రూ.8,500నగదు, స్టెతస్కోపు, పలువురు రోగులకు సంబంధించి కేస్ షీట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సాయివర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నీటికుంటలో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహం

కులకచర్ల,సెప్టెంబరు 12: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కులకచర్ల మండలం సాల్వీడ్‌లో జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లికి చెందిన సావిత్రి, బాబు దంపతులు తమ మూడేళ్ల బాలుడు వీరభద్రతో కలిసి తల్లి అంజమ్మ దగ్గర సాల్వీడ్‌కు వచ్చారు. పొలం దగ్గర బాలుడి ఉంచి వారు పనుల్లో నిమగ్నమయ్యారు. బాలుడు ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటికుంటలో పడి మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడు విగత జీవిగా కనిపించాడు. బయటకు తీసి చూడగా బాలుడు అప్పటికే మృతిచెందాడు.

రూ.2.60 లక్షలు విలువైన మాదకద్రవ్యాలు పట్టివేత

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ, కండ్లకోయప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న స్థావరంపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ముగ్గురు నిందితులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.2 లక్షల 60వేల డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఆర్.తిరుపతి యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోగల కళాశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు మత్తుపదార్థాలను విక్రయించి డబ్బులు సంపాదించాలన్న ఆశతో శనుముకసాయి, జూపాక నందు, ఉమేష్ చంద్రఅనే యువకులు గుండ్లపోచంపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని గట్టుగా వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ ముగ్గురికి సన్ని అనే యువకుడు డ్రగ్స్, గంజాయి, హాశిష్ ఆయిల్ మత్తు ద్రవాన్ని సరఫరా చేసేవాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు గురువారం మత్తు పదార్థాలు విక్రయించే స్థావరంపై దాడి చేయగా వారి వద్ద నుంచి 0.68గ్రాములు ఎండీఎం డ్రగ్స్, 10గ్రాముల గంజాయి, హాశిష్ ఆయిల్ మత్తు ద్రవ్యం లభించింది. దీంతో నిందితులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి మత్తు పదార్థాలు సీజ్‌చేశారు. వీరితో పాటు కలిసి మత్తు పదార్థాల దందా చేసే అరుణ్‌కుమార్, అజయ్‌సన్నీ, మేకల శివరాంలు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎక్సైజ్ డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ సీఐ నాగరాజు, సిబ్బంది అన్వర్, రాజేశ్వర్, రాంచదర్, శశికిరణ్, జయచందర్ రెడ్డి, అనురాధ, కాశీరావులు పాల్గొన్నారు.

పరిగిలో 160 గ్రాముల గంజాయి పట్టివేత

పరిగి: పరిగి పట్టణంలో 160గ్రాముల గంజాయి పట్టుబడింది. ఇందుకు సంబంధించి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారంతో పరిగిలోని బ్రాహ్మణవాడలోని వి.వినోద్ అలియాస్ బక్కచింటూ ఇంట్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో 160గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసి నిందితుడు వినోద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

కీసర రూరల్, సెప్టెంబరు 12: ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు గాయాల పాలైన ఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర మండలం రాంపల్లి దాయరకు చెందిన దూసరిసాకేత్, ఇంద్రసేనారెడ్డిలు వారి ఎర్టిగా కారులో కీసర నుంచి కుషాయిగూడ దిశగా ప్రయాణిస్తున్నారు. కాగా ఆవుటర్ రింగ్ రోడ్డు సమీపంలో వర్దనా స్కూల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న వీరిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పరిగి, సెప్టెంబరు 12: అక్రమంగా తరలిస్తున్న 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. మండలంలోని గుబ్బడితండాకు చెందిన బాలరాం, రేకల చౌడాపూర్‌తండాకు చెందిన రాహుల్‌లు కలిసి టీఎస్34టీఏ 8714 నంబరు గల ట్రాలీ వాహనంలో రేషన్ తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు రాఘవాపూర్ దగ్గర తనిఖీలు నిర్వహించి వాహనాన్ని సీజ్ చేసి 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కులకచర్ల, సెప్టెంబరు 12: మండలంలోని రాంనగర్ గ్రామ అనుబంధ తండా సూర్యనాయక్ తండాలో తాళం వేసిన ఇంట్లో చోరి జరిగింది. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు తండాకు చెందిన గోబ్యానాయక్ భార్య జానకమ్మ గత ఐదు నెలల కిందట మృతిచెందింది. పండితుల ఆదేశాలతో సొంత ఇంటికి తాళంవేసి తండాలోని వేరే ఇంట్లో ఉంటున్నారు. గురువారం ఉదయం చూడగా తాళం తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగొట్టి దొంగిలించుకుపోయినట్లు గమనించారు. ఈ ఘటనపై బాధితుడు గోబ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

తాండూరు రూరల్, సెప్టెంబరు 12: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరన్‌కోట్ పోలీసులు తెలిపారు. తాండూరు మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం ఇసుక తరలిస్తున్న సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నరేష్‌ను పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యవసాయ కూలీ ఆత్మహత్య

బషీరాబాద్, సెప్టెంబర్ 12: మద్యం మత్తులో ఓ గిరిజన వ్యవసాయ కూలీ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం బద్లాపూర్‌తండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ఏంఎ.గఫార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రథోడ్ హన్మానాయక్(46) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం భార్య లాలీబాయితో కలిసి పొలానికి వెళ్లాడు. పొలంలో భార్యతో కలిసి పంటకు మందు పిచికారి చేశాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న హన్మానాయక్ ఉన్నట్టుండి పురుగుల మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన భార్య వెంటనే తండావాసుల సాయంతో తాండురులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న హన్మానాయక్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినాయక ఊరేగింపులో గొడవ.. 8 మందిపై కేసు

బషీరాబాద్, సెప్టెంబర్ 12: వినాయక నిమజ్జన ఊరేగింపులో గొడవపడి ఓ వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ ఏంఎ.గఫార్ తెలిపారు. మండలంలోని మల్కన్‌గిరి గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తుండగా ట్రాక్టర్ లైట్లు ఆగిపోయాయి. ఈ క్రమంలో డ్యాన్సులు చేస్తున్న కొందరు డ్రైవర్‌తో స్థానికులు గొడవపడ్డారు. ఈ క్రమంలో గొడవ పెద్దదై ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఆలయ దర్శనం

తిలతర్పణపురి నరముఖ గణపతి





'తొండము నేకదంతమును...' అని ఆ ఆలయంలో గణేశుణ్ణి ప్రార్థించాలంటే కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే అక్కడ గణపతి తొండం, దంతం లేకుండా... నరముఖంతో దర్శనమిస్తాడు. ఈ ఆలయం తమిళనాడులోని పూన్‌తోట్టమ్ సమీపంలోని తిలతర్పణపురిలో (ప్రస్తుతం శీతలపతి గ్రామంలో) ఉంది. గణపతి గజముఖుడిగా కాకుండా... మానవ ముఖంతో కనిపించే ఆలయం ఇదొక్కటేనంటారు. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన కథను స్థలపురాణం చెబుతోంది.

నలుగుపిండితో పార్వతీదేవి ఒక బొమ్మను తయారు చేసి, దానికి ప్రాణం పోసింది. ద్వారానికి ఆ బాలుణ్ణి కాపలాగా పెట్టి స్నానానికి వెళ్ళింది. అంతలో శివుడు అక్కడికి వచ్చాడు. ఆయనను లోపలికి వెళ్ళకుండా ఆ బాలుడు అడ్డుకున్నాడు. దాంతో శివుడు ఆగ్రహించి... ఆ బాలుడి తలను ఖండించాడు. తరువాత పార్వతీ దేవి ద్వారా ఆ బాలుడి గురించి తెలుసుకొని... ఏనుగు శిరస్సును ఆ బాలుడి తలకు అతికించాడు. ఆ గజాననుడు తదనంతరం గణాధిపతి అయ్యాడు. తదనంతర కాలంలో... మునుల కోరిక మేరకు తిలతర్పణపురిలో ముక్తీశ్వరుడిగా శివుడు, స్వర్ణవల్లిగా పార్వతీదేవి కొలువయ్యారు. వినాయకుడు... గజముఖుడు కావడానికి ముందున్న రూపాన్ని చూడాలని శివుణ్ణి పార్వతి కోరగా... ఆయన అనుగ్రహించాడు. దానితో మానవ ముఖంతో గణేశుడు ఇక్కడ వెలిశాడు. పూర్వరూపంతో కనిపించే గణపతి కాబట్టి ఆయనను 'ఆది వినాయకర్' అంటారు. వాస్తవానికి ఈ ఆలయంలో ప్రధాన దైవం ముక్తీశ్వరుడు. కానీ ఇది 'నర గణపతి ఆలయం'గానే ప్రసిద్ధి చెందింది. ముక్తీశ్వరుడు, ఆయన దేవేరి స్వర్ణవల్లి, నర గణపతితోపాటు ఈ ఆలయంలో సూర్య, చంద్రుల విగ్రహాలు కూడా పూజలు అందుకుంటున్నాయి.

సుమారు 1400 ఏళ్ళ క్రితంనాటి ఈ వినాయక ఆలయం పితృదోష నివారణ క్షేత్రంగానూ ఖ్యాతిగాంచింది. ప్రతినెలా అమావాస్య నాడు, మహాలయ పక్షాల్లోనే కాదు... సాధారణ దినాల్లో సైతం ఎంతోమంది ఈ ఆలయం సమీపంలో ఉన్న చంద్రతీర్థం అనే కొలనులో స్నానం చేసి, పిండప్రదానాలు చేసి, తర్పణాలు వదిలి... శివపార్వతులను, గణపతిని దర్శించుకుంటారు. దీని వెనుక కూడా ఒక పౌరాణిక గాథ ఉంది. శ్రీరాముడు తన తండ్రి దశరథుడికి దేశంలోని పలుచోట్ల పితృకర్మలు జరిపి, పిండప్రదానాలు చేశాడట. కానీ దశరథుడికి ముక్తి లభించకపోవడంతో... శివుణ్ణి ప్రార్థించాడట. ఈ చంద్రతీర్థంలో స్నానం ఆచరించి, పితృతర్పణాలు ఆచరించాలని శివుడు ఆదేశించడంతో... శ్రీరాముడు ఆ విధంగా చేసి తండ్రికి ముక్తి కలిగించాడట. తిలల (నువ్వుల)తో తర్పణాలు వదిలే చోటు కాబట్టి దీనికి 'తిలతర్పణపురి' అనే పేరు వచ్చింది. ఇక్కడ ఆచరించే కర్మల ద్వారా పితృదేవతలు సంతృప్తులవుతారని, తమ వారసులు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీస్సులు అందజేస్తారనీ, భక్తిశ్రద్ధలతో నరముఖ గణపతిని ఆరాధిస్తే అన్ని సమస్యలు, జీవితంలోని ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ప్రతినెలా సంకట హర చతుర్థి నాడు ఈ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయం తమిళనాడులోని కుంభకోణానికి 37 కిలోమీటర్ల దూరంలో ఉంది.

గీతాసారం

ఉపసంహరించుకోవడమే వివేకం

"తాబేలు తన అవయవాలను అన్ని వైపుల నుంచి లోపలికి ముడుచుకున్నట్టు... ఇంద్రియాలను విషయాసక్తుల నుంచి అన్ని విధాలా ఉపసంహరించుకున్న వ్యక్తి బుద్ధి స్థిరంగా ఉన్నట్టు భావించాలి" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. శ్రీకృష్ణుడు ఇంద్రియాలకు చాలా ప్రాధాన్యం ఇస్తాడు. ఎందుకంటే అవి మన అంతర్గత ప్రపంచానికి, బాహ్య ప్రపంచానికి మధ్య ద్వారాలలాంటివి. తాబేలును ఉదాహరణగా తీసుకుంటే... అది ప్రమాదాన్ని ఎదుర్కొన్నప్పుడు తన అవయవాలను లోపలికి ముడుచుకుంటుంది. అదే విధంగా ఇంద్రియాలను ప్రేరేపించే, ప్రలోభపెట్టే విషయాలతో ఇంద్రియాలు జతకూడడం




గమనించినప్పుడు... మన ఇంద్రియాలను లోపలికి ఉపసంహరించుకోవాలని శ్రీకృష్ణుడు సలహా ఇస్తున్నాడు.

ప్రతి ఇంద్రియానికి రెండు భాగాలు ఉంటాయి. ఒకటి బయటికి కనిపించే కన్ను లాంటి బాహ్యమైన భాగం. రెండవది కన్నును నియంత్రించే మెదడులోని ఇంద్రియ నియంత్రిత భాగం. ఇంద్రియాలు, ఇంద్రియార్థాల మధ్య పరస్పర స్పందనలు రెండు స్థాయిలలో జరుగుతాయి. మొదటిది... కాంతి తాలూకు కణాలు (ఫోటాన్లు) బాహ్య ఇంద్రియ పరికరమైన కన్నును చేరినప్పుడు.. కన్ను దానంతటది అదే కాంతికి స్పందిస్తుంది. అదే విధంగా మిగిలిన ఇంద్రియ పరికరాలు కూడా తమతమ ఇంద్రియ విషయాలకు వాటంతట అవే స్పందిస్తాయి. ఇక రెండవ స్థాయి అనేది... ఇంద్రియాలకు, వాటిని నియంత్రించే మెదడులోని భాగాలకు మధ్య జరుగుతుంది.

చూడాలనే కోరికే కంటి వికాసానికి కారణం. ఆ కోరిక ఇంద్రియాన్ని నియంత్రిచే భాగంలో ఉంది. సాంకేతికపరంగా దాన్ని 'ప్రేరేపిత దృష్టి' (మోటివేటెడ్ పర్సెప్షన్) అని పిలుస్తారు. ఇక్కడ



మనం చూడాలనుకున్నవాటినే చూస్తాం. వినాలనుకున్నవాటినే వింటాం. కానీ సమగ్రంగా చూడలేం, సంపూర్ణంగా వినలేం. కృష్ణుడు ఇంద్రియాల గురించి ప్రస్తావించినప్పుడు... కోరికలను ఉత్పత్తి చేసే ఇంద్రియ నియంత్రక భాగం గురించి వివరిస్తున్నాడు. మనం ఇంద్రియాలను భౌతికంగా మూసేసినా... మన కోరికలను సజీవంగా ఉంచడం కోసం మనస్సు తన ఊహాశక్తిని ఉపయోగిస్తుంది. ఎందుకంటే మనస్సు ఈ నియంత్రణలన్నిటి కలయిక కాబట్టి. ఇంద్రియాలను నియంత్రించేవాటిని. ఇంద్రియాల భౌతిక భాగం నుంచి వేరు చేయాలని శ్రీకృష్ణుడు మనకు మార్గనిర్దేశం చేస్తున్నాడు. తద్వారా మనం ఎల్లప్పుడూ ఉత్తేజపరిచే లేదా నిరుత్సాహపరిచే బాహ్య పరిస్థితుల నుంచి స్వేచ్ఛను (మోక్షాన్ని) పొందుతాం. ఏ పరిస్థితుల్లో ఎప్పుడు వెనకడుగు వెయ్యాలో, అంటే ఇంద్రియాలను ఎప్పుడు ఉపసంహరించుకోవాలో తెలుసుకోవడమే వివేకం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

శ్రద్ధ, విశ్వాసం ప్రధానం

తల్లితండ్రులను భగవంతుడికన్నా మిన్నగా భావించాలని, కన్నవారిని ఆదరించనివాణ్ణి భగవంతుడు కూడా క్షమించడని హిందూ సనాతన ధర్మం చెబుతోంది. పార్వతీ పరమేశ్వరులకు మూడుసార్లు ప్రదక్షిణ చేసినందుకు వినాయకుడికి దక్కిన ఫలమే గణాధిపత్యం. అందుకే తల్లితండ్రులకు, పూర్వులకు ఉత్తమగతులు కలిగేలా చేయడం ఒక బాధ్యతగా పూర్వులు నిర్దేశించారు. మనిషి తన జీవితంలో తీర్చుకోవలసినవి పంచ ఋణాలు. వాటినే 'పంచ యజ్ఞాలు' అని కూడా అంటారు. అవి దేవ, పితృ, ఋషి, భూత, మనుష్య ఋణాలు. వాటిలో ప్రధానమైనది పితృరుణం. ఆ ఋణం నుంచి విముక్తి పొందడానికి చేసే కర్మల్లో శ్రాద్ధకర్మ ఒకటి. 'శ్రార్ధ కర్మ' అంటే 'శ్రద్ధతో చేసే కర్మ' అని అర్థం. గతించిన తల్లితండ్రులకు శ్రద్ధాభక్తులతో చేసే క్రతువు అది. ఇక్కడ ఆచార వ్యవహారాలకన్నా శ్రద్ధ, విశ్వాసం ముఖ్యం. ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క దేవతకు ప్రాధాన్యాన్ని ఇచ్చే సంప్రదాయం... భాద్రపద మాసంలోని బహుళ పక్షాన్ని పితృ పక్షంగా నిర్దేశించింది. ఈ ప్రకారం... భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమాస్యవరకూ... పదిహేను రోజుల కాలాన్ని 'పితృపక్షం'గా లేదా 'మహాలయ పక్షం'గా పరిగణిస్తారు. ఈ రోజుల్లో శ్రార్ధ కర్మలు నిర్వర్తించి... దాన, తర్పణ, సంతర్పణాది క్రియలు నిర్వహిస్తే... పితృదేవతలు సంతృప్తి చెంది... తమ వారసుల్ని అనుగ్రహిస్తారని శాస్త్రవచనం. దీన్ని మన పూర్వులు మరణించిన తిథినాడు లేదా పక్షంలో ఏదో ఒక రోజున... అదీ వీలు కాకపోతే అమావాస్య రోజున శ్రాద్ధకర్మలు ఆచరించాలి. అదీ కుదరకపోతే... శ్రద్ధాభక్తులతో తర్పణాలైనా వదలాలి. భాద్రపద మాసంలోని మహాలయ పక్షంతో కలిపి... పితృదేవతలను అర్చించే రోజులు ఏడాదిలో 96 ఉన్నాయి. వాటిలో పన్నెండు అమావాస్యలు ముఖ్యమైనవి. పలు ప్రాంతాల్లో అమావాస్య రోజున తర్పణాదులు నిర్వర్తించే సంప్రదాయం ఉంది.

18 నుంచి మహాలయ పక్షం


మనకు మూడు శరీరాలు ఉంటాయని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. మొదటిది భౌతికంగా కనిపించే శరీరం. రెండోది ప్రేత శరీరం. మూడవది ఆత్మ... సూక్ష్మ శరీరం. వసు, రుద్ర, ఆదిత్య రూపాలు ఈ మూడింటికీ ప్రతీకలు. మన సంకల్పంలో పితరులను స్మరించుకుంటూ... వసు, రుద్ర, ఆదిత్య రూపాలకు ముమ్మారు తర్పణాలు వదిలి, ఆ తరువాత అన్న సంతర్పణ చేస్తే... శ్రాద్ధ కర్మ పరిపూర్ణం అవుతుందనేది శాస్త్రవచనం. మహాలయ పక్షానికి సంబంధించిన కథ ఒకటి ఉంది. కర్ణుడు దానశీలిగా ప్రసిద్ధి పొందాడు. మహాభారత యుద్ధంలో మరణించిన అతను స్వర్గలోకానికి వెళ్తూ ఉండగా... ఆకలి, దప్పిక కలిగాయి. తినడానికి పండు ముట్టుకున్నా, తాగడానికి దోసిటిలో నీరు తీసినా... అవి బంగారంగా మారిపోతున్నాయి. ఇదేమిటని అతను ఆశ్చర్యపోయాడు. అప్పుడు ఆకాశవాణి "కర్ణా! నీవు మహాదాతవు. కవచ కుండలాలతో సహా అన్నీ దానం చేసి... చేతికి ఎముకలేదనే పేరు సంపాదించావు. కానీ నీ చేత్తో ఎవరికీ పట్టెడు అన్నం పెట్టిన దృష్టాంతం లేదు. కాబట్టే ఈ దుస్థితి కలిగింది" అని చెప్పింది. అప్పుడు తన తండ్రి అయిన సూర్యుణ్ణి కర్ణుడు ప్రార్థించి... ఆయన అనుగ్రహంతో భూలోకానికి వచ్చాడు. పదిహేను రోజుల పాటు... తన రాజ్యంలోని అందరికీ షడ్రసోపేతమైన విందు చేసి, పితరులకు తర్పణాదులు విడిచాడు. తిరిగి స్వర్గలోకం చేరుకున్నాడు. ఆ పక్షమే 'మహాలయం' అనే పేరిట ప్రసిద్ధి చెందింది. "శ్రేష్ఠులైనవారు, విజ్ఞులు ఏది ఆచరించి మార్గనిర్దేశం చేస్తారో... దాన్ని సామాన్యులు ఆచరించి తరించవచ్చు" అని 'భగవద్గీత' చెప్పింది. పితృపక్షం కూడా అటువంటిదే. ఇది తమ వారసత్వాన్ని గుర్తుచేసుకొని, పూర్వులకు నివాళులు అర్పించే పుణ్యక్రతువు. పుణ్యఫలం కోసం ఇది ఆవశ్యకమైన కర్తవ్యం అన్నది పెద్దల మాట.



ఎ. సీతారామారావు

సుభాషితం

జగజ్జేతలు



కాంతాకటాక్ష విశిఖా న ఖనంతి యస్య
చిత్తం న నిర్దహతి కోప కృశానుతాపః
కర్షంతి భూరి విషయాశ్చ న లోభ పాశైః
లోక త్రయం జయతి కృత్స్నమిదం స ధీరః...

అంటూ ధీరులైన వారి గుణాలను భర్తృహరి నీతిశతకంలో వర్ణించాడు. ఈ శ్లోకాన్ని...

మానవతీ కటాక్షశిత మార్గణముల్ విదలింప జాల వె
వ్వాని మనంబు కోపమయవహ్ని దహింపదు లోభపాశ సం
తానము మాల్యచందన వితానములన్ వెతసేయనోప కె
వ్వాని వశంబున మెలగు, వాడు జయించు జగంబులన్నియున్... అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.

భావం: లోకంలో అరిషడ్వర్గాలకు... అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు లోనుకానివారు అరుదుగా ఉంటారు. ఇవి మనిషి పతనానికి కారణమవుతాయి. వలపు చూపులకు లొంగిపోనివారు, కోపం అనే అగ్ని తమ మనసును దహించకుండా నిరోధించుకొనేవారు, చందనాలు, అత్తరులు తదితర సుగంధ ద్రవ్యాలకు, ఆడంబరమైన వస్త్రాలకు, సన్మాన సత్కారాలకు ప్రలోభపడనివారు, భోగభాగ్యాల మాయలో పడనివారు... వారే ధీరులు. వారు జగాలన్నిటినీ జయించగలరు.

తెలుసుకుందాం

మాయమైన మన విజ్ఞానం

భారతదేశం విజ్ఞాన ఖని. వేల సంవత్సరాల క్రితమే ఎందరో మహనీయులు నిత్య జీవితంలో మానవులకు ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు చేశారు. తాము సాధించిన జ్ఞానాన్ని, తెలుసుకున్న విషయాలను తరువాతి తరాలకు అందించడం కోసం... గ్రంథాలు రాశారు. అయితే విదేశీయుల దండయాత్రల్లాంటి సంఘటనల వల్లనో, భద్రపరచడంలో నిర్లక్ష్యం వల్లనో, ఇతర కారణాల వల్లనో అవి కాలగర్భంలో కలిసిపోయాయి. అటువంటి అపూర్వ గ్రంథాల్లో కొన్ని:

అక్షర లక్ష: ఇది వివిధ శాస్త్రీయ అంశాల సమాహారమైన... విజ్ఞాన సర్వస్వం లాంటి గ్రంథం. దీని రచయిత వాల్మీకి మహర్షి. దీనిలో రేఖాగణితం, బీజగణితం, త్రికోణమితి, భౌతిక శాస్త్రం తదితర 325 రకాల గణిత ప్రక్రియలు, ఖనిజ శాస్త్రం, జలయంత్ర శాస్త్రం, భూగర్భశాస్త్రం, ఉష్ణాన్ని కొలిచే పద్ధతులు ఇలా ఎన్నిటినో వివరించారు.

శబ్ద శాస్త్రం: సృష్టిలో ఉన్న అన్ని రకాల శబ్దాలు, ప్రతిధ్వనుల గురించి చర్చించిన ఈ గ్రంథ రచయిత ఖండిక ఋషి. కృత్రిమంగా శబ్దాలను సృష్టించడం, వాటి స్థాయి, వేగాలను కొలవడం లాంటి అంశాలు ఇందులోని అయిదు అధ్యాయాల్లో వివరించారు.

శిల్ప శాస్త్రం: రచయిత కశ్యప ముని. దీనిలో 22 అధ్యాయాలు ఉన్నాయి. 307 రకాల శిల్పాలు, 101 రకాల విగ్రహాల గురించి సంపూర్ణంగా చర్చించారు. అలాగే ఆలయాలు రాజభవనాలు, చావడులు తదితర నిర్మాణ విషయాలు వెయ్యికి పైగా ఉన్నాయి. ఇదే శాస్త్రంపై మయుడు, అలాగే విశ్వామిత్రుడు, మయుడు, మారుతి లాంటి ఋషులు చెప్పిన విషయాలను కూడా దీనిలో చర్చించారు.

సూప శాస్త్రం: ఇది వంటలకు సంబంధించిన శాస్త్రం. దీని రచయిత సురేశుడు. ఇందులో పిండివంటలు తీపి పదార్థాలు, ఊరగాయలు, 108 రకాల వ్యంజనాలు లాంటి అనేక వంటల గురించి, అప్పటికి ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 3,032 రకాల పదార్థాల తయారీ గురించి ఇందులో వివరంగా ఉంది.

మాలినీ శాస్త్రం: రచయిత ఋష్యశృంగ మహర్షి. దీనిలో ఉన్న 16 అధ్యాయాల్లో... పూల మాలలు, పూల గుత్తుల తయారీ, పూలతో రకరకాల శిరోజాలంకరణలు, రహస్య భాషలో పూరేకుల మీద ప్రేమ సందేశాలు పంపడం లాంటి వివరాలు ఉన్నాయి.

ధాతు శాస్త్రం: రచయిత అశ్వనీకుమార. మిశ్ర లోహాలు, కృత్రిమ లోహాలు, లోహాలను మార్చడం, రాగని బంగారంగా మార్చడం లాంటి విషయాలను ఏడు అధ్యాయాల్లో విపులంగా వివరించారు.



చిత్రకర్మ (చిత్రలేఖన) శాస్త్రం: 12 అధ్యాయాలున్న ఈ గ్రంథ రచయిత పేరు భీముడు. దీనిలో 200 కాల చిత్ర లేఖన ప్రక్రియల గురించి పేర్కొన్నారు. ఒక వ్యక్తి తల వెంట్రుకలు, గోళ్ళు, ఎముక లాంటివి చూసి... అతని బొమ్మను గీసే ప్రక్రియ కూడా ఉందులో ఉంది.

మల్ల శాస్త్రం: రచయిత పేరు మల్లుడు. వ్యాయామాలు, ఆటలు, ఉత్త చేతులతో చేసే 24 రకాల విద్యల గురించి ఈ గ్రంథంలో ఉంది.

రత్న పరీక్ష: వాత్సాయన ఋషి రాసిన ఈ గ్రంథంలో... రత్నాలకు ఉన్న 24 లక్షణాలు, వాటి శుద్ధతను పరీక్షించే 32 పద్ధతులు ఉన్నాయి. రత్నం తాలూకు రూపం, బరువు లాంటి అంశాల ఆధారంగా వాటిని వివరించడం గురించి చర్చించారు.

మహేంద్రజాల శాస్త్రం: సుబ్రహ్మణ్యస్వామి శిష్యుడైన వీరబాహువు దీని రచయిత. నీటిపై నడవడం, గాలిలో తేలడం లాంటి భ్రమలను కల్పించే గారడీలను ఇది నేర్పుతుంది.

అర్థ శాస్త్రం: రచయిత వ్యాసుడు. ఇందులో మూడు భాగాలున్నాయి. ధర్మబద్ధమైన 82 సంపాదనా మార్గాలను ఇందులో వివరించారు.

శక్తితంత్రం: రచయిత అగస్త్యముని. సూర్య చంద్రులు, ప్రకృతి, అగ్ని, గాలి తదితర 64 రకాల బాహ్య శక్తుల గురించి, వాటి ప్రత్యేకమైన వినియోగం గురించి దీనిలో వెల్లడించారు. అణు విచ్ఛేదన కూడా దీనిలో భాగమే.

సౌదామినీ కళ: రచయిత మతంగ ముని. నీడల ద్వారా, ఆలోచనల ద్వారా కంటికి కనపడే విషయాలను ఆకర్షించే విధానం, భూమి, పర్వతాల లోపలి భాగాల చిత్రాలను సంపాదించే ప్రక్రియ దీనిలో వివరించారు.

మేఘ శాస్త్రం: రచయిత అత్రి ముని. 12 రకాల మేఘాలు, 12 రకాల వర్షాలు, 64 రకాల మెరుపులు, 33 రకాల పిడుగుల గురించి, వాటి లక్షణాల గురించి దీనిలో పేర్కొన్నారు.

స్థాపత్య విద్య: ఇది అధర్వణ వేదంలోనిది. ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కట్టడాలు, నగర ప్రణాళిక తదితర నిర్మాణ సంబంధమైన సమస్త వివరాలు ఇందులో ఉన్నాయి.

వీటితో పాటు భగవాన్ కార్తికేయ విరచిత 'కాల శాస్త్రం', 'సాముద్రిక శాస్త్రం', అగ్నివర్మ రచించిన 'అశ్వ శాస్త్రం', కుమారస్వామి రచించిన 'గజ శాస్త్రం', భరద్వాజ ఋషి రచించిన 'యంత్ర శాస్త్రం', అలాగే ధనుర్వేదం, గాంధర్వ వేదం లాంటివి ఎన్నో గ్రంథాలు మాయమైపోయాయి.

చింతన

పరమాత్మ ఉనికే శ్వాస

శ్వాస అనేది దేహంలో జీవాత్మ రూపంలో ఉన్న పరమాత్మను సూచిస్తుంది. శ్వాస ఉంటేనే జీవుడు ఉంటాడు. జీవితం ఉంటుంది. శ్వాసతో మొదలై, శ్వాసతో అంతమయ్యేదే మానవ రూపంలో జీవుడి యాత్ర. జీవశక్తితో కూడిన ఆత్మనే 'జీవాత్మ' లేదా 'జీవుడు' అంటారు. బ్రహ్మ మనిషిని మట్టిబొమ్మగా సృష్టిస్తాడు. అందులో ఆత్మను, శ్వాసను నింపి, ఆయుష్షును నిర్ణయిస్తాడు. జీవుని ఆయువు ఎన్ని సంవత్సరాలు అనే లెక్కలో కాకుండా... ఎన్ని శ్వాసలు జీవిస్తాడు అనే లెక్కతో నిర్ణయమవుతుంది.

మనిషి నిమిషానికి సగటున 15 శ్వాసలు, 24 గంటలలో సుమారు 23 వేల శ్వాసలు ఖర్చు చేస్తూ... సృష్టి నియమానుసారం వంద నించి, నూట ఇరవై ఏళ్ళ ఆయుష్షును కలిగి ఉంటాడు. కోతి, కుక్క లాంటి జీవులు తమ శ్వాసలను అత్యంత త్వరిత గతిన ఖర్చు చేసుకొని... పది నించి పదిహేనేళ్ళు మాత్రమే బతుకుతున్నాయి. నిమిషానికి నాలుగు నుంచి ఆరు శ్వాసలు ఖర్చుచేసే రాకాసి తాబేళ్ళు 400 సంవత్సరాలు జీవిస్తున్నాయి. హిమాలయ యోగులు, ఋషులు యోగ సాధన ద్వారా శ్వాసను దీర్ఘ కాలం బిగబట్టి... సహస్రారం నుంచి ప్రవహించే నిరంతర ప్రాణశక్తి ధారను నాడీమండలంలో ప్రసరింపజేసుకుంటూ, జీవ చైతన్య శక్తితో దేహాన్ని నింపుకొని, ఆయుఃప్రమాణంలోని శ్వాసలను మిగుల్చుకుంటూ, ఆహారం లేకుండానే తపోదీక్షలో వందల ఏళ్ళు జీవించగలుగుతున్నారు.

పరిశీలించి చూస్తే... శ్వాస రెండు నాసికా రంధ్రాల నుంచి ఒకేసారి కాకుండా... ఎడమ, కుడి నాసికల నుంచి విడివిడిగా సమాన మాత్రలతో జరుగుతూ ఉంటుంది. ఎడమ నాసిక... శీతల లేదా చంద్రనాడి కాగా, కుడి నాసిక ఉష్ణ లేదా సూర్యనాడి. ఈ విధంగా శీతోష్ణ సమతుల్యం దేహంలో నెలకొంటుంది. కొన్ని నిర్దిష్ట ఘడియల కాలం (సుమారు రెండు నుంచి మూడు ఘడియల) తరువాత.. సూర్య, చంద్ర నాడుల మధ్యలో ఊపిరి మారేటప్పుడు... నాసాగ్రస్థానంలో... నాడీ సంధి స్థానంలో కొన్ని క్షణాలు నిలిచి ఉంటుంది. నాలుగు సంధ్యాకాలాలలో... అంటే ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం పన్నెండు గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు, రాత్రి పన్నెండు గంటల సమయంలో... శ్వాస నాసాగ్ర స్థానంలో... ఆజ్ఞాచక్రానికి దగ్గిరగా కొన్ని క్షణాలు ఎక్కువగా నిలిచి ఉంటుంది. కాబట్టి ధ్యానానికి ఈ సంధ్యా కాలాలు ఉత్తమమైనవి.

ఈ విధంగా ధ్యానం నాసాగ్ర నాడీ స్థానంలో కేంద్రీకృత మైనప్పుడు.. శ్వాసల సంఖ్య మెల్లమెల్లగా తగ్గుతాయి. మనోవృత్తులు నియంత్రితమవుతాయి. నిర్మల స్థితిలో, ఆనందమయమైన స్పందనలతో దేహంలో ఆరోగ్యకరమైన రసాయనాలు వ్యాపిస్తాయి. దీర్ఘ శ్వాసలు జరిగినప్పుడు... శ్వాసలు మిగలడం వల్ల ఆయుఃప్రమాణం పెరుగుతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. దేహం లోపలి కర్మదోషాలు ఉపశమిస్తాయి. ప్రారబ్ధ (పూర్వ), ఆగామి (రాబోయే) కర్మలు సంస్కారం పొందుతాయి. తద్వారా జీవన గతి.. సుగమం, శుభకరం అవుతుంది. ఆధ్యాత్మిక ప్రగతికి సోపానం అవుతుంది. శ్వాసకు, మనస్సుకు ప్రత్యక్ష సంబంధం ఉందనేది అందరికీ తెలిసిన విషయమే. శ్వాస నియంత్రణలో ఉంటే మనోవృత్తులు శాంతిస్తాయి. మనస్సు నియంత్రణలో, నిర్మలంగా ఉంటుంది. ఇంద్రియాలను నియంత్రిస్తూ, బాహ్యవస్తువు లేదా విషయం మీద ధ్యాసను లగ్నం చెయ్యడాన్ని 'ధ్యానం' అంటారు. ధ్యాన మార్గాన్ని అవలంబించినప్పుడు... ధ్యాసను కేంద్రీకరించవలసింది శ్వాస మీదే. ఎందుకంటే శ్వాసే పరమాత్మ తాలూకు ఉనికి. శ్వాసమీద ధ్యాస నిలిపినప్పుడు... శ్వాసను సాక్షిగా జీవాత్మ దర్శిస్తూ, దానితో కదులుతూ ఆజ్ఞా చక్రం దగ్గర కేంద్రీకృతమవుతుంది. పరమాత్మ తత్త్వాన్ని అనుభూతి చెందుతుంది. ఈ విధంగా అలవాటయ్యాక... క్రమేపీ అసంకల్పితంగా లేదా స్వల్ప ప్రయాసతో అది ఆజ్ఞాచక్రంలో కేంద్రీకృతమై ఉండడం మొదలవుతుంది. ఆ ధ్యానావస్థ పరిణతి చెందినప్పుడు... పంచభుజాలు కలిగిన, పంచవర్ణ కాంతితో కూడిన నక్షత్ర రూపం కనిపిస్తుంది. అదే సంధ్యోపాసన అని యోగులు పేర్కొన్నారు.



శ్వాసను నియంత్రించడం వల్ల ఆధ్యాత్మిక ప్రగతితోపాటు భౌతిక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ప్రతి ఉచ్ఛ్వాసలో ప్రాణవాయువును శ్వాస కోశాల ద్వారా... లక్షలాది కణాల్లో, వాటికి అనుసంధానంగా ఉన్న సూక్ష్మ రక్త నాళికలలో నిండుతుంది. వాటిలో చేరి ఉన్న కర్బన వాయు కణాలను గ్రహించి నిశ్వాస ద్వారా విసర్జిస్తుంది. సగటు వయస్కుడైన మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే... శరీరంలో ఉండే సుమారు అయిదున్నర లీటర్ల రక్తం నిమిషానికి కనీసం రెండుసార్లయినా ప్రాణవాయువుతో పరిశుద్ధమై, గుండె ద్వారా శరీరమంతా ప్రవహించాలని శాస్త్రీయ పరిశీలనలో తేలింది. ఆధునిక కాలమాన పరిస్థితుల్లో మానసికమైన, ఇతర ఒత్తిడుల వల్ల శ్వాస త్వరితగతిన జరిగినప్పుడు... రక్తశుద్ధి తగినంత మోతాదులో జరగదు. దీనివల్ల మెదడుకు, కండరాలకు కావలసిన ప్రాణవాయువు లోపించి, వివిధ రుగ్మతలకు కారణం అవుతోంది. ఆలోచనా శక్తి అస్తవ్యస్తమవుతోంది. ధారణాశక్తి, వివేకం లోపిస్తున్నాయి. ప్రాణాయామ, ధ్యాన ప్రక్రియల వల్ల శ్వాసలు నిర్దిష్టగతిలో.. దీర్ఘంగా,ప్రశాంతంగా జరుగుతాయి. వివిధ ప్రక్రియల ద్వారా నాడీ శుద్ధి, రక్త శుద్ధి ఎక్కువగా జరుగుతుంది. రక్తంలో ప్రాణవాయువు పరిమాణం, శరీరంలో ప్రాణశక్తి మోతాదు పెరుగుతాయి. ఆహ్లాదకరమైన మానసిక, దైహిక ఆరోగ్యం చేకూరుతుంది. ఆకర్షణీయమైన తేజస్సు కలుగుతుంది.



దేవరకొండ శ్రీకాంత్
9676000600

సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్ణ తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలసి చెక్కులు అందజేశారు.

ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'మునిముని నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడు గారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్ బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తిక్ హృద్యంగా ఆలపించారు.

అప్‌డేట్స్

దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.









బిజినెస్

సెన్సెక్స్ @ 83,000

ఆఖరి గంటలో కొనుగోళ్లతో సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

ఈక్విటీ మదుపరుల సంపద రూ.6.59 లక్షల కోట్లు జంప్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం రెండింటి వరకు స్వల్ప లాభాల్లో కొనసాగిన సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్లు పోటెత్తడంతో ఉవ్వెత్తున ఎగిశాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,593.03 పాయింట్లు (1.95 శాతం) ఎగబాకి 83,116.19 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. సూచీ 83,000 మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. అయితే, సూచీ చివర్లో 1,439.55 పాయింట్ల (1.77 శాతం) వృద్ధితో 82,962.71 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 514.9 పాయింట్లు (2 శాతం) పెరిగి 25,433.35 వద్ద కొత్త ఇంట్రాడే రికార్డును, చివర్లో 470.45 పాయింట్ల (1.89 శాతం) లాభంతో 25,388.90 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసింది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌తో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ సానుకూలంగా మారింది. దాంతో దేశీయంగానూ ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లకు పాల్పడ్డారు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం మన మార్కెట్‌కు మరింత కలిసివచ్చింది. ఆకస్మిక బుల్ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు పెరిగి రూ.467.36 లక్షల కోట్లు (5.57 లక్షల కోట్ల డాలర్లు) దాటింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ పాజిటివ్‌గా ముగిశాయి.

భారతీ ఎయిర్‌టెల్ షేరు 4.36 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకోగా.. అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, కోటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు 2 శాతానికి పైగా రాణించాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.79 శాతం లాభపడ్డాయి. అన్ని రంగాల సూచీలూ ఎగిశాయి. మెటల్ అత్యధికంగా 3.05 శాతం పుంజుకోగా.. టెలికాం, పవర్ రెండు శాతానికి పైగా రాణించాయి. ఆటో, యుటిలిటీస్, కమోడిటీస్ సూచీలు 1.99 శాతం వరకు పెరిగాయి.

ఇంట్రాడేలో 25,400 పైకి నిఫ్టీ



యెస్ బ్యాంక్‌లో 51% వాటా కోసం బిడ్డర్ల పట్టు

ప్రైవేట్ రంగానికి చెందిన యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయ ప్రక్రియ సందిగ్ధ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బ్యాంక్‌లో మెజారిటీ వాటా (51 శాతం) కోసం బిడ్డర్లు పట్టుబడుతున్నారు. కానీ, దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన యెస్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా విక్రయానికి అనుమతిచ్చేందుకు ఆర్‌బీఐ సుముఖంగా లేదని తెలిసింది. ఈ బ్యాంక్‌లో వాటా కొనుగోలుకు జపాన్‌కు చెందిన సుమిటొమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన ప్రముఖ బ్యాంక్‌ల్లో ఒకటైన ఎమిరేట్స్ ఎన్‌బీడీ పోటీపడుతున్నాయి. ఈ రెండూ విదేశీ సంస్థలు కావడమే ఆర్‌బీఐ విముఖతకు ప్రధాన కారణమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. దేశీయ బ్యాంక్‌లో విదేశీ సంస్థలు గరిష్ఠంగా 26 శాతం వరకు వాటా కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంది. అంతకు మించి వాటా కొనుగోలు చేసిన పక్షంలో, ఆర్‌బీఐ నిర్దేశిత గడువులోగా వాటాను మళ్లీ 26 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఆర్థికంగా దివాలా తీసిన యెస్ బ్యాంక్‌ను రక్షించేందుకు ఎస్‌బీఐ నేతృత్వ కన్సార్షియం 2020లో పెట్టుబడులు పెట్టింది. తద్వారా యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐకి 24 శాతం వాటా దక్కింది. ప్రస్తుతం బ్యాంక్‌లో ఎస్‌బీఐయే అతిపెద్ద వాటాదారు.

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు సెబీ ఝలక్

» డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాల జప్తు

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్), దాని ప్రమోటర్ సీ పార్థసారథికి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి ఝలక్ ఇచ్చింది. వీరికి చెందిన బ్యాంకు డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాలను జప్తు చేసింది. రూ.25 కోట్ల జరిమానా చెల్లించాలని గత నెల జారీ చేసిన ఆదేశాలను కేఎస్‌బీఎల్, పార్థసారథి పెడచెవిన పెట్టడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. కేఎస్‌బీఎల్ తన వద్ద డీమ్యాట్ ఖాతాలు ఉన్న ఖాతాదారుల నుంచి తీసుకున్న పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ)లను దుర్వినియోగం చేసి, వారి ఖాతాల్లోని షేర్లను బ్యాంకుల వద్ద తాకట్టు పెట్టి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించి, వాటిని తన అనుబంధ కంపెనీలకు మళ్లించింది. ఈ విషయం బయటికి పొక్కడంతో సెబీ రంగంలోకి దిగి కేఎస్‌బీఎల్‌ను, దాని ప్రమోటర్ పార్థసారథిని ఆరేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి బహిష్కరించింది. అంతటితో ఊరుకోకుండా కేఎస్‌బీఎల్, పార్థసారథిపై రూ.21 కోట్ల జరిమానా విధించింది. అయినా స్పందించక పోవడంతో దానిపై వడ్డీ, అపరాధ రుసుముతో కలిపి రూ.25 కోట్లు చెల్లించాలని గత నెలలో నోటీసులు జారీ చేసింది. దీనికి కూడా స్పందించక పోవడంతో ఇప్పుడు ఏకంగా కేఎస్‌బీఎల్, పార్థసారథి బ్యాంకు డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాల్లోని షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోల్లోని యూనిట్లను జప్తు చేసింది.

డెమో కార్లపైనా ఐటీసీ: సీబీఐసీ

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ డీలర్లకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) పెద్ద ఊరట ఇచ్చింది. కార్లు లేదా ఇతర ఆటోమొబైల్ వాహనాల అమ్మకాల ప్రోత్సాహం కోసం అధీకృత ఆటోమొబైల్ డీలర్లు వినియోగించే డెమో కార్లపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభిస్తుందని తెలిపింది. అయితే ఈ డెమో కార్లు, వాహనాలను డీలర్లు కచ్చితంగా డెమోల కోసం మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. డీలర్లు ఈ వాహనాలను సొంత అవసరాల కోసం ఉపయోగించినా, తమ ఉద్యోగుల రవాణా కోసం ఉపయోగించినా ఐటీసీ లభించదని తెలిపింది. డెమో కోసం షోరూమ్స్‌లో ఉంచే వాహనాలను ప్రత్యేకంగా పేర్కొనాలని కూడా సీబీఐసీ స్పష్టం చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	120
కరీంనగర్	107	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	118
విశాఖపట్నం	104	అనంతపురం	118
గోదావరి	118		

వాటర్ ట్యాంకుల తయారీ ప్లాంట్‌లో పూర్తిగా పవన విద్యుత్ వినియోగం



ఆర్‌సీ ప్లాస్టో

హైదరాబాద్: వాటర్ ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీ సంస్థ ఆర్ సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. పర్యావరణ పరిరక్షణ, సస్టెయినబిలిటీ కోసం కీలకమైన చర్యలు తీసుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని వాటర్ ట్యాంకుల తయారీ ప్లాంట్‌లో 100% పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. మహారాష్ట్రలోని నందర్బర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు పవన విద్యుత్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను పూర్తిగా ఈ ప్లాంట్‌కు ఉపయోగిస్తున్నట్లు ఆర్ సీ ప్లాస్టో పేర్కొంది. ఒక్కో పవన విద్యుదుత్పత్తి ప్లాంట్ సామర్థ్యం 2.1 మెగా వాట్లుగా ఉందని తెలిపింది. సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీకి మారటం ద్వారా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించి ప్లాస్టో.. ఇతర పరిశ్రమలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొంది.

హైదరాబాద్ టు బ్యాంకాక్ విమాన సర్వీసులు



ఎయిర్ ఏషియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎయిర్ ఏషియా థాయ్‌లాండ్.. భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి బ్యాంకాక్, చెన్నై నుంచి ఫుకెట్ నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు థాయ్ ఎయిర్ ఏషియా కమర్షియల్ హెడ్ తన్సిటా అక్రారిట్ పిరోమ్ వెల్లడించారు. అక్టోబరు 27వ తేదీ నుంచి హైదరాబాద్-బ్యాంకాక్ మార్గంలో వారానికి 4 సర్వీసులు, అదే నెల 30 నుంచి చెన్నై-ఫుకెట్ మార్గంలో వారానికి 3 సర్వీసులు నడపనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు ఒకవైపు ప్రయాణానికి టికెట్ ధరలు రూ.7,390, చెన్నై నుంచి ఫుకెట్‌కు టికెట్ ధరలు రూ.6,990 నుంచి ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ఈ నెల 22 వరకు ఈ టికెట్ ధరలు బుకింగ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 27-30 తేదీల నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చని ఆమె తెలిపారు.

అరుదైన లోహాల కోసం 'విదేశీ' బాట

ఈ ఏడాది రూ.2,200 కోట్ల పెట్టుబడి.. ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్ఎండీసీ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా విదేశాల్లో లిథియం, రాగి, నికెల్, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఒక లిథియం నిక్షేపాల బ్లాకును గుర్తించింది. లెగసీ ఇండియా ఐరన్ ఓర్ లిమిటెడ్ అనే అనుబంధ కంపెనీ ద్వారా ఎన్ఎండీసీ ఈ కార్యకలాపాలు చేపట్టనుంది. వచ్చే ఏడాది చివరికల్లా దేశంలో ఏటా 80 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కోకింగ్ కోల్ ఉత్పత్తి కూడా చేపట్టనుంది. ప్రస్తుతం 4.5 కోట్ల టన్నులుగా ఉన్న వార్షిక ఇనుప ఖనిజం ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికి 10 కోట్ల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2,200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణకు హాని కలగని రీతిలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరిస్తామని ముఖర్జీ చెప్పారు. ఈ పెట్టుబడితో బచేలి నుంచి నాగర్నార్ వరకు 135 కిలోమీటర్ల స్లర్రీ పైప్‌లైన్‌తో పాటు ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఆగస్టు ద్రవ్యోల్బణంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: కూరగాయలు, పప్పుల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగి 3.65 శాతానికి చేరింది. జూలైలో ఇది ఐదు సంవత్సరాల కనిష్ఠ స్థాయి 3.6 శాతానికి దిగివచ్చిన విషయం విదితమే. స్వల్పంగా పెరిగినప్పటికీ ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4 శాతం లోపే ఉంది. కాగా గత ఏడాది ఆగస్టులో ఇది 6.83 శాతం ఉంది. జాతీయ గణాంకాల శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఆగస్టు నెలలో కూరగాయల ధరలు 10.71 శాతం, పప్పుల ధరలు 13.6 శాతం పెరిగాయి. అయితే సుగంధ ద్రవ్యాలు (-4.4 శాతం), ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ (-0.86 శాతం) విభాగాల్లో ధరలు తగ్గాయి. కాగా స్థూలంగా ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 5.66 శాతం ఉంది.

హైదరాబాద్‌లో జెడ్ఎఫ్ లైఫ్‌టెక్ జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): కార్లలో సీట్ బెల్ట్, ఎయిర్ బ్యాగులు, ఇతర భద్రతా పరికరాలు తయారు చేసే జర్మనీకి చెందిన జెడ్ఎఫ్ లైఫ్ టెక్ తన కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ సెంటర్‌ను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్ఎఫ్ ఇక్కడ జీసీసీని ప్రారంభించడంతో తెలంగాణ ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందన్నారు. ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేళ్లలో ఈ సంఖ్య 500 దాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రూడాల్ఫ్ స్టార్క్, ఇండియా ఈడీ రవికుమార్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▼	67,050 ▼	91,400 ▼
ముంబై	71,801 ▼	65,770 ▼	83,188 ▼

అదానీ గ్రూప్ మనీలాండరింగ్!

స్విస్ బ్యాంకుల్లో రూ.2,602 కోట్లు

ఖాతాలను స్తంభింప చేసిన స్విస్ అధికారులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చింది. అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న ఒక సంస్థకు చెందిన ఆరు బ్యాంకు ఖాతాలను స్విట్జర్లాండ్ అధికారులు స్తంభింప చేసినట్టు తెలిపింది. గోథమ్ సిటీ అనే స్విట్జర్లాండ్ ఇన్వెస్టిగేటివ్ మీడియా వెబ్‌సైట్ దీనికి సంబంధించి ఒక కథనం ప్రచురించినట్టు తెలిపింది. ఈ ఖాతాల్లో అక్రమ నగదు లావాదేవీల ద్వారా సంపాదించిన 31 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,602.45 కోట్లు) నిధులు ఉన్నట్టు తెలిపింది. ఈ ఖాతాల్లోని నిధుల ద్వారా ఆ సంస్థ బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, మారిషస్ వంటి ట్యాక్స్ హెవెన్స్ నుంచి అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లను ఆపరేట్ చేస్తున్నట్టు హిండెన్‌బర్గ్ తెలిపింది. 2021 నుంచి జరుగుతున్న ఈ తంతుపై స్విస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొంది. గత ఏడాది జనవరిలోనూ హిండెన్‌బర్గ్ ఇవే ఆరోపణలు చేయడంతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. మళ్లీ గత నెల సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తన కన్సల్టెన్సీ సంస్థ ద్వారా అదానీ గ్రూప్ నుంచి ఇప్పటికీ ఆర్థిక లబ్ధి పొందుతున్నారని ఆరోపించింది. ఈ ఆరోపణలు సద్దుమణగక ముందే హిండెన్‌బర్గ్.. స్విట్జర్లాండ్ మీడియాను ఉటంకిస్తూ తాజా ఆరోపణలు చేయడం విశేషం.

● జికా వైరస్ బారి నుంచి కాపాడే వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా జికా వ్యాక్సిన్ అభివృద్ధి కోసం తాము జరిపే క్లినికల్ ట్రయల్స్ మొదటి దశ వ్యయాన్ని ఐసీఎంఆర్ భరించనుంది.

స్పోర్ట్స్



భారత జట్టు.. అదే జోరు

» నాలుగో మ్యాచ్‌లోనూ గెలుపు

» ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

హులున్‌బుయిర్ (చైనా) : ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు దూసుకుపోతోంది. వరుసగా నాలుగోపోరులోనూ విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 3-1తో కొరియాను ఓడించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (9, 43 నిమిషాలు) రెండు గోల్స్‌తో చెలరేగగా, అరైజీత్ సింగ్ హుండాల్ (8వ) ఒక గోల్ చేశాడు. జిహున్ యాంగ్ (30వ) కొరియాకు ఏకైక గోల్ అందించాడు. భారత్ ఇప్పటికే సెమీఫైనల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ఆరు జట్ల రౌండ్ రాబిన్ చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను శనివారంనాడు భారత్ ఢీకొననుంది. టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు క్వాలిఫై అవుతాయి. సెమీస్ సోమవారం, ఫైనల్ మంగళవారం జరుగుతాయి. కాగా **ఈ మ్యాచ్‌లో చేసిన తొలి గోల్ హర్మన్‌ప్రీత్ కెరీర్‌లో 200వది.** ప్రపంచ హాకీ చరిత్రలో ధ్యాన్‌చంద్ 570 గోల్స్‌తో టాప్‌లో ఉన్నాడు. భారత్ తరఫున బల్బీర్‌సింగ్ సీనియర్ 246 గోల్స్‌తో రెండో స్థానం, హర్మన్ (201) మూడోస్థానంలో ఉన్నారు.

పారా హీరోలకు మోదీ ఆతిథ్యం



పేరు పేరునా పలకరించిన ప్రధాని

న్యూఢిల్లీ: పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అభినందించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్లేయర్లతో మోదీ ముచ్చటించారు. క్రీడా మంత్రిత్వ శాఖ నెట్‌లో పోస్టు చేసిన 43 సెకన్ల వీడియోలో పతక విజేతలను కొనియాడిన మోదీ.. ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ కనిపించారు. ఇందులో కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య, భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర జఝారియా కూడా ఉన్నారు. 10 మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న అవనీ లేఖరా 'మీ మద్దతుకు ధన్యవాదాలు' అని రాసిన టీ-షర్ట్‌ను ప్రధానికి బహుమతిగా ఇచ్చింది. కాంస్యం సాధించిన జుడోకా కపిల్ పర్మార్ ప్రధానితో ప్రత్యేకంగా ఫొటో దిగాడు. అతడి పతకంపై మోదీ సంతకం చేస్తూ కనిపించారు. కాంస్యం సాధించిన **తెలుగమ్మాయి జీవాంజి దీప్తిని కూడా ప్రధాని పలకరించారు.** వరుసగా రెండో పసిడిని దక్కించుకొన్న జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మోదీతో సరదాగా మాట్లాడుతూ నవ్వులు పూయించాడు. ప్రతి అథ్లెట్ విజయగాథలను ఆయన అడిగి మరీ తెలుసుకొన్నారు. ఇటీవలే ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన భారత్ 7 స్వర్ణ, 9 రజత, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలు సాధించి, ఓవరాల్‌గా 18వ స్థానంలో నిలిచింది.



ప్రధానితో దీప్తి

అతని కోసం నేలపై...



ఈ కార్యక్రమంలో మరింత సరదా సంఘటన ఒకటి జరిగింది. పసిడి సాధించిన మరగుజ్జు జావెలిన్ త్రోయర్ నవ్‌దీప్ సింగ్.. మోదీకి క్యాప్‌ను బహూకరించాడు. అయితే, అతడు పొట్టివాడు కావడంతో.. టోపీ పెట్టించుకొనేందుకు మోదీ ఏకంగా నేలపై కూర్చున్నారు. 'ఇప్పుడు నువ్వు నా కంటే పొడుగ్గా ఉన్నట్టు అనిపిస్తోందా?' అని ప్రధాని సరదాగా అన్నారు. ఆ తర్వాత తను త్రో చేసే ఎడమ చేతిపై ఆటోగ్రాఫ్ ఇవ్వాలని మోదీని నవ్‌దీప్ కోరాడు.

వ్రితి, సంపత్ పతక మోత





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు వ్రితి అగర్వాల్, సంపత్ కుమార్ యాదవ్ పతకాల మోత మోగిస్తున్నారు. మంగళూరులో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి ఒక స్వర్ణం, రజతం నెగ్గడంతో ఆమె పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి 9 ని. 16.14 సెకన్లలో రేసును ముగించి స్వర్ణం సాధించగా, 200 మీ., బటర్‌ఫ్లయ్‌లో ఆమె 2 ని. 21.89 సెకన్లలో రేసు పూర్తి చేసి రజతంతో మెరిసింది. విజయవాడ స్విమ్మర్ సంపత్ ఈ పోటీల్లో రెండో కాంస్యాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో సంపత్ 16 నిమిషాల 26.48 సెకన్లలో రేసును పూర్తి చేసి తృతీయ స్థానంలో నిలిచాడు.

నాలుగో రోజూ వర్షార్పణం

» రద్దు దిశగా అఫ్ఘాన్-కివీస్ ఏకైక టెస్టు

నొయిడా: అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు మ్యాచ్ నాలుగో రోజూ ప్రారంభం కాలేదు. గురువారం ఉదయం కూడా వర్షం కురవడంతో అంపైర్లు ఆట రద్దుకే మొగ్గు చూపారు. సోమవారం నుంచి జరగాల్సిన ఈ మ్యాచ్ వరుణుడి ధాటికి టాస్ కూడా పడకపోవడం గమనార్హం. ఐదో రోజు శుక్రవారం కూడా వర్ష సూచన ఉండడంతో ఈ మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు టెస్టు చరిత్రలో కేవలం ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఒక్క బంతి కూడా పడకుండా ముగిశాయి. 1998లో చివరిసారి భారత్-న్యూజిలాండ్ టెస్టు ఇలాగే రద్దయ్యింది.

స్వీడన్‌కు పోటీనిచ్చేనా?

» డేవిస్ కప్ బరిలో భారత్ » రేపటినుంచి వరల్డ్ గ్రూప్ 1



రామ్‌కుమార్

స్టాక్‌హోమ్: టాప్ స్టార్లు లేకుండానే బరిలోకి దిగుతున్న భారత టెన్నిస్ జట్టు డేవిస్‌కప్‌లో స్వీడన్‌ను ఎదుర్కొనబోతోంది. ఈనెల 14,15 తేదీల్లో జరిగే వరల్డ్ గ్రూప్-1 పోటీలకు స్థానిక రాయల్ టెన్నిస్ హాల్ వేదిక కానుంది. సింగిల్స్, డబుల్స్ ఆటగాళ్లు సుమిత్ నగాల్, యుకీ భాంబ్రీ వ్యక్తిగత కారణాలతో వైదొలగడం జట్టు ఆటపై ప్రభావం పడనుంది. రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పూంచా, సిద్దార్థ్ విశ్వకర్మలకు మ్యాచ్‌లు సవాల్ కానున్నాయి. మరోవైపు డేవిస్‌కప్ చరిత్రలో ఐదుసార్లు స్వీడన్‌తో తలపడినా భారత్ ఇప్పటివరకు గెలువలేకపోయింది. టెన్నిస్ దిగ్గజం బోర్న్ బోర్గ్ కుమారుడు 20 ఏళ్ల లియో బోర్గ్ స్వీడన్ తరఫున బరిలోకి దిగుతున్నాడు.

షోరిఫుల్ స్థానంలో జాకర్

» టీమిండియాతో సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టు ఎంపిక

ఢాకా: భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో తలపడే బంగ్లాదేశ్ జట్టులో అన్‌క్యాప్డ్ వికెట్‌కీపర్ బ్యాటర్ జాకర్ అలీకి చోటు దక్కింది. గాయపడిన పేసర్ షోరిఫుల్ ఇస్లాం మినహా పాకిస్థాన్‌పై 2-0తో సిరీస్ నెగ్గిన జట్టునే యథాతథంగా ఎంపిక చేశారు. అయితే, పేసర్ స్థానంలో వికెట్ కీపర్ జాకర్‌కు చోటు కల్పించడం ఆశ్చర్యం కలిగించింది. నజ్ముల్ హొస్సేన్ షంటో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నెల 19 నుంచి చెన్నైలో తొలి టెస్ట్, 27 నుంచి కాన్పూర్‌లో రెండో టెస్ట్ జరుగుతాయి.

రెండో రౌండ్‌లోనూ విజయాలు

» చెస్ ఒలింపియాడ్




అర్జున్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్ రెండో రౌండ్‌లోనూ భారత పురుషులు, మహిళల జట్లు విజయాలు సాధించాయి. గురువారం జరిగిన ఈ రౌండ్లలో పురుషుల జట్టు 4-0తో ఐస్‌లాండ్‌ను చిత్తు చేయగా..మహిళలు 3.5-0.5తో చెక్ రిపబ్లిక్‌ను ఓడించారు. అర్జున్ ఇరిగేసి-స్టెఫాన్స్‌పై, హరికృష్ణ-గ్రేటర్‌సన్‌పై, గుకేష్-వాట్నర్‌పై, విదిత్ గుజ్‌రాతి-హిల్మిర్‌పై విజయాలు సాధించారు. ఇక మహిళల్లో..హారిక-జూలియాపై నెగ్గింది. దివ్యా దేశ్‌ముఖ్- నటాలీపై, వంతిక అగర్వాల్-టెరెజాపై గెలుపొందగా, తానియా సచ్‌దేవ్-మార్టినా గేమ్ డ్రాగా ముగిసింది. రెండో రౌండ్ అనంతరం ఇరుజట్లూ నాలుగేసి పాయింట్లతో కొనసాగుతున్నాయి.

బరిలో నీరజ్, అవినాష్

● నేటినుంచే డైమండ్ లీగ్ ఫైనల్





బ్రస్సెల్స్: సీజన్‌ను గ్రాండ్‌గా ముగించాలని స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పట్టుదలతో ఉండగా.. ఒలింపిక్స్‌లో పేలవ ప్రదర్శన నుంచి బయటపడాలని స్టీపుల్ చేజర్ అవినాష్ సబ్లే భావిస్తున్నాడు. బెల్జియం రాజధానిలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు సాగే డైమండ్ లీగ్ ఫైనల్లో ఇద్దరు భారత ఆటగాళ్లు తొలిసారి పాల్గొంటుండడం సరికొత్త రికార్డు. 32 విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. వరల్డ్ రికార్డు పోల్‌వాల్టర్ డుప్లాంటిస్, అమెరికా స్ప్రింట్ క్వీన్ షకారి రిచర్డ్‌సన్, హర్డిల్స్ స్టార్ మెక్‌లానిల్ రివరోవ్ తదితరులు పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా మారారు. 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో సబ్లే తొలిసారి డైమండ్ లీగ్ ఫైనల్లో బరిలోకి దిగుతున్నాడు. శుక్రవారం రాత్రి సబ్లే ఈవెంట్ జరగనుండగా.. ఆ తర్వాతి రోజు చోప్రా జావెలిన్ పోటీలు నిర్వహించనున్నారు.

ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ ఓటమి

● సిక్కి-సుమిత్ జంట నిష్క్రమణ

హాంకాంగ్: తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ హాంకాంగ్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌లో నిష్క్రమించింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్ పోరులో గాయత్రి-ట్రీసా ద్వయం 11-21, 20-22తో లియు షెంగ్-టాన్ నింగ్ (చైనా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.. డబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో సిక్కి-సుమిత్ రెడ్డి జంట 11-21, 20-22తో గోహ్ సూన్-లై షీవేన్ జిమీ (మలేసియా) చేతిలో ఓడి, ఇంటిముఖం పట్టింది. కాగా వియత్నాం సూపర్ 100 టోర్నీ సింగిల్స్‌లో తరుణ్ మన్నెపల్లి 21-7, 23-21తో జోయకిమ్ (ఫిన్లాండ్)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు.

ఇషాన్ కిషన్ శతకం

◆ ఇండియా 'సి' 357/5 ◆ దులీప్ ట్రోఫీ



ఇషాన్ (111)

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : దులీప్ ట్రోఫీలో భాగంగా గురువారం రెండో రౌండ్ మ్యాచ్‌లు ఆరంభమయ్యాయి. స్థానిక రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)కి చెందిన రెండు స్టేడియాల్లో నాలుగు జట్లు బరిలోకి దిగాయి. మరోవైపు జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ (111) ఇండియా 'సి' తరఫున శతకంతో ఆకట్టుకున్నాడు. అలాగే బాబా ఇంద్రజిత్ (78)తో కలిసి మూడో వికెట్‌కు 189 పరుగులను అందించాడు. దీంతో ఇండియా 'బి'తో మొదలైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా 'సి' 79 ఓవర్లలో 5 వికెట్లకు 357 పరుగులు సాధించింది. మిగతా బ్యాటర్లలో రజత్ పటీదార్ (40), సాయి సుదర్శన్ (43) ఆకట్టుకోగా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (46 బ్యాటింగ్), సుతార్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. పేసర్ ముకేశ్ కుమార్‌కు మూడు వికెట్లు దక్కాయి.

ఇండియా 'ఏ' 288/8

ఇండియా 'డి' బౌలర్లు సమష్టిగా రాణించడంతో ఇండియా 'ఏ' బ్యాటింగ్‌లో తడబడింది. అయితే 144/6 స్కోరుతో ఇబ్బందిపడిన వేళ ఏడో నెంబర్ బ్యాటర్ షామ్స్ ములాని (88 బ్యాటింగ్), తనుష్ కోటియన్ (53) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. దీంతో తొలి రోజు ముగిసే సమయానికి ఇండియా 'ఏ' 82 ఓవర్లలో 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (37) ఫర్వాలేదనిపించాడు. పేసర్లు విద్వత్ కావేరప్ప, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపీ మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు
ఫోన్ మాట్లాడడంపై నిషేధం

» ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్న విద్యాశాఖ

» సర్క్యులర్ జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో సెల్‌ఫోన్ మాట్లాడే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు గురువారం సర్క్యులర్‌ను జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమలు పరచాలని ఆదేశించారు. తరగతి గదుల్లో కొందరు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడుతున్నట్టు సమాచారం ఉందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. దీనిని నివారించడం కోసం సర్క్యులర్‌ను జారీ చేసినట్లు చెప్పారు. దీని ప్రకారం ఇక నుంచి తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడడం నిషేధం. సీసీఏ మార్గదర్శకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నట్టు అధికారులు తమ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

డీఎస్సీ దరఖాస్తుల్లో...
టెట్ ఆప్షన్‌కు రేపటి వరకు అవకాశం

» సాంకేతిక సమస్య తలెత్తడంతో నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ దరఖాస్తుల్లో టెట్ వివరాలను పొందుపరచడానికి ఉద్దేశించిన ఎడిట్ ఆప్షన్‌కు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో గురువారం వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. దాంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. సమస్యను గుర్తించిన అధికారులు ఎడిట్ ఆప్షన్ గడువును ఈ నెల 14 వరకు పొడిగించాలని నిర్ణయించారు. గురువారం అర్ధరాత్రి నుంచి వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందని అధికారులు ప్రకటించారు. డీఎస్సీ దరఖాస్తుల్లో అభ్యర్థుల టెట్ వివరాలు సరిగ్గా లేవని అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. దాంతో టెట్ మార్కుల వెయిటేజిని డీఎస్సీలో కలుపడానికి అడ్డంకిగా మారింది. ఈ కారణంగా డీఎస్సీ ఫలితాల వెల్లడిని కూడా ఆపేశారు. ఈ సమస్యకు పరిష్కారంగా, అభ్యర్థులు తమ టెట్ వివరాలను మరోసారి డీఎస్సీ దరఖాస్తుల్లో పొందుపరచడం కోసం 12, 13 తేదీల్లో ఎడిట్ ఆప్షన్ అవకాశాన్ని కల్పించగా గురువారం వెబ్‌సైట్‌లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి.

17 నుంచి లాసెట్ రెండవ దశ కౌన్సెలింగ్

ఈ నెల 17 నుంచి లాసెట్ రెండవ దశ కౌన్సెలింగ్‌ను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం... అభ్యర్థులు 17 నుంచి 21 తేదీల మధ్య రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాల్సి ఉంటుంది. 23, 24వ తేదీల్లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 30న సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు వచ్చే నెల 4లోపు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. కాగా, దోస్త్ ప్రత్యేక దశ కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం 12,756 మంది అభ్యర్థులకు డిగ్రీ సీట్లను కేటాయించారు. వీరంతా 16లోపు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది.

పంచాయతీల విలీనం
ఆర్డినెన్స్‌పై 'స్టే' కు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలు పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌పై స్టే విధించడానికి హైకోర్టు కోర్టు నిరాకరించింది. శంషాబాద్ మండల పరిధిలోని ఘన్సిమియాగూడ గ్రామపంచాయతీని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ టి. సిద్ధయ్య తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా విలీనం చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేస్తే వచ్చిన ఇబ్బంది ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, సౌకర్యాలు పెరుగుతాయని, ప్రజల జీవితాలు, జీవనశైలి మెరుగుపడతాయని పేర్కొంది. ప్రజల ప్రయోజనం కంటే వ్యక్తిగత ప్రయోజనం కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది. ఆర్డినెన్స్‌పై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, ఇతరులకు నోటీసులు జారీచేస్తూ విచారణను ఈనెల 26కు వాయిదా వేసింది.

చట్టప్రకారం మోడల్ స్కూల్
టీచర్ల బదిలీలు చేపట్టండి: హైకోర్టు


హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్ల బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు తుది సీనియారిటీ జాబితా రూపొందించాలని, అర్హత పాయింట్లను కేటాయించాలని స్పష్టం చేసింది. గతేడాది జూలై 3న పాఠశాల విద్యా శాఖ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలు 2018లో ప్రభుత్వం ఇచ్చిన జీవో 81కు విరుద్ధంగా ఉన్నాయంటూ జనగాం జిల్లా ఘన్‌పూర్ మోడల్ స్కూల్‌కు చెందిన 15 మంది ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ మార్గదర్శకాల మేరకు బదిలీలు చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్, మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ చైర్మన్ జీఎస్‌పి. వీరారెడ్డి, ఎండీ శేఖర్ రెడ్డి

విజయవాడ వరద బాధితులకు జీవీపీఆర్ ఇంజనీర్స్ రూ. కోటి విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ రూ. కోటి విరాళాన్ని అందించింది. సంస్థ చైర్మన్ జీఎస్‌పి. వీరారెడ్డి, ఎండీ శేఖర్ రెడ్డి గురువారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని హైదరాబాద్‌లో కలిసి ఈ విరాళాన్ని అందజేశారు. వరద బాధితులకు భారీ విరాళం అందించినందుకు వారిని చంద్రబాబు అభినందించారు.



ఏపీ సీఎం సహాయనిధికి
ఏఎంఆర్ గ్రూప్ రూ. కోటి విరాళం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితుల సహాయార్థం ఏఎంఆర్ గ్రూప్ చైర్మన్ ఏ మహేశ్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళం ఇచ్చారు. గురువారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మహేశ్ రెడ్డి కలిసి రూ.కోటి చెక్కును అందజేశారు.

రచ్చ.. రచ్చ!



కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెస్‌లో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి" అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్‌లో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు.

గేటును విరగ్గొట్టి.. తలుపులు నెట్టి..

తన ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తానని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంపై గురువారం ఉదయం అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. తన ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని మీడియాతో మాట్లాడారు. రాయలేని పదజాలంతో కౌశిక్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "నేను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించారు. కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. 11 గంటలకు నా ఇంటికి వచ్చి జెండా ఎగుర వేస్తానన్నాడు. రాకపోతే 12 గంటలకు నేనే నీ ఇంటికి వస్తా. పార్టీలో చేరి భ్రష్టు పట్టించింది కాక పాత ముఖ్యమంత్రిని నాశనం చేశావు. కాంగ్రెస్ నుంచి కొంతమందిని తీసుకొచ్చి బీఆర్‌ఎస్‌లో జాయిన్ చేస్తానని చెప్పావు. ఓ దుర్మార్గుడు నా ఇంటిపై జెండా ఎగరవేస్తానని అంటే ఊరుకుంటానా!? నా ఇంటిపై జెండా ఎగుర వేస్తానంటే ఎగుర వేయించుకునేందుకు సిద్ధంగా లేము. చేతులు కట్టుకుని కూర్చోలేదు. నువ్వో.. నేనో తేల్చుకుందాం.. ధైర్యం ఉంటే రా..! లేకపోతే నేనే వస్తా" అని సవాల్ విసిరారు. ఇది బీఆర్‌ఎస్‌కు, తనకు మధ్య యుద్ధం కాదని, కౌశిక్‌కు తనకు మధ్యనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తనను గెలిపించకపోతే చనిపోతానని బ్లాక్ మెయిల్ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కే తాను సమాధానం చెబుతానని, కౌశిక్ వంటి ఇజ్జత్ లేని వాళ్లకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పది నిమిషాల్లో రాకపోతే తానే కౌశిక్ ఇంటికి వెళతానని అన్నారు. అన్నట్లుగానే మధ్యాహ్నం 12 గంటలకు 20 వాహనాల కాన్వాయ్‌లో తన అనుచరులతో కొండాపూర్‌లోని కొల్లా విల్లాస్‌లో ఉంటున్న కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లారు. దీంతో, కౌశిక్ ఇంటి వద్ద భద్రతను మరింత పెంచారు. మధ్యాహ్నం 12.30 గంటలలోపు కౌశిక్ రెడ్డి ఇంటికి గాంధీ, ఆయన అనుచరులు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. కొంతమంది గేటును విరగ్గొట్టి, ప్రవేశ ద్వారానికి చెందిన తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. విల్లాస్ బయట ఉన్న పెద్ద గేటును బద్దలు కొట్టి గాంధీ అనుచరులు లోపలికి వెళ్లారు. కానీ, వారు కౌశిక్ రెడ్డి దగ్గరకు వెళ్లనీయకుండా పోలీసులు కట్టడి చేశారు. అదే సమయంలో కౌశిక్, ఆయన అనుచరులపై గాంధీ అనుచరులు కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారు. కొంతమంది రాళ్లతో ఆయన ఇంటి కిటికీ అద్దాలు, పూల కుండీలు పగులకొట్టారు. దీనికి ప్రతిగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై చెప్పులు విసిరారు. సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు గాంధీని అరెస్ట్ చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కుతీసుకెళ్లారు. ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

నీ కాలనీకొచ్చా.. నీ ఇంటికొచ్చా..: అరికెపూడి గాంధీ

కౌశిక్ రెడ్డి గేటెడ్ కమ్యూనిటీలోకి వెళుతున్నప్పుడు మధ్యలో ఎమ్మెల్యే గాంధీని పోలీసులు అడ్డుకున్నారు. ఆయన అక్కడే బైఠాయించి కౌశిక్‌పై మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. తన ఇంటికి వస్తానని చాలెంజ్ చేసిన కౌశిక్ రెడ్డి రాలేకపోయాడని, తానే ఆయన ఇంటికి వచ్చానని చెప్పారు. "దమ్ము, ధైర్యం ఉంటే బయటకు రా. నీ ఇంటికి వచ్చా- నీ కాలనీకి వచ్చా" అని మరోసారి సవాల్ విసిరారు. పోలీసులు అరెస్ట్ చేసిన తర్వాత కూడా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లోకి వచ్చినప్పటి నుంచీ కౌశిక్ రెడ్డి తీరు సరిగా లేదని, ఆయన తీరు వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందని విమర్శించారు. ఆయన పెద్ద కోవర్టు అని.. పార్టీలో జరిగిన అంతర్గత చర్చలను బాత్ రూమ్‌కు వెళ్లి వేరే వారికి చెప్పేవాడని ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్రా అంటూ మళ్లీ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నాడని ధ్వజమెత్తారు. విద్వేషాలు సృష్టిస్తున్న అతడిని తక్షణమే సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి భార్య స్వయంగా విల్లాపై నుంచి తమపై పూల కుండీలు తదితరాలను విసిరారని ఆరోపించారు. కౌశిక్ పిలిస్తేనే తాను వెళ్లానని, అక్కడ తమను 30 మంది అతని అనుచరులు అడ్డుకున్నారని, రాళ్ల దాడి చేశారని ఆరోపించారు.

కౌశిక్ వర్సెస్ పోలీసులు

కౌశిక్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు వెళ్లారు. తన ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ కౌశిక్ రెడ్డి సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బెడ్‌రూం కిటికీ బద్దలు కొట్టి తనపై దాడికి యత్నం చేశారని ఆరోపించారు. దాడికి యత్నించిన గాంధీ, ఆయన అనుచరులపై హత్యాయత్నం, దోపిడీ వంటి కేసులు నమోదు చేయాలని కోరారు. ఆ సమయంలో ప్రేక్షక పాత్ర పోషించిన మాదాపూర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో, కౌశిక్ రెడ్డి, పోలీసుల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అడ్డుకోబోయిన పోలీసుల పైకి వేలెత్తి చూపిన కౌశిక్ రెడ్డి.. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. వెంటనే కలగజేసుకున్న హరీశ్ రావు.. ఆయనను సముదాయించి పక్కకు పంపించారు. అనంతరం ఆయన పోలీసులతో మాట్లాడారు. గాంధీ అనుచరులపై హత్యాయత్నం కేసు పెట్టాలని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే బైఠాయించారు. దాంతో, తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ కేసు నమోదు చేసిన పోలీసులు హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివేకానందతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

అర్ధరాత్రి హరీశ్ బైఠాయింపు

అరెస్ట్ చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరలింపు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. దాదాపు మూడు గంటల పాటు రంగారెడ్డి జిల్లాలో హైడ్రామా నడిచింది. వారిని తొలుత నాటకీయ పరిణామాల మధ్య తలకొండపల్లికి.. అక్కడి నుంచి కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను ఇంత దూరం ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలంటూ హరీశ్ తదితరులు పోలీసు స్టేషన్లోనే బైఠాయించారు. వివాదానికి కారకుడైన గాంధీపై కేసు పెట్టి అరెస్ట్ చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. కాగా, తోపులాటలో హరీశ్ భుజానికి గాయమైంది. ఆయన చెయ్యి నొప్పితో బాధపడుతున్నట్లు కనిపించింది. చివరకు, డీజీపీ హామీతో హరీశ్ ఆందోళన విరమించారు. కేశంపేట పోలీసు స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత హరీశ్ విలేకరులతో మాట్లాడుతూ.. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన వారిపై 307 కింద క్రిమినల్ కేసు పెడతామని డీజీపీ హామీ ఇచ్చారని, బేషరతుగా ఇంటికి వెళ్లాలని చెప్పారని, అందుకే ఆందోళన విరమించామని చెప్పారు. మరోవైపు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ స్పీకర్ మధుసూదనాచారిలను మరో వాహనంలో తలకొండపల్లికి తీసుకొచ్చారు. అక్కడ భారీగా మోహరించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో 20 నిమిషాల అనంతరం తలకొండపల్లి నుంచి వారిని నగరం వైపు తీసుకెళ్లారు. బీఆర్‌ఎస్ శ్రేణులు అడుగడుగునా అడ్డుకోవడంతో అర్ధరాత్రి కేశంపేట, తలకొండపల్లిల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. షాద్‌నగర్ బైపాస్ మీదుగా కేశంపేట్ తరలిస్తుండగా ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు హరీశ్ ఉన్న పోలీస్ వాహనాన్ని అడ్డుకొని ఆందోళన చేశారు. రోడ్డుకు అడ్డుగా జేసీబీ పెట్టి పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. వాహనం అద్దాలను పగులగొట్టారు.

గాంధీ, అనుచరులపై కేసు నమోదు

కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి కేసులో గచ్చిబౌలి పోలీసులు ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిలో గాంధీని ఎ-1గా పేర్కొన్నారు. గాంధీతోపాటు కార్పొరేటర్లు, కార్యకర్తలు 30 మందిపై కౌశిక్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 1392/2024 నమోదు చేశారు. 189, 191(2), 191(3). 61, 132, 329, 111, 324(4), 324(5), 351(2), ఆర్-డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎ2గా మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, ఎ3గా బి.గౌతంగౌడ్, ఎ4 రాంపల్లి వెంకటేష్, ఎ5 జి.రాములు, ఎ6 నరేష్, ఎ7 శివ, ఎ8 రాధిక, ఎ9 మంజుల, ఎ10 చంద్రికగౌడ్, ఎ11 కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎ12 బి.వెంకటేష్ గౌడ్, ఎ13 అష్రఫ్, ఎ14 రఘునాథ్‌రెడ్డి, ఎ15 మోహన్ గౌడ్‌తోపాటు పలు వీడియోలు పరిశీలించి దాడిలో పాల్గొన్న పలువురిని గుర్తించి 30 మందిపై కేసు నమోదు చేశారు..

కౌశిక్‌రెడ్డి ఫొటోలను తగులబెట్టిన కాంగ్రెస్ నేతలు



హుజూరాబాద్/బంజారాహిల్స్: అరికెపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి మధ్య వివాదం.. తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. కౌశిక్‌రెడ్డి వాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ మహిళా నాయకులు తెలంగాణ భవన్ వద్దకు చేరుకొని ఆయన ఫొటోలను దహనం చేశారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. తోపులాట జరిగింది. కౌశిక్‌రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని టీపీసీసీ మహిళా విభాగం నాయకురాలు కాల్వ సుజాత డిమాండ్ చేశారు. కాగా, కౌశిక్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లపైకి రాకుండా ఇళ్లకే పరిమితం చేశారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ చౌరస్తా వద్దకు వచ్చేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ కార్యాలయం వద్దనే వారిని పోలీసులు అడ్డుకున్నారు.

బతకడానికొచ్చిన ఆంధ్రోళ్లు: కౌశిక్‌రెడ్డి

తన ఇంటిపై గాంధీ అనుచరులు దాడి చేయడంతో ఆంధ్ర, తెలంగాణ అంశాన్ని కౌశిక్ రెడ్డి తెరపైకి తెచ్చారు. బతకడానికి వచ్చిన ఆంధ్రోళ్ల తెలంగాణ బిడ్డలపై దాడి చేస్తే ఊరుకునేది లేదని, తెలంగాణ పౌరుషం ఏమిటో శుక్రవారం చూపిస్తామని హెచ్చరించారు. నాలుగేళ్ల తర్వాత కేసీఆర్ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు నీ భరతం పడతానని, సినిమా చూపిస్తానని గాంధీని హెచ్చరించారు. కాగా, కౌశిక్ రెడ్డి హెచ్చరికల నేపథ్యంలో గాంధీ ఇంటి వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పోలీసుల వైఫల్యం వల్లే దాడి: హరీశ్‌రావు



హరీశ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పోలీసుల వైఫల్యం వల్లే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. గాంధీ, ఆయన అనుచరులు కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేశారన్న వార్తలు తెలుసుకుని పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నివాసానికి చేరుకున్నారు. అక్కడ, సీపీ ఆఫీసు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మీరు ఒకటి చేస్తే తాము రెండు చేయగలమని హెచ్చరించారు. పైలట్, ఎస్కార్ట్ ఇచ్చి మరీ గాంధీని కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడికి పంపారని, ఈ చర్యను ఖండిస్తున్నామని అన్నారు. తమ ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడమే కాకుండా... వారిని ఉసిగొల్పి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కౌశిక్ రెడ్డికి సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. "హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినవద్దని కోరుకుంటున్నాం. గతంలో తెలంగాణ పోలీసులు దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నారు. రేవంత్ ప్రభుత్వం పోలీసులను వారి పని వారిని చేసుకోనివ్వడం లేదు. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన గాంధీ, ఆయన అనుచరులపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలి. లేదంటే సీబీఐ విచారణ కోరతాం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం.. కేంద్ర హోం శాఖ వద్దకు వెళ్తాం" అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి డైరెక్షన్లో పోలీసుల ఆధ్వర్యంలో దాడి జరిగిందని, పాత్రధారులు, సూత్రధారులను తేల్చేందుకు విచారణ చేపట్టాలన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, సైబరాబాద్ పరిధిలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని చెప్పారు. "రేవంత్.. నిన్ను హెచ్చరిస్తున్నా.. దాడి చేసిన గూండాలను అరెస్ట్ చెయ్.. వారికి సహకరించిన పోలీసులపై యాక్షన్ తీసుకో.. లేకపోతే ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ముందు, ఏఐసీసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం"అని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలను ఎలా కొంటున్నారో దేశం మొత్తం తెలిసేలా చేస్తామన్నారు. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేకపోవడంతోనే 2018లో ప్రతిపక్ష హోదా ఉన్న ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కి పీఏసీ చైర్మన్ ఇచ్చామని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్‌ను అడగకుండా, ఎన్నిక లేకుండా నియమించడం దుర్మార్గమన్నారు. "పార్లమెంట్‌లో కేసీ వేణుగోపాల్‌ని పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకున్నప్పుడు రాహుల్‌ను అడిగి చేయలేదా!? అదే పద్ధతిలో ఇక్కడా ప్రతిపక్ష నాయకుడిని అడగాలి కదా!" అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ సమాజంపై దాడి చేస్తే ఊరుకోబోమని, రేవంత్ రెడ్డి భయపెడితే భయపడమని అన్నారు.



తొడ కొట్టి సవాల్ చేస్తున్న కౌశిక్‌రెడ్డి

నేడు వందలాదిమందితో గాంధీ ఇంటి ముట్టడి: కౌశిక్

చర్యకు తప్పకుండా ప్రతి చర్య ఉంటుందని, శుక్రవారం ఉదయం 11 గంటలకు వందలాది మందితో గాంధీ ఇంటిని ముట్టడించి తీరతామని, తెలంగాణ పౌరుషాన్ని చూపిస్తామని కౌశిక్ రెడ్డి ప్రకటించారు. "గాంధీని సాదరంగా ఆహ్వానించి, ఇంట్లోకి తీసుకెళ్లి భోజనం పెడదామని భావించాను. ఆయన రౌడీ షీటర్లతో దాడికి పాల్పడ్డాడు. నన్ను హత్య చేయాలని చూశారు. అయినా, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. అసలు తెలంగాణలో శాంతి భద్రతలు ఉన్నాయా లేవా!?" అని ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యేకే రక్షణ ఇవ్వకుంటే.. ఇక సాధారణ ప్రజలకు ఏం ఇస్తారని నిలదీశారు. గాంధీపై పరుష పదజాలంతో దూషించారు. ఆయన టీడీపీని మోసం చేసి బీఆర్‌ఎస్‌లో.. ఆ పార్టీని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని, ఇప్పుడు పీఏసీ చైర్మన్ కాగానే బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గాంధీ చరిత్ర నీచమైనదని విమర్శించారు. "గాంధీగారూ.. నేను వయసులో ఉన్నా. యువకుడిని.. నేను రెచ్చిపోతే ఎలా ఉంటుందో చూస్కో.. నాకు 39, నీకు 65.. లేదు.. తన్నుకుందాం అంటే ఐయామ్ రెడీ! దమ్ముంటే చూసుకుందాం రా" అని సవాల్ విసిరారు. కోట్లకు అమ్ముడుపోయారని, భూ సెటిల్‌మెంట్ల కోసమే కాంగ్రెస్ గూటికి వెళ్లారని ఆరోపించారు. ధైర్యముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలవాలని, ఎవరి సత్తా ఏమిటో తెలిసిపోతుందని సవాల్ చేశారు. "శుక్రవారం ఉదయం శంభీపూర్ రాజు ఇంటి నుంచి గ్రేటర్‌లోని ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో గాంధీ ఇంటికి వెళ్తాం. బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని ఆయన అంటున్నందుకే వెళుతున్నాం. అక్కడే బ్రేక్‌ఫాస్ట్.. లంచ్ చేస్తాం.. అక్కడి నుంచి గాంధీని తెలంగాణ భవన్‌కు, కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్తాం" అని వివరించారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేకు రక్షణ ఉండదా?:కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నం చేశారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమైనట్లు? ఇందిరమ్మ రాజ్యంలో ఎమ్మెల్యేకు రక్షణ ఉండదా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. పోలీసుల సాయంతో అరికెపూడి గాంధీతో పాటు మరికొందరు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇది సీఎం రేవంత్‌రెడ్డి చేయించిన దాడేనని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తానన్న కౌశిక్‌రెడ్డిని గృహనిర్బంధంలో ఉంచిన పోలీసులు.. గాంధీని మాత్రం కౌశిక్‌రెడ్డి ఇంటి వద్దకు ఎలా అనుమతించారని నిలదీశారు. కాంగ్రెస్ అరాచకాలను కచ్చితంగా రాసి పెట్టుకుంటామని, తాము అధికారంలోకి ఆ పార్టీ నేతలు ఇంతకుమించిన ప్రతిఘటన ఎదుర్కొంటారని హెచ్చరించారు.

సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే యత్నం: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఆంధ్రా సెటిలర్లు బతకడానికి వచ్చారంటూ అవమానించేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రా సెటిలర్లే బీఆర్‌ఎస్ పరువు కాపాడారని, కానీ.. వారి విషయంలో ఆ పార్టీ నిజస్వరూపమేంటో నేడు బయటపడిందన్నారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను కేసీఆర్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. లేదంటే తక్షణమే ఆయనను బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. గాంధీ పదేళ్లుగా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని, ఆయన ఆంధ్రా వ్యక్తి అని అప్పుడు తెలియదా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. తెలంగాణ అంతా కలిసి ఉండాలని బీఆర్‌ఎస్ భావిస్తే కౌశిక్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు.



అక్బరుద్దీన్ ఒవైసీకి పీఏసీ చైర్మన్ ఎలా ఇచ్చారు?: ఎమ్మెల్యే దానం

నార్సింగ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అక్బరుద్దీన్ ఒవైసీకి పీఏసీ చైర్మన్ ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని మట్టుబెట్టాలని కేసీఆర్ ప్రయత్నించారని, ఇప్పుడు అదే కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. పీఏసీ చైర్మన్ ఎంపిక విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ పనికిరాని రాజకీయాలు మానుకోవాలని, లేదంటే తమ తడాకా చూపుతామని హెచ్చరించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కౌశిక్ రెడ్డి హుందాగా ప్రవర్తించే నాయకుడిగా ఉండాలని, చాలెంజ్ చేస్తూ వెళితే హైదరాబాద్‌లో ఉండలేవన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీని గురువారం ముందస్తు అరెస్టు చేసి నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనకు మద్దతుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా దానం, అనిల్ కుమార్ మాట్లాడారు.

అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జేఎన్‌యూ ఢిల్లీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన సత్యనారాయణ పలు రాష్ట్రాల్లోని ఈపీఎఫ్‌వో అడ్మిన్ విభాగాల్లో సేవలందించారు. దేశంలో పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఈయనకు ఈపీఎఫ్‌వోలో 27 ఏళ్ల అనుభవం ఉంది.

సీఎం రేవంత్‌కు పోలీసుల కృతజ్ఞతలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర పోలీసు సిబ్బంది తరఫున పోలీసు అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. పోలీసు కుటుంబం నుంచి వచ్చిన సీఎంకు పోలీసులు ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులపై పూర్తి అవగాహన ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తెలిపారు. సిబ్బంది వేతనంలో ఎక్కువ మొత్తం పిల్లల చదువులకే పోతుందని, అలాంటిది సైనిక్ స్కూల్ తరహాలో 50 ఎకరాల విస్తీర్ణంలో అన్ని హంగులతో మెరుగైన విద్య పోలీసు పిల్లలకు అందించేందుకు సీఎం చొరవ చూపడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్‌లో మరో రెండేళ్లలో పోలీసు స్కూళ్లు అందుబాటులోకి వస్తాయని చెప్పడంతోపాటు దశల వారీగా పోలీసుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీని తొలగించాలంటూ విద్యార్థినుల ధర్నా

- పీఈటీ జ్యోత్స్న చితకబాదారని విద్యార్థినుల ఆరోపణ
- స్నానం చేస్తుంటే వీడియోలు రికార్డు చేశారంటూ ఆవేదన
- విచారణ జరిపి పీఈటీని తొలగించిన కలెక్టర్

సిరిసిల్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు రోడ్డెక్కారు. తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోన్న గెస్ట్ పీఈటీ జ్యోత్స్నను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో గేట్ దూకి చీకట్లో రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రత్యేక తరగతులకు హాజరు కాని విద్యార్థినులను జ్యోత్స్న చితకబాదిందని వారు ఆరోపించారు. బాత్రూంలో స్నానం చేస్తుంటే తలుపులు విరగ్గొట్టి లోపలికి దూరి ఫోన్‌లో వీడియోలు రికార్డు చేసిందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన విరమించాలని పోలీసులు కోరినా విద్యార్థినులు వినిపించుకోలేదు. చివరకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు డీఈవో రమేష్ విద్యార్థినులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అనంతరం కలెక్టర్ పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. పీఈటీని విధుల్లో నుంచి తొలగించారు.

ప్రజాకోర్టు నిర్వహించి ఇద్దరు గిరిజనులను చంపిన మావోయిస్టులు

చర్ల, అక్టోబర్ 12: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ప్రజాకోర్టు నిర్వహించి మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా జెప్పెమార్క గ్రామానికి చెందిన మాద్విసుజా (46) పొడియరం కోసా (40) అనే ఇద్దరు గిరిజనులతో పాటు పొడియం హిడ్మా అనే ఓ విద్యార్థిని మావోయిస్టులు కొద్ది రోజుల క్రితం కిడ్నాప్ చేశారు. వీరిని విచారించేందుకు గురువారం అడవుల్లో ప్రజాకోర్టు నిర్వహించారు. అనంతరం మాద్విసుజా, పొడియం కోసాను పోలీసు ఇన్‌ఫార్మర్‌లుగా నిర్ధారించి ఉరివేసి హత్య చేశారు. విద్యార్థి హిడ్మాను విడుదల చేశారు. మాద్విసుజా, పోడియం కోసా మృతదేహాలకు పోలీసు ఇన్‌ఫార్మర్లుగా పేర్కొంటూ మావోయిస్టులు కరపత్రాలు అంటించారు. బీజాపూర్ జిల్లాలో ఈ ఘటన సంచలనంగా మారింది.

దసరాకు ఏపీకి 12 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండుగల సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. అక్టోబరు 2 నుంచి నవంబరు 7 మధ్య సికింద్రాబాద్- శ్రీకాకుళం మార్గంలో 12 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ప్రతి బుధ, గురువారాల్లో నడిచే ఈ ప్రత్యేక రైళ్లకు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుందని గురువారం రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లకు అన్నీ త్రీటైర్ ఏసీ కోచ్‌లే ఉంటాయని ఆయన తెలిపారు.

కారులో అక్రమంగా బంగారం తరలింపు

- రూ. 2.95 కోట్ల బంగారం స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా విదేశీ బంగారాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రూ. 2.95 కోట్ల విలువైన 3982.070 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని కారుని సీజ్ చేశారు. కారులో బంగారం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో గురువారం హైదరాబాద్ శివారులో డీఆర్‌ఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. కారులో డ్రైవర్ పక్కసీటు డ్యాష్ బోర్డు కింది భాగంతోపాటు కారు వెనుక భాగంలో ప్రత్యేకంగా రూపొందించిన సొరుగుల్లో బయటకు కనిపించకుండా బంగారం దాచడాన్ని గమనించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు బంగారాన్ని ఎవరికి చేరవేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నామని డీఆర్‌ఐ అధికారులు చెప్పారు.

బాలికలతో ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన

- ఒకరికి దేహశుద్ధి.. పెద్దపల్లి జిల్లాలో ఘటన

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 12: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు కొన్ని రోజులుగా బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయాన్ని బాలికలు కుటుంబసభ్యులకు తెలపడంతో గురువారం వారు గ్రామస్థులతో కలిసి పాఠశాలకు వచ్చి ఒక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఉపాధ్యాయుల వేధింపులపై పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు విద్యార్థినులు ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం తెలియజేశారు. అయినా ఉపాధ్యాయుల తీరు మారలేదు. దీంతో బాలికలు ప్రధానోపాధ్యాయుడికి బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాలికల కుటుంబసభ్యులు, గ్రామస్థులకు విషయం తెలియడంతో వారు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన మరో ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరు కాలేదు. అతడు ముందస్తు సమాచారం లేకుండానే సెలవు పెట్టినట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

సైబర్ నేరగాళ్లు కాదు..


సైబర్ బందిపోట్లు!

ఏఐ ఆధారిత సైబర్ నేరాలతో మరింత ముప్పు.. బ్యాంకు ఖాతాల్ని కాదు.. డబ్బు సీజ్ చేయాలి

- వ్యక్తిగత భద్రతలాగానే ఆన్‌లైన్ భద్రత కూడా
- ప్రజల వివరాలన్నీ ఆన్‌లైన్ అంగట్లో అమ్మకానికి
- 'సోషల్' వేధింపుల బారినపడుతున్న యువత
- కఠిన శిక్షలు పడేలా చట్టాలు రూపొందించాలి
- సైబర్ కేటుగాళ్ల బారిన పడ్డ నష్టపోయినవారు గంటలోగా ఫిర్యాదు చేస్తే ఎక్కువ ప్రయోజనం

సీఆర్‌సీఐడీఎఫ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ వెల్లడి






హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నానాటికీ గణనీయంగా పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడాలంటే ప్రజల్లో వాటిపై అవగాహన, అప్రమత్తత ముఖ్యమని.. సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ సైబర్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ (సీఆర్‌సీఐడీఎఫ్) వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ ప్రసాద్ పాటిబండ్ల తెలిపారు. ఏఐ, డీప్ ఫేక్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల సాయంతో సైబర్ నేరగాళ్లు మున్ముందు మరింత పెద్ద ఎత్తున మోసాలకు తెగబడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులను మోసం చేసి వారి పదవీ విరమణ ప్రయోజనాలను దోచుకుంటున్నవారిని కేవలం 'సైబర్ నేరగాళ్లు' అంటే సరిపోదని.. వారిని 'సైబర్ బందిపోట్లు'గా వ్యవహరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. బందిపోట్ల విషయంలో ఎంత కఠినంగా వ్యవహరిస్తారో అలాగే వీరిపట్లా వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత భద్రత ఎంత ముఖ్యమో.. ఆన్‌లైన్ భద్రత కూడా అంతే ముఖ్యమని, కానీ మనదేశంలో ప్రజల వ్యక్తిగత సమాచారమంతా ఆన్‌లైన్ అంగట్లో అమ్మకానికి వస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. పోలీసులు, అధికార యంత్రాంగం ప్రోయాక్టివ్, రియాక్టివ్, ప్రిడేటివ్ విధానాలను అనుసరించడం ద్వారా సైబర్ నేరాలను ముందుగా గుర్తించి నిరోధించే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ బందిపోట్లకు గరిష్ఠ శిక్ష పడేలా చట్టాలను రూపొందించడం, పౌరుల సమాచారం బయటకు పొక్కకుండా చూడటం, డేటా చోరులపై కఠిన చర్యలు తీసుకోవడం, సిమ్ కార్డుల విక్రయంపై గట్టి నిఘా పెట్టడం, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (డీపీడీపీ) 2023 వంటి చట్టాలను కఠినంగా అమలు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. విలువైన సూచనలు చేశారు. అందులో కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

- సామాజిక మాధ్యమాల్లో అధిక సమయం చురుగ్గా ఉంటున్న యువతే ఎక్కువగా సైబర్ వేధింపుల బారినపడుతున్నారు. ఫొటోల మార్ఫింగ్, ట్రోలింగ్, అసభ్య సందేశాల వంటివి ఎదుర్కొంటున్నారు. కొందరి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని సైబర్ బందిపోట్లు రకరకాల మార్గాల్లో రూ.లక్షల నుంచి రూ.కోట్లు దోచేస్తున్నారు. అలాంటివి జరిగినప్పుడు.. బాధితులు గంటలోపు ఫిర్యాదు చేయాలి. దీన్ని గోల్డెన్ అవర్ అంటారు.
- పోలీసులు, అధికారులు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన, అప్రమత్తత పెంచాలి. ప్రజలకు చెందిన సున్నిత సమాచారం లీక్ కాకుండా చూడాలి. ఇలాంటి నేరాల కట్టడికి డిజిటల్ ఫోరెన్సిక్స్‌ను విరివిగా వినియోగించాలి. నిబంధనలు కఠినతరం చేసి, సిమ్ కార్డుల దుర్వినియోగం జరకుండా చూడాలి.
- పట్టుబడిన సైబర్ బందిపోట్లకు కఠిన శిక్షలు లేకపోవడంతో భయం లేకుండా పోయింది. సులభంగా బెయిల్‌పై బయటకు వస్తామన్న ధీమా ఉంది. కాబట్టి సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసి.. వారికి కఠిన శిక్షలు పడేలా చేయాలి.
- పోలీసు దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు సైబర్ బందిపోట్లు కొత్తకొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. కాజేసిన డబ్బులో కొంత మొత్తాన్ని మాల్స్‌లో షాపింగ్‌కు, పెట్రోల్ బంకులు, ఇతర దుకాణాల్లో కొనుగోళ్లకు, బిల్లుల చెల్లింపులకు ఖర్చు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అధికారులు ఆయా ఖాతాలన్నింటినీ సీజ్ చేస్తున్నారు. దీనివల్ల ఆయా నేరాలతో ఎలాంటి సంబంధమూ లేనివారు ఇబ్బందిపడుతున్నారు. అలా జరగకుండా చట్టాలను సవరించాల్సిన అవసరం ఉంది. ఖాతాదారుడి ప్రమేయం లేకుండా మోసపూరిత లావాదేవీలు జరిగితే బ్యాంకు ఖాతాను కాకుండా బ్యాంకు ఖాతాల్లోకి వచ్చిన డబ్బును మాత్రమే ఫ్రీజ్ చేయాలి.

ఏఐ సెక్స్‌టాయ్స్‌తో జర భద్రం



ఇటీవలికాలంలో పాశ్చాత్య దేశాల్లో కొత్తగా "సైబ్రోతల్స్" పేరుతో వ్యభిచారగృహాలు నడుపుతున్నారు. వాటిలో..శృంగార సుఖాన్ని అందించే ఏఐ ఆధారిత సెక్స్ టాయ్స్ ఉంటాయి. మన దేశంలో కూడా వీటిని దిగుమతి చేసుకుంటున్నారు ప్రస్తుతం ఇవి గోవాలో అందుబాటులో ఉన్నాయి. ఈ ఏఐ సెక్స్ టాయ్స్ తమ వద్దకు వచ్చిన వ్యక్తులు ప్రవర్తించే తీరు, వారి మానసిక, శారీరక పరిస్థితి, మూడ్ స్వింగ్స్ వంటివాటి వివరాలను కూడా సేకరించి సర్వర్లలో భద్రపరుస్తున్నాయి. కొందరి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు కూడా సేకరిస్తున్నాయి. అలాంటివాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

ఇలా జాగ్రత్త పడదాం..



మనం విలువైన డాక్యుమెంట్లు, నగలు, నగదు దాచుకోవడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటామో ఆన్‌లైన్‌లోనూ అలాగే జాగ్రత్తపడాలి. మొబైల్, లాప్‌టాప్, వైఫై, పీసీలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలి. అంకెలు, అక్షరాలు, గుర్తులను వాడి సంక్లిష్టమైన పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలి. తరచూ పాస్‌వర్డ్‌లు మార్చుతుండాలి.

- ఫిర్యాదులు, సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే వాడాలి.
- బ్యాంకుల పేరుతో వచ్చే ఏపీకే లింక్‌లను తెరవకూడదు.
- కొత్త నెంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్ రిసీవ్ చేసుకోవద్దు.
- పోలీసులు, బ్యాంకు అధికారులమంటూ ఎవరు ఫోన్ చేసినా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పకూడదు. సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను లాక్ చేసుకోవాలి.
- మోసం జరిగిన వెంటనే 1930కి ఫోన్ చేసి (లేదా) సైబర్ క్రైం పోర్టల్ ద్వారా (లేదా) స్థానిక పోలీస్‌స్టేషన్‌లో.. ఫిర్యాదు చేయాలి. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే.. ఖాతా ఫ్రీజ్ చేసి, పోగొట్టుకున్న డబ్బులు కాపాడే అవకాశం ఉంది.



ఏడు నెలల చిన్నారి మృతి..

డాక్టర్‌పై కత్తితో దాడి

- వైద్యం వికటించడంతోనే.. పాప చనిపోయిందని ఆరోపణలు
- సీపీకి ఐఎంఏ ఫిర్యాదు
- నేడు పెద్దపల్లి, కరీంనగర్‌లో..ఓపీ సేవలు బంద్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిపై కత్తితో దాడి జరిగింది. ఏడు నెలల చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందడంతో.. వైద్యం వికటించడమే ఆమె మరణానికి కారణమంటూ బంధువులు డాక్టర్‌పై ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. పెద్దపల్లి పట్టణంలోని చింతలవాడకు చెందిన ఖదీర్, రేష్మ దంపతుల ఏడు నెలల పాప మూడ్రోజుల క్రితం అనారోగ్యానికి గురవ్వడంతో.. స్థానిక సిద్ధార్థ ఆస్పత్రికి తీసుకువచ్చారు. గురువారం పరిస్థితి విషమించడంతో ఆ చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. డాక్టర్ సూచన మేరకు చిన్నారిని తండ్రి ఖదీర్ అంబులెన్స్‌లో కరీంనగర్ తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మందులు ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్లే చిన్నారి మృతిచెందిందంటూ ఖదీర్ కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆస్పత్రిలో ఉన్న అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. డాక్టర్‌పై కత్తితో దాడి చేశారు. బయటకు వచ్చిన డాక్టర్.. రాజీవ్ రహదారి వెంట పరుగులు తీశారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. ఆ ప్రాంతంలో సుమారు నాలుగు గంటల పాటు ఉద్రిక్త వాతవరణం నెలకొంది. పోలీసులు, స్థానికులు నచ్చజెప్పే ప్రయత్రం చేసినా.. ఆందోళనకారులు వినలేదు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఘటనా అక్కడికి చేరుకొని, వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. డాక్టర్‌పై దాడి చేయడంపై ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమాకాంత్ కలెక్టర్ శ్రీకోయహర్షకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకునే వరకు పెద్దపల్లిలో వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు. సీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చినట్లు ఐఎంఏ సభ్యులు తెలిపారు. కాగా.. కరీంనగర్‌లో కూడా శుక్రవారం ఓపీ సేవలను నిలిపివేయనున్నట్లు ఐఎంఏ ప్రకటించింది.

ఏచూరి మరణం తీరని లోటు

ఆయన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే.. .. సీఎం రేవంత్‌రెడ్డి

- నిరంతర పోరాటయోధుడు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- కార్మికలోకానికి తీరని లోటు:కేసీఆర్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



ఖమ్మం జిల్లా సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు

వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఏచూరి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన సీఎం.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీతారాం మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు అని రేవంత్ పేర్కొన్నారు. ఏచూరి పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి అడుగుపెట్టి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా జాతీయ రాజకీయాల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. కాగా సీతారాం ఏచూరి మృతి పట్ల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి మృతి జాతీయ రాజకీయాలకు తీరనిలోటని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఏచూరి మరణం దిగ్ర్భాంతి కలిగించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఏచూరి మరణం జాతీయ రాజకీయాలకు తీరని లోటు అని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. ఏచూరి మరణ వార్త తెలియగానే ఎయిమ్స్‌లో ఉన్న ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఏచూరి మరణం పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం భారత కార్మిక లోకానికి, లౌకికవాదానికి తీరని లోటని పేర్కొన్నారు. ఏచూరి మరణం తనను తీవ్ర దిగ్ర్భాంతికి గురి చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఏచూరి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఏచూరి మరణం తనకెంతో బాధను కలిగించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏచూరి మరణవార్త తనను తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసిందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం కోసం ఏచూరి నిరంతరం పోరాడారన్నారు. శ్రామికులు, రైతుల కోసం నిరంతరం పోరాటం చేసిన నేత ఏచూరి అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఏచూరిని తెలుగువారు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, సైద్ధాంతిక విభేదాలు, భిన్నాభిప్రాయాలు ఎన్ని ఉన్నా ప్రజల కోసం పనిచేసిన వారిని గౌరవించడం భారతీయ సంస్కృతి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌ను కోల్పోవడం తీరని లోటు అని, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు.

సీపీఎం సింబల్ సీతారాం : పార్టీ నాయకులు

సీపీఎం పార్టీకి లోగో ఉన్నా.. పార్టీ ముఖచిత్రంగా సీతారాం ఏచూరి కనిపించేవారని పార్టీ నాయకులు చెప్పుకునేవారంట. పార్టీపై ఆయన అంతగా ప్రభావితం చూపారని సీపీఎం సీనియర్ నాయకుడు వైవీ 'ఆంధ్రజ్యోతి'కి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టు నాయకులతో సత్సంబంధాలు కొనసాగించిన సీపీఎం నాయకుల్లో ఏచూరికి ప్రత్యేక గుర్తింపు ఉందని పార్టీ నాయకులు చెబుతుంటారు. ఆయన మామ ఉమ్మడి ఏపీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మోహన్ కందా.. ఆయన ఇంట్లోనే ఉంటూ ఏచూరి కొంతకాలం చదువుకున్నారు. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.

ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

ఏచూరి మరణంపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఏచూరి మరణం తీవ్ర మనోవేదన కలిగించిందని సీఎం పేర్కొన్నారు. 'భారత రాజకీయాల్లో ఆయన ఒక పెద్ద శిఖరం. కింది స్థాయి నుంచి ఎదిగి దేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయ స్థానం పొందారు.. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా ఏచూరి మరణవార్త తెలిసి దిగ్ర్భాంతికి గురయ్యానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటు అని తెలిపారు. కాగా ఏచూరి సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలను సాధిద్దామని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఏచూరికి నివాళులర్పించింది.

ఏచూరి నాకు మంచి స్నేహితుడు: వెంకయ్య

సీతారాం ఏచూరి మృతి పట్ల మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి తనకు మంచి స్నేహితుడు అన్నారు. సైద్ధాంతికంగా వ్యతిరేక భావజాల పార్టీలో ఏచూరి కొనసాగినా..వ్యక్తిగతంగా ఆయనతో తనకు సన్నిహిత సంబంధాలు ఉండేవని తెలిపారు. పలు జాతీయ అంశాలపై పరస్పరం చర్చించుకునే వారమన్నారు. ఏచూరి కుటుంబసభ్యులకు వెంకయ్యనాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశానికి తీవ్రనష్టం: తమ్మినేని

మతోన్మాదం పెచ్చరిల్లుతున్న ప్రస్తుత తరుణంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీవ్ర నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలు కీలకంగా మారిన సమయంలో ఆయన మృతి బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లా సీపీఎం కార్యాలయంలో గురువారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఏచూరి మృతికి తెలంగాణ రాష్ట్ర సీపీఎం కమిటీ తరఫున తీవ్ర సంతాపం ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు కూనంనేని

ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. 'విద్యావేత్తగా ఉన్న ఏచూరి సీపీఎంలో చేరి క్రియాశీలంగా నిలిచారు. అనేక ప్రజా, కార్మికోద్యమాలను నాయకత్వం వహించారు. దేశం బలమైన నాయకుడిని కోల్పోయింది' అని కూనంనేని పేర్కొన్నారు.

జేఎన్‌యూలో ఏచూరి నాకు సీనియర్

హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఏచూరి మృతి పట్ల హైదరాబాద్ మెట్రో రైలు (హెచ్‌ఎంఆర్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సంతాపం తెలిపారు. 1977-81లో జేఎన్‌యూలో చదివేటప్పుడు తనకు ఏచూరి సీనియర్ అని, అప్పుడు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకుడిగా విద్యార్థి ఉద్యమాలలోనూ, సీపీఎం విప్లవ రాజకీయ కార్యక్రమాలకు హాజరవుతూ పేద ప్రజల సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తుచేశారు. తాము ఆయనను ప్రేమతో 'సీతా' అని సంబోధించే వాళ్లమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● శుక్రవారం 13 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్, ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్‌ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

ఎన్ఐటీసీలో ట్రేడ్ కోర్సులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్(ఎన్ఐటీసీ)- క్రాఫ్ట్‌మెన్ ట్రెయినింగ్ స్కీమ్(సీటీఎస్) కింద నిర్వహిస్తున్న ట్రేడ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరి వయసు 2024 ఆగస్టు 1 నాటికి పద్నాలుగేళ్లు నిండి ఉండాలి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందినవారికి బస్‌పాస్ సౌకర్యంతోపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. ఈ కోర్సులు పూర్తిచేసినవారికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్(ఎన్‌సీవీటీ) నుంచి నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ లభిస్తుంది. పీఎస్‌యూలు సహా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో సబార్డినేట్ల నియామకానికి ఈ సర్టిఫికెట్ తప్పనిసరి.

కోర్సులు-సీట్లు

- హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సులో 26 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది.
- ఫిజియోథెరపి టెక్నీషియన్ కోర్సులో 11 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది.
- డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో 11 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి రెండేళ్లు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** www.nitcindia.com



అహ్మదాబాద్ ఐఐఎంలో పీహెచ్‌డీ



అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంఏ) - పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నుంచి అయిదేళ్ల వరకు ఉంటుంది. మొదటి రెండేళ్లు ఇంటెన్సివ్ కోర్సు వర్క్, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. తరవాత డాక్టోరల్ డిజర్టేషన్ ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, పబ్లిక్ సిస్టమ్స్, స్ట్రాటజీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఏదేని మాస్టర్స్ డిగ్రీ/రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసినవారు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ, పీజీ స్థాయుల్లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/సీఎస్/సీఎంఏ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2025 డిసెంబరు 31 నాటికి సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ లేదా స్పెషలైజేషన్‌ను అనుసరించి నిర్దేశిత స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ ఉండాలి. విదేశీ విద్యార్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ స్కోర్ ఉండాలి.

స్పెషలైజేషన్‌లు-స్టాండర్డ్ టెస్ట్ స్కోర్‌లు

ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్: జీఆర్ఈ/జీమ్యాట్/యూజీసీ-జేఆర్ఎఫ్/ఐకార్-ఎస్ఆర్ఎఫ్

ఎకనామిక్స్, ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్, పబ్లిక్ సిస్టమ్స్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్: జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్

ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, స్ట్రాటజీ: జీఆర్ఈ/జీమ్యాట్

హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్: జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్

ఆర్గనైజేషనల్ బిహేవియర్: జీఆర్ఈ/జీమ్యాట్/యూజీసీ జేఆర్ఎఫ్

ఎంపిక: క్యాట్ వ్యాలిడ్ స్కోర్/స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి 2025 మార్చి-ఏప్రిల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.42,000; కాంప్రెహెన్సివ్ ఎగ్జామ్ పూర్తిచేసిన తరవాత నెలకు రూ.45,000; టీఏసీ ఆమోదించిన థీసిస్ సమర్పించిన తరవాత నెలకు రూ.50,000 చెల్లిస్తారు.

- కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.35,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ పేపర్లు సమర్పించినవారికి రూ.4,00,000ల వరకు రీయింబర్స్‌మెంట్ లభిస్తుంది. ఫీల్డ్ వర్క్, డేటా కలెక్షన్ నిమిత్తం రూ.2,00,000; స్టార్టప్ గ్రాంట్ కింద రూ.1,00,000లు ఇస్తారు. హెచ్ఆర్ఏ కింద నెలకు రూ.15,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; రిజర్వ్‌డ్ వర్గాల వారికి రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 19 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.iima.ac.in

బీఐఎస్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 345

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు

- అసిస్టెంట్ డైరెక్టర్: **3 పోస్టులు**

గ్రూప్-బి పోస్టులు

- పర్సనల్ అసిస్టెంట్: **27 పోస్టులు**
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **43పోస్టులు**
- అసిస్టెంట్: **1 పోస్టు**
- టెక్నికల్ అసిస్టెంట్: **27 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు

- స్టెనోగ్రాఫర్: **19 పోస్టులు**
- సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **128 పోస్టులు**
- జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **78 పోస్టులు**
- సీనియర్ టెక్నీషియన్: **18 పోస్టులు**
- టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రాక్టికల్ అసెస్‌మెంట్, రాత పరీక్ష, టెక్నికల్ నాలెడ్జ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: https://www.bis.gov.in/



ఎన్‌టీపీసీలో డిప్యూటీ మేనేజర్లు

ఖాళీలు 250

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌టీపీసీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రికల్, మెకానికల్, సీ అండ్ ఐ, సివిల్

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.70,000 - రూ.2,00,000

గరిష్ఠ వయోపరిమితి: 40 ఏళ్లు

దరఖాస్తు ప్రారంభం: సెప్టెంబరు 14

చివరి తేదీ: సెప్టెంబరు 28

వెబ్‌సైట్: https://ntpc.co.in/

బీహెచ్ఈఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 100

హైదరాబాద్ రామచంద్రపురంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)...ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్

అర్హత: సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్/ఎస్ఎస్‌సీ, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులు ఐటీఐలో కనీసం 60 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అసెస్‌మెంట్ టెస్ట్, మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13

వెబ్‌సైట్: hpep.bhel.com

రైట్స్ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు

ఖాళీలు 15

గురుగావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(మెకానికల్ ఇంజనీరింగ్): **10**
2. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **5**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోర్ తప్పనిసరి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, గేట్-2024 స్కోర్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: https://www.rites.com/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

ఖాళీలు 58

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్: **3 పోస్టులు**
2. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్: **30 పోస్టులు**
3. సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్: **25 పోస్టులు**

విభాగాలు: ఐటీ-ఆర్కిటెక్ట్, క్లౌడ్ ఆపరేషన్స్, సెక్యూరిటీ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెంటర్ ఆపరేషన్స్, ప్రొక్యూర్‌మెంట్ అనలిస్ట్, క్లౌడ్ సెక్యూరిటీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ఐటీ), ఎంబీఏ/ఎంసీఏ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: ఏడాదికి డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు రూ.45 లక్షలు; అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు రూ.35 లక్షలు; సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు రూ.29 లక్షలు.

వయోపరిమితి: డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 31-45 ఏళ్లు; అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 29-42 ఏళ్లు; సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 27-40 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.750; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, మెరిట్ లిస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివర తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: sbi.co.in/

లిటిల్స్



తెలివైన నక్క

ఒక అడవిలోని చెరువులో ఉండే మొసలికి చాలా రోజులుగా అదే చెరువులోని చేపలను తినీ తినీ విసుగు పుట్టింది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుండు అనుకున్నది. వెంటనే తన మిత్రుడైన పీతను పిలిచి, 'నువ్వు అడవిలోకి వెళ్లి.. అన్ని జంతువులకు మొసలి చనిపోయింది అని చెప్పు.అపుడు అవి భయం లేకుండా ఇక్కడికి నీళ్లు తాగడానికి వస్తాయి.

సమయం చూసి, నేను ఏదో ఒక జంతువును పట్టుకుని తింటాను' అని చెప్పింది. పీత వెళ్లి మొసలి చెప్పినట్టే అడవిలో చెప్పింది. దాని మాటలు ఒక నక్క తప్ప మిగతా అన్ని జంతువులు నమ్మాయి.

నక్క మాత్రం 'మిత్రులారా..దీని మాటలు నమ్మవద్దు. మనమే స్వయంగా చెరువు దగ్గరికి వెళ్లి చూద్దాం పదండి' అని జంతువులను బయల్దేరదీసింది. చెరువు దగ్గరికి చేరగానే, నక్క మిగతా జంతువులతో ఇలా అన్నది.' మిత్రులారా..నేను విన్న దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుందట. కాబట్టి ఈ మొసలి తోక కదిలితే మనం నమ్మవచ్చు'అన్నది. ఆ మాటలు విన్న తెలివి తక్కువ మొసలి తాను చనిపోయానని నమ్మించడానికి మెల్లగా తన తోకను కదిలించడం మొదలు పెట్టింది. అదిచూసిన నక్క 'మిత్రులారా.. నేను ఊహించింది నిజమే. ఈ మొసలి చావలేదు నాటకమాడుతుంది. మనం చెరువు దాకా వస్తే మనలో ఎవరినైనా చంపవచ్చని దీని పన్నాగం.అందుకే నా మాట వినగానే తోక కదిలిస్తోంది పదండి ఇక్కడినుండి పోదాం' అంటూ అన్ని జంతువుల ప్రాణాలు ఆ రోజు తన ఉపాయంతో కాపాడింది తెలివైన నక్క. మిగతా జంతువులన్నీ దానికి ఆ రోజు కృతజ్ఞతలు చెప్పాయి.

7 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 408

			1		4
				9	
3				2	
9	2			4	
8	4				
				6	

సుడోకు - 407 సమాధానం

4	7	2	1	3	6
6	9	8	5	2	4
3	1	5	7	9	8
9	8	3	4	6	5
2	4	1	9	8	7
7	5	6	3	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.